
ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



బలవంతపు సంరక్షణ


20-10-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు




కార్మిక భీమాసంస్థ ప్రారంభోత్సవ సందర్భంలో గవర్నర్ జనరల్ రాజగోపాలాచారిగారు, కార్మికమంత్రి జగ్జీవన్ రామ్, జయప్రకాశనారాయణ్, భీమాసంస్థ అధికారి డాక్టరు కటియార్ గార్లతో సంభాషిస్తున్నారు.



కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశానికి వెళ్తున్న పండిట్ నెహ్రూ




తాడేపల్లిగూడెంలో మద్యనిషేధప్రారంభసందర్భపు ఫోటో.



ఈ నెల 3 తేదీన రామచంద్రపురం క్లబ్బులో గాంధీ నెహ్రూగార్ల చిత్రపటావిష్కరణ జరుపుతున్న గౌ. కళావెంకట్రావుగారు

వార్తా చిత్రాలు



గాంధీజయంత్యుత్సవ సందర్భములో రాజమండ్రిలో గాంధీజీ శిలా విగ్రహము ఆవిష్కరణ మహోత్సవమును శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులుగారు జరిపిరి.



లండన్‌లో బ్రిటిష్ ప్రధానమంత్రిబసకు వెళుతున్న పండిట్ నెహ్రూ, కృష్ణమీనన్‌లు.



ఢిల్లీలో గుజరాతీలు, మహారాష్ట్రులు కలసి ఉత్సవం జరుపుతున్న సందర్భంలో సర్దార్ పటేల్‌కు సన్మానం. గాడ్గిల్ ప్రశంసిస్తున్నారు.

సంవత్సరచందా రు. 12-0-0
విడిపత్రిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర ' యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)


సంపుటము **41**
సంచిక **7**

Founder : K. NAGESWARA RAO

సర్వధారి సంవత్సర ఆశ్వయుజ బహుళ విదియ బుధవారము



ఇటలీలో ఒక సుందర దృశ్యము.



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ అక్టోబరునెల 20-వ తేది బుధవారము

లండన్ సమావేశము

"ఇతర రాజ్యాలకు ప్రతికక్షగా ఒక ప్రత్యేక కూటమిని ఏర్పాటు చేయుటగాని, లేక మనకొరకు వర్గ ప్రయోజనములు సాధించుటగాని ఈ సంభాషణల ఉద్దేశ్యము గాదు" అని 1945 వ సంవత్సరము ఏప్రిల్ మాసములో బ్రిటిష్ సామ్రాజ్య ప్రధానామాత్యుల సమావేశములో అప్పటి బ్రిటిష్‌ప్రభుత్వ అధినివేశ శాఖా మంత్రి లార్డ్ క్రాన్‌బర్న్ ప్రకటించి యుండెను. "మనది ఒక కుటుంబము. కనుక మనల నెదుర్కొను వివిధక్లిష్టసమస్యల పరిష్కార విషయములో సాధ్యమైనంతవరకు ఒకేపద్ధతిని సాధించుటకు మనము ప్రయత్నించుట సహజము" అని కూడా లార్డ్ క్రాన్‌బర్న్ ఆ సమావేశముననే ప్రకటించి యుండెను. ప్రస్తుతము లండన్‌లో జరుగుచున్న కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశమును ఏర్పాటు చేసినవారి ఉద్దేశ్యము కూడ ఇందుకు భిన్నమైనది కాకపోవచ్చును. కాని 1945 వ సంవత్సరములో సామ్రాజ్య ప్రధానుల సమావేశమైనప్పటి పరిస్థితులకు, నేటి పరిస్థితులకు ఎంతో వ్యత్యాసమున్నది. అప్పటి కింకను ద్వితీయసంగ్రామము ముగియలేదు. ఆటంబాంబు ప్రయోగము జరుగలేదు. ఇప్పుడు తృతీయ ప్రపంచసంగ్రామమును గురించిన ప్రసంగములనేగాక, అట్టి సంగ్రామమునకు విపుల సన్నాహములు జరుగుచున్నట్లును వినుచున్నాము. ఆటంబాంబుకు విరుగుడు లేకున్నను, అంతకంటె అధిక విధ్వంసకశక్తిగల ఆయుధములు తయారగుచున్నవని కూడ ప్రపంచ రాజ్యాంగవేత్తలు ప్రకటించుచుండిరి. యుద్ధము సంభవమా అను విషయమున ఎవ్వరికి ఎట్టి సందేహము ఉన్నట్లు కన్పించుటలేదు. ఈ యుద్ధము ఎప్పుడు అన్న విషయముననే ఎవ్వరు ముందుకు ప్రకటించుటకు సాహసించుట లేదు.

ఇట్టి అసాధారణ పరిస్థితులలో జరుగుచున్న బ్రిటిష్ కామన్వెల్తు ప్రధానుల సమావేశము కేవలము అంతరధినివేశ సమస్యలను ప్రధానముగాను, ప్రపంచ పరిస్థితులను స్థూలముగాను చర్చించి వదలివేయుదురని ఎవ్వరూ భావింపరు. ఉక్కు తెర వెనుక రష్యా కమ్యూనిస్టు కూటమిని నిర్మించుచు తన అనుయాయుల సంఘటిత పరచుచుండిన, తెర ఇవతల బ్రిటన్ అమెరికాల నాయకత్వమున కమ్యూనిస్టు ప్రతికూలకూటమి ఏర్పాటుకు ప్రబల సన్నాహములు జరుగుచున్నవి. లండన్ సమావేశము ఇట్టి నిర్మాణకలాపమున ప్రధానమైనదని అంగీకరింపక తప్పదు. గత సంగ్రామము వరకు బ్రిటన్ అమెరికాలు రష్యాకు ప్రతిగ జపానును బలపరచుచుంనవి. ఇప్పుడు ప్రాచ్యరంగమున జపాన్ స్థానమును కెనడా, ఆస్ట్రేలియా, సింహళ, భారతదేశములు కలసి ఆక్రమింపవలసియుండును. బ్రిటిష్ పారిశ్రామికుల సమావేశమునందు విదేశాంగ మంత్రి ఎర్నెస్ట్ బెవిన్ గత వారము చేసిన ప్రకటన ఆంతర్యమిదియే. ఇందువలన లండన్ సమావేశము కేవలము "సాంఘిక సంపర్కం" కాదని దానికి ప్రత్యేక రాజకీయ సైనిక ప్రాధాన్య మున్నదని స్పష్టమగుచున్నది. కనుకనే రెండవ వారము సమావేశమున అంతర్జాతీయ రాజకీయ సమస్యలకు, రక్షణ సమస్యకు, విశేషప్రాధాన్య మిచ్చుట జరిగినది.

కామన్వెల్తునందు ప్రస్తుతము ఇతర అధినివేశములతో సరిసమానమైన స్థాయినే భారతదేశము అనుభవించుచున్నది. క్రిప్సు ప్రతిపాదనలే భారతదేశమునకు ఇట్టి స్థాయిని ఇచ్చియుండెను. కాని ఇతర అధినివేశములందు భారతీయులకు అట్టి సమాన గౌరవము లేకున్నది. అంతేగాక పాకిస్థాన్ భారతదేశములకు సంబంధించిన వివాదలోను, హైదరాబాద్ విషయములోను బ్రిటిష్ ప్రభుత్వము అనుసరించిన విధానము సబబుగగాని, సవ్యముగ గాని లేదు. భారతదేశమును కామన్వెల్తులో ఉంచగోరు వారవలంబింపవలసిన వైఖరి ఇది కాదు. చర్చిల్ విషపూరిత ప్రకటనల కిచ్చిన సమాధానమునందు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఈ విషయమును స్పష్టముచేసియుండిరి. భారతదేశము కామన్వెల్తులో ఉండుట తన షరతుల పైననేగాని ఇతరుల అవసరముల, అభిమతముల ననుసరించి ఎన్నటికిని కాజాలదు. భారత ప్రధానామాత్యు డీ విషయమును స్పష్టముచేసియుండునని విశ్వసింపవచ్చును.

కాని భారతదేశము ఎడల అమెరికా ప్రభుత్వవైఖరికూడ ఈ నిర్ణయము పైననే ఆధారపడియుండవచ్చును. లండన్ సమావేశ నిర్ణయమును బట్టియే ప్రాచ్యదేశములకు ప్రత్యేక మార్షల్ పథకమును తయారుచేయుట నిర్ణయము కావచ్చును. అమెరికను అధికార, అనధికార ప్రకటనలనుబట్టి కామన్వెల్తు స్థిరముగ నుండుటనే ట్రూమన్ ప్రభుత్వము భావించుచున్నట్లు స్పష్టమగుచున్నది. భారత ప్రధాని జార్జి మార్షల్‌తో సంప్రతించినపు డీ విషయముకూడ చర్చకు వచ్చియుండును. ప్రపంచము రెండు వర్గములుగ విభాగమైనపుడు భారతదేశము వంటి దేశములు ఎటూ చేరక తటస్థముగ నుండుట సాధ్యము గాక పోవచ్చును. అంతియెగాక భారతదేశము ఇప్పటి చిక్కులను పరిష్కరించుకొని కడతేరునాటికి బ్రిటన్ అమెరికాల వైఖరియందు మార్పేర్పడవచ్చును. అమెరికాలో రిపబ్లికన్ అభ్యర్థి అధ్యక్షుడై, బ్రిటన్‌లో కన్సర్వేటివ్‌లు అధికారమునకు వచ్చుట జరిగిన భారతదేశము తమ విధానమును పూర్తిగ మార్చుకొనవలసి యుండును. ఇదివరకే కామన్వెల్తు ప్రతినిధులు ప్రాంతీయరక్షణ ఏర్పాట్లు జరుగవలెనని, సైనిక వ్యవహారముల వికేంద్రీకరణ జరుగవలెనని సూచించి యుండిరి. తదనుగుణముగ పశ్చిమ యూరప్‌లోవలెనే పసిఫిక్, హిందూ మహాసముద్ర ప్రాంతమునకు కూడ రక్షణసంఘ మేర్పడవచ్చును. భారతదేశము, పాకిస్థాన్, బర్మా, సింహళముల ధోరణిని తెలుసుకొని గాని ఈ విషయమున ఒక నిర్ణయమునకు వచ్చుట క్షేమకరము గాదు. బర్మా, చైనా, పరిస్థితులు అస్థిరముగ నున్నవి. అవి స్థిరపడువరకు భారతదేశము తటస్థముగనే ఉండవలసి యుండును.

రాష్ట్రభాష-మాతృభాష

ఈ నవంబరులో భారత రాజ్యాంగ పరిషత్తు, రాజ్యాంగ స్వరూప పత్రపు ముసాయిదాను చర్చించనున్నది. భాషారాష్ట్రముల నిర్మాణ ఆవశ్యకత, భాషారాష్ట్రముల స్వరూపస్థితులు, ఈ సమావేశాంతములోనే, రాజ్యాంగ విధానములోనే నిర్ణయించుట చాల అవుసరమయి యున్నది. ఈతరుణమున, భారతప్రభుత్వ న్యాయశాఖామంత్రి, భాషారాష్ట్ర విభజన ఆవశ్యకతను నిరూపించుచు చెప్పిన వాక్యములు గమనీయములు. వీరే, రాజ్యాంగ ప్రణాళిక తయారుచేయు సంఘమున కధ్యక్షులై యుండుటవలన వీరి ప్రాముఖ్యము మరింత హెచ్చుచున్నది.

యావద్భారతమునకు, ఒకే రాష్ట్రభాషను, ప్రభుత్వభాషగా ఉపయోగించుచో, భాషారాష్ట్రవిభజనకు తాను సుముఖుడననియు, ప్రజాస్వామ్యము ఫలవంతముగ నుండవలె నన్న, "ప్రభుత్వాధికారము, అందరి ప్రయోజనముకొరకుకాక, ఒక వర్గ ప్రాబల్యమునకు, మరొక వర్గనష్టమునకు వినియోగపడు బహుభాషా రాష్ట్రస్థితిని తొలగించుట అత్యవసరమనియు అంబేద్కరుగారు చెప్పిరి. ఇది బహుభాషాప్రాంతములైన ప్రస్తుత రాష్ట్రములలోని ప్రజలకు స్వానుభవసిద్ధమైన సత్యము.

దేశమునంతను ఏకముచేయునది భాషయే యన్న సూత్రము ప్రాథమికమే యైనను, తదితర జీవసూత్రములలో ఒకటిమాత్రమే అని కూడ గుర్తుంచుకొనవలెను. బ్రిటిషు పరిపాలనాంతిమ దినములలో భారతదేశమునంతను, ఏకముచేసినది, ప్రభుత్వభాషగా చెలామణీఅయిన ఆంగ్లము కన్న, సర్వభారతప్రజకు, ప్రాథమికావసరమై ఏకీకరణమొనర్చిన, స్వాతంత్ర్యవాంఛయు, సర్వభారతప్రజకు ఏకముగానున్న, ఆర్థికరాజకీయపరిస్థితులు నని సుబోధకము కాగలదు. రాష్ట్రములలో ప్రభుత్వభాషగా రాగలభాష, మాతృభాషకు ప్రత్యర్థిగాగాక, రాష్ట్రవాసుల ముఖ్యప్రయోజనావసరములకు, అభ్యంతరమైనది కాకుండ నుండగల ప్రమాణములోనే వ్యాప్తిగలదై యున్న తప్ప, భారతదేశమునకు "ఏకభాష" అన్న ఆదర్శములోని ప్రయోజనమే మొదలంట చెడును.

సామాన్యప్రజకు, నిత్యజీవితముతో సంబంధించినంతవరకూ, అనగా కోర్టులు, రిజిస్ట్రేషను, రేవను, తాలూకా, రివిన్యూ, ట్రెజరీ, మొదలైన కచ్చేరీలు, స్థానిక ప్రభుత్వ సంఘాలు, బ్యాంకులు, వాణిజ్య సంస్థలు, విద్యాశాలలు— మొదలైన రాష్ట్రప్రజకు నిత్యజీవిత సంబంధికములైన విషయములలో, వ్యవహారము లన్నియు మాతృభాషలో జరుగక పోయిన, ప్రజాస్వామ్య ప్రాథమికోద్దేశమే నెరవేరదు. రాష్ట్రములకు కేంద్రములకు సంబంధికములైన ప్రభుత్వ వ్యవహారములలో, మాతృభాషతోపాటు కేంద్రప్రభుత్వ రాష్ట్రభాషకును వ్యవహారప్రాముఖ్య ముండుట, రాష్ట్రముల ఐక్యతాకృషికి అవసరము.

ఈ రెండిటియొక్క ప్రమాణము వ్యాప్తినికూడా, ఏ ఉద్దేశముతో, భాషారాష్ట్రములు కావలెనని ప్రజలు కోరుచున్నారో, ఐక్యభారత స్వరూపమునకు, ఆ ఉద్దేశమునకు, పరస్పర విరుద్ధత్వ విభాగితరూపమున, భంగము కలుగకుండా, సమన్వయ స్వరూపమును సృష్టించవలసిన, అత్యవసర కృషిలో, రాజ్యాంగపరిషత్సభ్యు లీ దీక్ష వహించవలసియున్నది.

నేటి ప్రపంచం:

అధినివేశప్రధానులసభ



"పండిత నెహ్రూను మించిన రాజకీయ ధురంధరుడిని నేను ఇంతవరకు ఎక్కడా చూడలేదు. ఆయన ఎదుర్కొన్న బ్రహ్మాండమైన సమస్యలను, అతిక్లిష్ట పరిస్థితులను అవగాహన చేసుకున్నవారే ఆయన సాధించిన మహత్కార్యాలను సక్రమంగా గణుతించగలరు... భారతదేశం కామన్వెల్తు రాజ్యకూటమిలోనే వుండవలెనా, లేదా అనే సమస్యను అధినివేశ ప్రధానులసభలో పాల్గొని నిర్ణయించడానికి విశ్వభారత నాయకాగ్రణి ప్రధాని నెహ్రూ ఈవారంతే ఇక్కడికి రాబోతున్నాడు. బ్రిటిష్ రాజధానికి ప్రధాని నెహ్రూ ఆగమనం అతి ప్రధానమైన విషయం!" అని ఇండియా మాజీ గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్‌బాటెన్ లండన్‌లో జరిగిన రాయల్ ఎంపైర్ సొసైటీ సమావేశంలో ప్రసంగిస్తూ నెహ్రూ నాయకత్వాన్ని ప్రశంసించాడు.

అక్టోబరు 11 వ తేదీ సోమవారం నుంచీ ఇండియా, పాకిస్థాన్, సింహళం, కెనడా, న్యూజీలెండు, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, దక్షిణరోడీషియా దేశాల ప్రతినిధులు పాల్గొంటున్న ఈ కామన్వెల్తురాజ్య సమావేశం అనేక విధాల అతిప్రధానమైనది.

బ్రిటిష్ ప్రభుత్వ యాజమాన్యంకింద జరుగుతున్న ఈ ప్రముఖ సమావేశంలో భారత ప్రధాని నెహ్రూతోపాటు, పాకిస్థాన్ ప్రధాని లియాకత్ అలీఖాన్, సింహళద్వీప ప్రధాని సేనానాయకే, కెనడా ప్రధాని మెకంజీకింగ్ సుస్తీగా ఉన్నందువల్ల అతని స్థానే నార్మన్ రాబర్ట్సు, న్యూజీలెండు ప్రధాని పీటర్ ఫ్రేజర్, దక్షిణ రోడీషియా ప్రధాని సర్ గాడ్‌ఫ్రే హాగిన్స్, ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి డా॥ హెర్బర్ట్ ఇవాట్, దక్షిణాఫ్రికా గనుల వ్యవహారాలశాఖామంత్రి ఇ. హెచ్. లౌ లు పాల్గొంటున్నారు.


ప్రాచ్యఖండంలో ఇండియా, పాకిస్థాన్, సింహళాలు మూడూ మూడు నూత్న స్వతంత్ర అధినివేశరాజ్యాలైన కారణంచేత కామన్వెల్తు రాజ్య సంబంధాలను నేటి నూత్న పరిస్థితులకు అనుగుణంగా సమీక్షించుకొని సరిదిద్దుకొనవలసిన అగత్యం ఏర్పడింది. భారతదేశ, సింహళ ద్వీపాలు స్వతంత్రం గాకపూర్వం బ్రిటిష్ కామన్వెల్తులో కేవలం శ్వేతజాతికి చెందిన అధినివేశాలకు మాత్రమే సభ్యత్వం వుండేది. ఆనాడు అధినివేశరాజ్యాల వ్యవహారాలన్నీ పూర్తిగా శ్వేతజాతి వ్యవహారాలే. ఇండియా పాకిస్థాన్, సింహళద్వీపాల స్వాతంత్ర్య ప్రతిపత్తితో అధినివేశరాజ్యకూటమి స్వరూప సంబంధాలలోనే అపూర్వపరివర్తనం ఏర్పడింది. శ్వేతవర్ణజాతుల సంపూర్ణ సహకారానికి అనువుగా ఈ రాజ్యకూటసంబంధబాంధవ్యాలను మార్పు చేసుకోవడం ముఖ్యం. కామన్వెల్తు ప్రధానుల సభ చర్చించే ప్రధానాంశాలలో ఇది తప్పకుండా ఒకటై వుంటుంది.

భారతదేశం సర్వతంత్రస్వతంత్రమైన ప్రజాస్వామ్యరాజ్యాన్ని స్థాపించుకోదలచింది. భారతరాజ్యాంగపరిషత్తు తొలి సమావేశాలలోనే ఈ లక్ష్యనిర్వచనం జరగడం, దీనికి సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించడం కూడా జరిగింది. ఈ లక్ష్యనిర్వచనం ప్రకారం భారతదేశం సర్వస్వతంత్రప్రజాస్వామ్య రిపబ్లిక్‌ను స్థాపించుకొన్నా, బ్రిటిష్ కామన్వెల్తులోనే వుండదలచినపక్షాన అధినివేశరాజ్యకూట సంబంధాల నియమనిబంధనలలో పరిపూర్ణమైన మార్పు జరగడం అవసరం. ఇప్పటివరకూ అధినివేశరాజ్యకూటమిలో బ్రిటనుదే అగ్రస్థానంగా, నాటి సంబంధనిర్ణయంలో బ్రిటనుదే పైచెయ్యిగా వున్నది. అధినివేశరాజ్యవ్యవహారాలంటే కేవలం శ్వేతజాతి వ్యవహారాలే కాబట్టి బ్రిటను అధికారం చెలామణీ అయింది. ఇకముందు అది పనికిరాదు. అన్ని అధినివేశాలు హెచ్చుతగ్గులు పాటించక సమానస్థాయిలో సంపూర్ణ మైత్రీభావంతో మెలగవలసిన అవసరం ఇప్పుడు ఏర్పడింది. అధినివేశాలకు చెందిన శ్వేతవర్ణ జాతులు సర్వసమానాధికారాలతో వ్యవహరించవలెనంటే వారి ద్వారా మనము, మన ద్వారా వారూకూడా సమాన ప్రయోజనాలను కాంక్షించి, పొందే అధికారం వుండితీరాలి.

కామన్వెల్తు భవిష్యత్స్వరూపము

ఇంతవరకు బ్రిటిష్ సంబంధికమైన అధినివేశ రాజ్యాలతో, బ్రిటిష్ సామ్రాజ్య రాజ్యకూటమిగాను, బ్రిటిష్ అధినివేశ రాజ్యాల కూటమిగాను "బ్రిటిష్ కామన్వెల్తు" అన్న పేరుతో, బ్రిటన్ సూత్రధారిపాత్ర వహిస్తూ, బ్రిటిష్‌రాజుపట్ల అధినివేశాలన్నీ "రాజభక్తి" ప్రమాణం స్వీకరిస్తూ, కామన్వెల్తు కూటమి తన జీవితం గడుపుకొంది. కనడా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజీలాండులు బ్రిటన్‌తోపాటు శ్వేతపాలక అధినివేశాలే. సామ్రాజ్యభాగాలుగా ఉంటూన్న స్థితిచేత, ఇండియా, పాకిస్థాన్, సిలాన్ అధినివేశాలు, గత పరిస్థితుల బలీయతచేత, కామన్వెల్తు భాగాలుగా ఉన్నాయి.

కామన్వెల్తు ఇన్నాళ్లూ బ్రిటిష్‌వారి యాజమాన్యం క్రిందే నడుస్తూవచ్చిన కూటమి. ద్వితీయ సంగ్రామంలో, ఇల్లాంటి కామన్వెల్తు కూటమి అంటూ ఉండటంవల్ల ప్రపంచఆర్థిక రాజకీయ వ్యవహారాల్లో సమిష్టిగా కొన్ని ప్రయోజనాలు



బెవిన్

రాబట్టుకొనే వీలుందని, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజీలాండు, దక్షిణాఫ్రికా మొదలైన, బ్రిటన్‌మాతృకగా ఉద్భవమైన శ్వేత అధినివేశాలు గ్రహించాయి. యుద్ధానంతరం, స్వతంత్ర ప్రతిపత్తితో సమమైన అధినివేశ ప్రతిపత్తి అందుకొన్న ఇండియా, పాకిస్థాన్, సింహళాలకు, కామన్వెల్తులో భాగాలుగా ఉండటంవల్ల తమకు వచ్చినటువంటి, ఇకముందు రాబోయేటటువంటి లాభనష్టాలను సరిగ్గా బేరీజు వేసికొని సింహావలోకనం చేసుకోగల, విశ్రాంతి అవకాశాలు లభించలేదు. ఈ స్వతంత్ర ప్రతిపత్తితో, ఈ అధినివేశాల ప్రధానులు, కామన్వెల్తు సమావేశంలో పాల్గొనటానికి ప్రప్రథమంగా అవకాశం ఇప్పుడే కల్గింది.

కామన్వెల్తు స్వరూపస్వభావాలు చాలామటుకు మారిపోవలసిన స్థితి అత్యావసరమైంది. ఇండియా, పాకిస్థాన్, సిలోన్‌లు కామన్వెల్తులో ఉండటమా, బైటికి రావటమా— అనే సమస్యకు, ఈ సమావేశంలో అంతర్లీనంగానూ, బహిరంగంగానూ కూడా ప్రాథమిక స్థానం ఏర్పడింది.

అక్టోబరు 11 వ ఈ అధినివేశ మంత్రుల సమావేశాలు ప్రారంభమయాయి.

సమావేశవాతావరణం అంతా చాలా సుహృద్భావంతోనూ, ఉత్సాహపూరితంగానూ, పరస్పర సహకార ఉద్దేశాలతో నూ ప్రారంభమయాయి. పండిట్ నెహ్రూ రాజకీయజ్ఞతనూ, నేటి ప్రపంచపరిస్థితుల్లో ఇండియా అధినివేశప్రాధాన్యతనూ ఉగ్గడిస్తూ, బ్రిటిష్ నాయకులు, "ఇండియా కామన్వెల్తులో ఉండాలి" అన్నమాటను స్పష్టంగా ఉచ్చరించకుండా, ఉండేందుకు కావలసిన పైమెరుగులన్నీ చూపించారు.

"కామన్వెల్తులో ఉండటంమాట, ఎల్లాఉన్నా బ్రిటన్‌తో సంపూర్ణమైత్రీబంధాన్ని నిల్పుకొంటామని" ఆఘాయిదాలోనే పండిట్ నెహ్రూ జవాబు చెప్పాడు. సమావేశాలలో జరిగిన సంభాషణలు, సంప్రదింపులూ అన్నీ అనోటా ఆనోటా తెలియవలసినవిగా ఉన్నాయి తప్ప, యథార్థప్రవచనాలు సూటిగా ఇంకా తెలియలేదు.

మొదటి సమావేశంలో, క్రిప్సు, కామన్వెల్తు యొక్క ఆర్థిక సమస్యలనుగూర్చి విపులంగా చర్చించాడు. ప్రపంచ ఆర్థికస్థితిని స్థూలంగా వివరిస్తూ, కామన్వెల్తుకూ, పశ్చిమ రాజ్యకూటమికీ కల ఆర్థిక బాంధవ్యాలనూ, తత్ఫలితంగా కలిగే సమస్యలూ, పరస్పరం ఒకరి కొకరి కున్న అవసరాలూ ప్రయోజనాలూ, వివరించి, కామన్వెల్తు భాగాలైన స్టెర్లింగ్ దేశాలలో ఉన్న వ్యాపారమాంద్యాన్ని నివారించేందుకు పూనుకొన్న, పూనుకోబోయే, చర్యలూ—వివరించి సభ్యుల అభినందనా లందుకొన్నాడు.

కామన్వెల్తు దేశాలలో ప్రతిదానికీ, భారీ సరుకుల (Capital Goods) అవసరం అధికంగా ఉంది. అందుచేత స్టెర్లింగ్ దేశాలలో ఎక్కడపడితే అక్కడ ఈ వస్తువులను ఈ దేశాలు కొనుక్కోగల అవకాశ ఆవశ్యకతను అధినివేశప్రధానులంతా ఏకగ్రీవంగా వెలిబుచ్చారు. బ్రిటన్ స్వదేశంలో మొదలుపెట్టి జయప్రదంగా కొనసాగిస్తున్న చాతుర్వర్ష ఆర్థిక ప్రణాళికను అంతా అభినందించారు.

మర్నాటికి, బ్రిటిష్‌మంత్రి బెవిన్, అధినివేశమంత్రుల దృష్టిని, ప్రాచ్యఖండంలోని కమ్యూనిస్టుచర్యలమీదికీ, దాన్ని అందరూ కలిసి అరికట్టవలసిన అవసరంమీదికీ తిప్పాడు. స్వతంత్ర అధినివేశమైన ఇండియా, అంతర్జాతీయ రంగంలో ప్రాక్ పశ్చిమ రాజ్యకూటమిలో దేనివైపూ మొగ్గకుండా నిలచిన పరిస్థితిని మార్చి, దూరస్థంగా అల్లా ఉండటానికి వీల్లేదని, కామన్వెల్తుద్వారా, పశ్చిమరాజ్యాల కూటమిలో కలిసి, బ్రిటన్, అమెరికాలపక్షాన నిలిచి ప్రపంచశాంతికి పాటుపడాలని, మరులుగొల్పుతూ, బ్రిటిష్



క్రిప్సు

నాయకులంతా. పత్రికలద్వారానూ, ఉపన్యాసాలద్వారానూ, పండిట్ నెహ్రూకి వినిపించారు.

బ్రిటిష్ కామన్వెల్తు అనే పేరుతీసి, "కామన్వెల్తు ఆఫ్ నేషన్సు" అని పేరుపెట్టి, రాజభక్తిప్రమాణాన్ని తొలగించి, వెస్ట్ మినిస్టర్ స్టేట్యూట్‌లో కొన్ని మార్పులు చేసి, "స్వతంత్రులం అయితీరుతాము" అని చెప్పిన భారతీయుల ఆదర్శానికి, ప్రతిష్ఠాభంగం కలుగకుండా చేస్తే కామన్వెల్తులో ఇండియా ఉండవచ్చు నేమోననీ, బ్రిటన్, కామన్వెల్తు శ్వేత రాజ్యాలు, అమెరికా ఆశిస్తున్నాయి. ఇండియా కామన్వెల్తులోనుండి విడివడటమంటే, సరాసరి రష్యా ప్రభావంలోకి జేరిపోవటమే అనీ, అనీ అనకుండా, ఆస్ట్రేలియా మొదలైన కామన్వెల్తు దేశాలు, ఒక లేనిపోని భీతాంగం కల్పిస్తున్నాయి.

కామన్వెల్తు అధినివేశాలను ముఖ్యంగా బంధించేవి కాని, విడబర్చేవికాని ఆర్థికవ్యాపార బాంధవ్యాలు. ఈ సందర్భంలో అధినివేశ ప్రధానులు చాలా ముఖ్యాంశాలమీద, సమాధానాభిప్రాయాలకు వచ్చినట్లే అనిపిస్తోంది. ఈ అభిప్రాయాల ఫలితంగా, కామన్వెల్తు తరఫున బ్రిటన్ పశ్చిమ యూరప్ రాజ్యాలతో ఎక్కువ సహకారం పొందగలిగే విధానంలో సంప్రదింపులు సాగించవచ్చునట.

ఈ సంభాషణలలో ముఖ్యంగా ఈక్రింది కొన్నివిషయాలు ప్రధానులకు వివరణ అయాయట.

కామన్వెల్తు రాజ్యాలకు, బ్రిటన్ పారిశ్రామిక యంత్రసామగ్రిని, 1938 నుంచి 1948 దాకా ఉన్నదామాషాధరల, నూటికి 63 పాళ్లు చొప్పున హెచ్చించి పంపగలదని తేలిందట.

కనడా "డాలర్ ప్రదేశాలు" సహా కలుపుకొని, స్టెర్లింగ్ దేశాలలో, వ్యాపారాలు అభివృద్ధిచేసుకోవలసిన అవసరాలనూ, అభిలాషనూకూడా అన్ని అధినివేశాలు వెలిబుచ్చాయి.

డాలరు చలామణీ, పెంచుకోటానికై, కనడాను, డాలరుమార్కెట్టుగా చేసుకోవాలనే, అధినివేశాలవారంతా అభిలషిస్తున్నారట.

బ్రిటన్ తయారుచేసే ఎగుమతులు, సరఫరాలు, అమ్మకాలవిషయంలో, తూర్పు కామన్వెల్తు రాజ్యాలకే ప్రాముఖ్యమివ్వాలని కోరుతోంది. కామన్వెల్తు దేశాలకు ఎగుమతు లియ్యవలసిన

(21 వ పేజీ చూడుడు)

డాక్టర్ హెర్బర్టు వెర్ ఎవాట్

ఐక్యరాజ్యసమితి అధ్యక్షుడు



డాక్టరు హెర్బర్టు వెర్ ఎవాట్ ఆస్ట్రేలియా రాజకీయవేత్త. 1894 ఏప్రిలులో జన్మించాడు. ఎవాట్ జీవితము ఆస్ట్రేలియన్ రాజకీయవేత్తలందరిలోకి మంచి ప్రతిభావంతంగా గడిచిందన్నే చెప్పవచ్చును. చరిత్రకారుడు, వేదాంతి, న్యాయవాది, న్యాయాధిపతి, ప్రభుత్వమంత్రి, రాజ్యతంత్రజ్ఞుడు — ఇల్లా బహుభంగిమలలో ప్రసిద్ధికెక్కిన జీవి[illegible] అతనిది.

న్యూ సౌత్ వేల్సు రాష్ట్రం[illegible], ఈస్టు మెయిటులాండు అనే పట్టణంలో ఎవాట్ జన్మించాడు. ఈస్టుమెయిట్లాండ్, బొగ్గుగనుల వాతావరణంలో, హంటర్ నదిఒడ్డున, సస్యధాన్యాలతో ఫలవంతమైన పచ్చని చేల బయళ్ళతో, ద్రాక్షతోటలతో రమణీయమైన కోనలలో ఉన్న పట్టణం.

ప్రభుత్వపు ప్రాథమిక బడిలో చదువు మొదలుపెట్టి, సెయింట్ ఆండ్రూ కాలేజిలో స్కాలర్‌షిప్పుతో చదువుసాగించాడు. అక్కడినుంచి ప్రభుత్వంవారి బర్సరీతో సిడ్నీ విశ్వవిద్యాలయంలో చదివాడు. గణితము, వేదాంతము, న్యాయశాస్త్రము, సారస్వతము, మొదలైన అనేక శాస్త్రాలలో అతనికి ప్రథమ బహుమానాలు వచ్చాయి. బి. యే. ట్రిపిల్ ఫస్టు క్లాసులోను, యం. ఏ. కూడా అల్లాగే ఫస్టుగానూ ఉత్తీర్ణుడయ్యాడు. న్యాయశాస్త్రంలో, బి. ఏ. డాక్టరేట్ చదువుల్లో రెంటిలో కూ[illegible] "యూనివర్సిటీ గోల్డు మెడల్" అతనికే వచ్చింది. డాక్టరేటుకై ఆయన "బ్రిటిష్ రాజ్యాంగ విధానమును" గురించి వ్రాసిన వ్యాసము ప్రమాణ గ్రంథంగా తయారయింది.

చదువుతోపాటు, తదితర విద్యార్థి కార్యకలాపాలలోకూడా, ఎవాట్ ముందు శ్రేణిలోనే ఉండేవాడు. విద్యార్థుల పత్రిక హెర్మిస్‌కు సంపాదకుడుగా ఉండేవాడు. కాలేజి 'అండర్ గ్రాడ్యుయేటు' సంఘానికి అధ్యక్షుడుగా ఉండేవాడు. యూనివర్సిటీ యూనియన్‌కు అండర్ గ్రాడ్యుయేట్లలోనుంచి ఎన్నికఅయిన మొదటి అధ్యక్షుడుకూడా అతనే. యూనివర్సిటీ తరఫున ఆటలలో పోటీలలో పాల్గొన్నాడు. యూనివర్సిటీ స్పోర్ట్సు సంఘానికి, కేవలం ఆటగాడు అవటంవల్లేకాక, ఆటలకు అతను ఇచ్చిన ప్రోత్సాహంవల్లకూడా, అజన్మసభ్యుడయ్యాడు. న్యూసౌత్ వేల్సు క్రికెట్ అసోసియేషనుకు ఉపాధ్యక్షుడుగా ఉండేవాడు. 1938 లో ఇంపీరియల్ క్రికెట్ సమావేశానికి ఆస్ట్రేలియా తరఫున ప్రతినిధిగా వెళ్ళాడు.

విశ్వవిద్యాలయం చదువు పూర్తిఅయాక, తను చదివిన ఆండ్రూస్ కాలేజిలో ట్యూటరుగానూ, సిడ్నీ విశ్వవిద్యాలయంలో న్యాయమీమాంసశాస్త్రంలో లెక్చరర్‌గానూ పనిచేస్తూ, స్వంతంగా తన న్యాయవాదవృత్తిని స్థాపించుకొంటూ వచ్చాడు.

1925 లో, అంటే ప్రాక్టీసు మొదలుపెట్టిన ఏడాదిలోగా, హైకోర్టు జడ్జీలు అయిదుగురికి ప్రతిగా నిలిచి, "ట్రేడ్ యూనియన్ నాయకులనిద్దరిని దేశంలోనుంచి తరిమివేయాలా, అక్కరలేదా" అన్న ఒక పెద్ద కేసులో వాదించి గెలిచాడు. పెద్ద వక్తృత్వంవల్ల కేసు నెగ్గకపోయినా, అతని కృషి, దృక్పథమూ, వెంటనే ప్రజ లందరికీ నచ్చి, అతనికి జాతీయంగా మంచి పేరు తెచ్చాయి. ఆయేడే, న్యూసౌత్ వేల్సు శాసనసభకు సభ్యుడయ్యాడు. మరుసటిసంవత్సరం, ఆస్ట్రేలియన్ కార్మికోద్యమ ప్రతినిధిగా, లండనులో జరుగుతూన్న వరల్డ్ మైగ్రేషన్ కాన్ఫరెన్సుకు హాజరయ్యాడు. 1929 దాకా శాసనసభాసభ్యుడుగా ఉన్నాడు. ఆసంవత్సరంలో కింగ్సు కౌన్సెల్ (ప్రభుత్వ న్యాయవాది) గా అతన్ని ప్రభుత్వం నియోగించింది. వెంటనే ఒక్క ఏడాదిలో 1930 లో, ఆస్ట్రేలియా ఫెడరల్ హైకోర్టు జడ్జీగా ప్రభుత్వం అతన్ని నియమించింది.

పదివేళ్లు, హైకోర్టులో జడ్జీగా పనిచేసి, యుద్ధంరాకతో, స్వదేశ ప్రపంచ అవసరాలను గమనించి, రాజకీయాలలో పనిచేయటానికై, ఎవాట్ ఉద్యోగానికి రాజీనామా యిచ్చాడు.

కార్మికపక్షనాయకుడు జాన్ కర్టిన్‌కు కుడిభుజంగా నిలిచి, 1940 లో న్యూసౌత్ వేల్సు శాసనసభకు బార్టన్ కాన్స్టిట్యుయెన్సీనుంచి సభ్యుడుగా నిలిచి, పెద్ద మెజారిటీతో ఎన్నికలలో నెగ్గాడు. మార్చి 1941 లో కర్టిన్‌తోపాటు, యుద్ధసలహాసంఘ సభ్యుడయ్యాడు.

తర్వాత కర్టిన్ అధిపత్యాన కార్మికపక్షం ప్రభుత్వంలోకి వచ్చినప్పుడు, అటార్నీ జనరల్ గాను, విదేశాంగవ్యవహారమంత్రిగాను నియమితుడయ్యాడు.

పసిఫిక్ రంగంలో యుద్ధప్రమేయం రాకూడదనే వాంఛించాడు. కాని జపాను, అమెరికా కామన్వెల్తులమీద యుద్ధం ప్రకటించేటప్పటికి, అమెరికాకు సహాయంగా తామూ ఉన్నామనీ, తుదిదాకా పోరాడుతామనీ రూజ్వెల్టు అధ్యక్షునికి తంతి నిచ్చాడు.

1942 లో, ఆస్ట్రేలియాకు అమెరికా గ్రేటు బ్రిటన్ల సహాకారాన్ని ఇనుమడించుకోవటం కోసం డాక్టర్ ఎవాట్‌ను, వాషింగ్టన్, లండనులకు, ఆస్ట్రేలియా ప్రభుత్వం పంపించింది. పసిఫిక్ రంగంలోని నిజపరిస్థితులను, వాట్ల తీవ్రతను, ప్రజలలో యుద్ధంవల్ల కలిగిన ప్రభావాలను స్వయంగా పర్యవేక్షించి చూచినవాడు కాబట్టి డాక్టరు ఎవాట్ బ్రిటిష్ అమెరికా రాజకీయవేత్తలకు ముఖ్యుడయ్యాడు. వార్ కాబినెట్‌లోనూ, పసిఫిక్ వార్ కౌన్సిలులోనూ అతణ్ణి సభ్యుడుగా చేర్చుకొన్నారు. బ్రిటన్ అమెరికాలతో కలిసి పనిచేయాల్సిన, త్యాగంచేయాల్సిన అవసరాన్ని తన దేశీయులకు నచ్చచెప్పగలిగాడు. బ్రిటన్ సంతతి ఎక్కడున్నా, ఒకటేనని వాళ్లకు ప్రీతికరంగా నచ్చచెప్పాడు.

1942 అక్టోబరు 1 న, అటార్నీ జనరల్ హోదాలో, రాజ్యాంగవిధానానికి సవరణల ఆపాదిస్తూ, ఒక శాసనం ప్రవేశపెట్టాడు. అంతకు ముందే, "యుద్ధానంతర పునర్నిర్మాణము, కామన్వెల్తు రాజ్యాలవిధి" అన్న 200 పేజీల పుస్తకం ప్రకటించి, బ్రాడుకాస్టులు ఉపన్యాసాలు ఇస్తూ, తన బిల్లుకు ముందునుంచీ ప్రచారంచేశాడు. యుద్ధానంతర పునర్నిర్మాణ విషయాల జోలికొచ్చినా [illegible]త్యాలు నిర్ధారణచేసే అధికారం హైకోర్టు నుంచి తొలగించి, పార్లమెంటుకు చేకూర్చటం ఆ బిల్లుఉద్దేశం. రాజ్యాంగంలో శాశ్వత మార్పుగా ఇది కేవలం అపేక్షణీయంకాదనీ, తాత్కాలికాధికారాలు శాసనసభకు పెంచవచ్చునని 'హైకోర్టుకు తోసి రాజంటం' కూడదనీ, మార్పులు చేసుకొని, బిల్లు అనులులోకి తేదలచారు.

కాని రిఫరెండం లేకుండా రాష్ట్రశాసనసభలే ఆ అధికారం ఫెడరల్ శాసనసభకిచ్చి, రాజ్యాంగవిధానరీత్యా బిల్లు అనులు జరుపమన్నారు. కాని ఆరురాష్ట్రాలలో రెండు రాష్ట్రాలే ఒప్పుకొన్నాయి. కాబట్టి 1944 లో రాజ్యాంగవిధానంలోనే మూలమైన మార్పులు తేవటానికి ప్రజావాక్యం తీసికోవాలని ఫెడరల్ శాసనసభ తీర్మానించుకొంది.

1944 ఆగస్టులో రిఫరెండం జరిగింది. కాని బిల్లుకు కావలసిన మెజారిటీ రాలేక 1942 లో, వెస్టుమినిస్టర్ స్టాట్యూట్ లో మార్పులు రావాలని ఎవాట్ ఇంకో బిల్లు పెట్టాడు. ఆస్ట్రేలియా తన స్వకీయ రాజ్యాంగాధికారాన్ని, యుద్ధానికైనా, శాంతికైనా, లేక స్వవిషయాలలోనైనా, సంపూర్ణంగా వినియోగించుకొనేందుకు, కామన్వెల్తుపర[illegible] ఉన్న వెస్టుమినిస్టర్ స్టాట్యూట్‌లోని అభ్యంతరాలు తొలగించుకోవాలని ఈ బిల్లుఉద్దేశము. ఆస్ట్రేలియా ఫెడరల్‌శాసనసభ 1942 అక్టోబరులో ఈబిల్లును అంగీకరించింది. దీని ఫలితంగా 1944 జాన్యుయరీలో న్యూజీలెండ్, ఆస్ట్రేలియాలు "అధినివేశాలకు కొన్ని విషయాల్లో స్వాతంత్ర్యం ఉండాలన్న సూత్రంమీద ఒక సమాధానం కుదుర్చుకొని, ఆ వాదానికి బాసగా నిల్చాయి.

ఏప్రిల్ 1945 లో, లండనులో రాయల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్సు సభలో మాట్లాడుతూ, చిన్న రాజ్యాలవారి ప్రతిపత్తిని విశదీకరిస్తూ గంభీరంగా ఉపన్యసించాడు. అప్పుడు శాన్‌ఫ్రాంసిస్కో సమావేశానికి ప్రాతిపదికగా జరుగుతూన్న "సామ్రాజ్య సమావేశా"నికి ఆస్ట్రేలియా ప్రతినిధిగా వచ్చాడు. శాన్‌ఫ్రాంసిస్కో సమావేశంలో ఆస్ట్రేలియా ప్రతినిధిగా వెళ్ళి, అక్కడ చాలా ముఖ్యపాత్ర వహించాడు. ఆస్ట్రేలియా ప్రతిపాదించిన 30 సవరణలలో, 28 సవరణలను, ఆ చార్టరులో చేర్చుకొన్నారు. పరులపై ఆధారపడవలసిన అల్పరాజ్యాల ప్రతినిధిగా, అంతర్జాతీయ శాంతిభద్రతలకు కృషిచేసేవారిలో అగ్రగణ్యుడుగా ఎవాటుకు పేరు వచ్చింది. స్వదేశీయ రాజవేత్తల తరహాను మించి, అంతర్జాతీయ ప్రముఖుడుగా, ఎవాట్‌కు పేరుప్రతిష్ఠలు కలిగాయి.

ఇప్పుడు పారిస్‌లో సమావేశసమయానికి, డాక్టరు ఎవాట్ ఐక్యరాజ్యసమితి అధ్యక్షస్థానం అలంకరిస్తున్నాడు.

పరమానందాయ్

మూలం : 'గుడ్‌సోల్జర్ ష్వీక్'

రచన :
జరోస్లావ్ హాసక్

'పరమాయి పై రాజద్రోహ నేరం'

అనుకరణ :
'ఆప్లవాన్'

౧

"అయితే ఫెర్డినాండ్‌ని చంపేశారన్నమాట" అంది—ఇంటి పనిమనిషి ముల్లరమ్మ ష్వీక్‌తో.

(ష్వీక్ పేరు మన ఉచ్చారణకు అనువు కాదు. సార్థకనాముడుగా పరమానందాయి అని వ్యవహరిద్దాము.)

పరమానందాయిని చాలకాలం క్రిందటే సైన్యంలోనుంచి వెనక్కి పంపేశారు. "స్వతస్సిద్ధమయిన మందకొడితనం బుఱ్ఱలో జీర్ణించి ఉందని", సైనిక వైద్యసంఘంవారు నిర్ధారణ చేసి, సైన్యానికి పనికిరాడని ఇంటికి పంపించేశారు.

అప్పటినుంచీ పరమాయి అడ్డజాతి కుక్కలనన్నిటినీ, ఊరివీథుల్లోనే సేకరించి, తోకలు కత్తిరించీ, చెవులు కత్తిరించీ, "జాగిలము," "మహాజాగిలము," "ఉగ్రభైరవము," "మహాశ్వానము", "సింహవంశము," అంటూ, గొప్పజాతి కుక్కలన్న భ్రమలు కల్పించి, కుక్కల రాజాలకు అమ్ముతో, ఆ వచ్చిన స్వల్పంలో జీవితం గడుపుకుంటూండేవాడు. తిరిమ్మా అప్పుడల్లా కీళ్లవాతం అనుభవిస్తూ, మోకాళ్లకు తైలాలు, కొవ్వులూ రుద్దుకొంటూ కూర్చునేవాడు.

ఇప్పుడూ అల్లాగే మోకాళ్లకు మందు రుద్దుకొంటూ తాపీగా కూర్చున్నాడు.

"ఏ ఫెర్డినాండు, ముల్లరమ్మా? నేను ఇద్దరు ఫెర్డినాండుల నెరుగుదును. ఒకడు మందులమ్మే కెమిస్టు ప్రూసా దగ్గిర ఉండేవాడు. ఓనాడు పొరపాటున, తేనె అనుకొని సీసాడు మందారనూనె తాగేశాడు.

"మరిపోతే, ఇహ వాడున్నాడు-ఫెర్డినాండు కొకొస్కా! ఎరువులపేరిట పెంటలన్నీ పోగు చేస్తూంటాడు.

"వీ ళ్ళిద్దరిలో ఎవడైనా లోకానికేం అంత నష్టం లేదు."

"వాళ్లు కాదండీ—ఆర్చిడ్యూక్ ఫెర్డినాండ్! మీ కెరుగరండీ, ఆ ఊరేది—ఆ!—కొనోపిస్తా ఊరివాడు—లావుగా, పొంకంగా ఉండేవాడు, గొప్ప భక్తుడనేవాళ్లు కూడా!"

"అరెరె! రామ్‌రామ్! వాడే! భలేపని జరిగిందే! అయితే ఎక్కడ జరిగిందేమిటి?"

"తెలియదుటండీ! శారాజోవ్ పట్నంలో, రివాల్వరుతో కాల్చి చంపేశారట. మోటారు కారులో పోతున్నాడట. పెళ్లాం కూడా ప్రక్కనుందట."

"హుం! చూడు ముల్లరమ్మా! ఎంత చిత్రం, ఎంత చిత్రం! కారులో పోతుండేనే! పాపం, ఆ పెద్దమనిషి మోటారుకారు కొనుక్కొన్నప్పుడేమన్నా అనుకోగలిగాడా—ఆ కారులోనే ఇల్లా అవుతుందని! అందులో శారాజోవ్‌లో! అంటే బోస్నియాలో అన్నమాటా! ఎవళ్లో, టర్కీవాళ్లే చేసిఉంటారు. కాదూ?

"అయినా మనం, టర్కీవాళ్ళ దగ్గిరనుంచి బోస్నియా, హెర్జ్‌గోవినాలు, లాక్కోకుండా ఉండవల్సింది. ఏమంటావ్! ఊఁ. ఇప్పుడీ ఆర్చ్‌డ్యూక్, భువి వదిలి దివి పట్టాడూ! మరి ఎక్కువ ఎపు బాధపడ్డాడటనా?"

"అక్కడికక్కడే ఆఖరైపోయాడటండీ! చూడండి, ఈ రివాల్వరు లున్నాయే, వీట్లతో జనం ఎక్కువ జోక్యం చేసుకోకూడదండి. వెధవ్వి ఎంత అపాయం! ఆ, అపాయంకదూ? ఈమధ్య ఒక పెద్దమనిషి ఇల్లాగే రివాల్వర్లు తిప్పుకొంటూ తిరిగి, అక్కడ ఆమేడ ఇంట్లో కుటుంబం వాళ్ళ నందరినీ కాల్చివేశాడు. పై పెచ్చు ఇంటినౌకరు ఆ గల్లంతు ఏమిటో చూద్దామని పైకివెళ్తే, వాడినికూడా పేల్చేశాడు."

అంటూంది—ఇంకా ఏదో చెప్తూ ముల్లరమ్మ.

పరమానందాయి, వికసితవదనంతో మొదలు పెట్టాడు.

"కొన్నికొన్ని రివాల్వర్లే, ముల్లరమ్మోయ్! తల బద్దలు కొట్టుకొన్నా పేలవు. ఓ! లక్షలున్నాయి ఆ రకంవి. కాని, వీళ్ళెవళ్లో ఆర్చిడ్యూక్‌కోసం, మంచి రకం దే కొని ఉంటారు. పైగా, ఎందుకూ—పందెంకట్టి చెప్తాగా—ఈ పనిచేసినవాడు, తన డ్రెస్సులలో కెల్లా బలే నీటయిన డ్రెస్సే వేసికొని వచ్చి ఉంటాడు. ఊఁ, తెలుసా? అసలు ఆర్చిడ్యూక్‌ని కాల్చటమంటే మజాకా! ఏదో దొంగకోళ్ల మొహం వాడిని కాల్చినట్టా మరి? అసలు ఎక్కడ కనబడ్తాడో, ఎల్లా వీలుగా దొరుకుతాడో, అంతా తెల్సుకోవాలి ముందు. తర్వాత, అల్లాంటి వాడి ముందుకు వెళ్లేటప్పుడు, ఆషామాషీగా, గోచి పాతరాయుడులాగా వెళ్తే కుదురుతుందా? ఊహుఁ. మంచి ఫామేదా వేషం వెయ్యాలి. లేకపోతే ముందు పహరా జవాన్లే వెనక్కి నెట్టేస్తారాయెను."

"ఓ పెద్ద ముఠాయే ఉంది అని అనుకొంటున్నారయ్యా!" అని అందిచ్చింది ముల్లరమ్మ.

"ఉండరూమరి? తప్పకుండా ఉండి ఉంటారు." పరమాయ్ మోకాళ్లు రుద్దటం పూర్తిచేసుకొంటూ అన్నాడు:

"ఉదాహరణ చెప్తా విను: నువ్వు ఒక ఆర్చిడ్యూక్‌నో, చక్రవర్తినో చంపా లనుకొన్నావనుకో; మరి మామూలుగా ఎవళ్లతోనో సంప్రదించవూ? ఒకడికిద్దరాలోచిస్తే మంచిదాయెను. ఒక డొకటి చెప్తాడు. ఇంకో డింకోటి అందిస్తాడు. అల్లా అల్లా. ఏదో చెప్పినట్టు—ఇంతింతై, మరింతై, ఆ సదుద్దేశం అల్లా పెరిగి, పండి, ఫూర్కుంటుంది. ఇంతకీ ముఖ్యంగా గమనించాల్సిందేమిటంటే, ఆ అనుకొన్న మనిషి, ఎప్పుడు, ఎల్లా, ఎక్కడ పోతూవుంటాడో నూటిగా పసిపట్టాలి. ఆ! ఇంకా చాలామంది కుందిలే ఈ యోగం! నే నొకటి చెప్తా విను ముల్లరమ్మా! జారును చంపుతారు. జారు పెళ్లాన్ని చంపుతారు. ఇంకా దేవుడు మేలు చేస్తే—అంటే మనం అల్లా కోరుకుంటున్నామనికాదు—సాక్షాత్తూ చక్రవర్తిని కూడా! ఆ! వాడి మామతో మొదలుపెట్టారా మరి. వాడికి శత్రువు లెక్కువేట. ఈ ఫెర్డినాండు కున్నవాళ్లకన్నాకూడా ఎక్కువేట. ఎందుకూ, మొన్న ఈమధ్య ఓ పెద్దమనిషి, బ్రాందీషాపులో చెప్పాడుగా—ఈ చక్రవర్తులందరినీ ఒకడి తర్వాత ఒకడిని పని పట్టించేసే రోజులు వస్తున్నాయట. వాళ్ల కిరీటాలూ, గిరీటాలూ కూడా వాళ్లనేమీ రక్షించలేవట."

"పేపర్లో రాశారటండీ! ఆర్చిడ్యూక్ ఒళ్లంతా తుపాకిగుళ్లతో చిల్లులు పడిపోయిందట. రివాల్వరులోఉన్న గుళ్లన్నీ వాడిమీదే కాల్చేసి ఉంటారు" అంది ముల్లరమ్మ.

"చాలా చలాకీగానే చేసిఉంటాడు ముల్లరమ్మా! భలే చలాకిపని! నేనే అయితే, అల్లాంటి పనికి బ్రౌనింగ్ పిస్తోలు కొంటా. పైకి బొమ్మపిస్తోలులాగ కనపడుతుంది గాని, దాంతోనా!, రెండు నిమిషాల్లో ఇరవైమంది ఆర్చిడ్యూక్‌లను చంపవచ్చు—లావుటోళ్లైనా సరే, సన్నటోళ్లైనా సరే! మనలో మనమాట. సన్నటివాళ్లకంటే లావుపాటివాళ్లను చంపటమే తేలిక. పోర్చుగల్ రాజును కాల్చేశారు జ్ఞాపకం లేదూ. ఎంతలావుగా ఉండేవాడు! అయినా 'రాజు' అన్నాక లావుగా ఉండక సన్నగా ఉంటాడని ఎల్లా అనుకొంటాంలే" అంటూ పరమాయి మోకాళ్లు రుద్దుకోటం పూర్తిచేసుకొని లేచాడు.

"సరే, నేను పీపాశాలకు పోతున్నాగాని, "వేటకుక్క కావా"లని ఎవళ్లన్నా వస్తే—మనం అడ్వాన్సు పుచ్చుకొన్నాంలే వాళ్లదగ్గిర-—కుక్కపిల్ల పల్లెటూళ్లో మా 'శ్వానభవనం'లో ఉందని చెప్పు. మొన్నటి కుక్కపిల్ల చెవులు కత్తిరించాంగా; ఆ కాస్తా, మానుపట్టకుండా ఇప్పుడే పంపించామూ, పాపం దానికి జలుబు చేసు కొస్తుంది! వెళ్లేటప్పుడు తాళంచెవి, గేటుమనిషి దగ్గిర ఇచ్చి వెళ్ళు!"

పరమాయి, 'పీపాశాల'కు మద్యపానార్థం వెళ్లేటప్పటికి అక్కడ శాలలో, బ్రెష్నిడర్ ఒక్కడే కూర్చుని ఉన్నాడు. బ్రెష్నిడర్, రహస్యరక్షకభటశాఖఉద్యోగి అని ఎవళ్ళకూ సామాన్యంగా తెలియదు. ఎప్పుడూ సాదా దుస్తుల్లోనే ఉంటాడు. పానశాల ప్రొప్రయిటరు పాలివెక్, స్వయంగా గ్లాసులు కడుక్కుంటూన్నాడు. బ్రెష్నిడర్, ఎల్లాగైనా అతన్ని సంభాషణలోకి దింపాలని వృథాప్రయత్నాలు చేస్తున్నాడు.

"ఈ సంవత్సరం వేసవికాలం చాలా హాయిగా ఉందికాదూ?"అంటూ బ్రెష్నిడర్ సంభాషణకు దోవ తీశాడు.

పాలివెక్ గ్లాసులు బీర్వాలో సర్దుతూ ముగం మాడ్చుగా "చాలా దరిద్రంగా ఉంది"అన్నాడు.

ఆ దోవ అక్కడే ఆగిపోయింది.

బ్రెష్నిడర్ నిరాశను చంపుకొని మళ్ళీ మొదలుపెట్టాడు :

"శారాజోవ్‌లో మనకు బలే శాస్తి జరిగిందే!"

పాలివెక్ చుట్ట వెలిగిస్తూ ముగం బిగించి అన్నాడు:

"అల్లాంటి ప్రమేయాలలో, నేను ఏమీ జోక్యం కల్గించుకోను. ఈ రోజుల్లో అవికూడా పెట్టుకొంటే అసలే బతకలేము. నా వ్యాపారమేమిటో, నే నేమిటో, అంతే! వచ్చి అడిగినవాడికి సారా అమ్మటం, డబ్బుపుచ్చుకోటం—అదేనాపని. ఈ శారాజోవ్‌లూ, రాజకీయాలూ, చచ్చిన ఆర్చిడ్యూకులూ—వీట్లల్లో కలుగ చేసుకోటం, ఏదో, ఖైదుకు పోదలచుకొన్న వాళ్ళకు తప్ప, మాకు కాదు."

బ్రెష్నిడర్ ఏమీ అనలేక చుట్టూ కలయ చూశాడు.

"ఇప్పుడు ఆ అద్దంపెట్టావే, అక్కడ మునుపు చక్రవర్తిపటం వేలాడుతూండేదికాదూ?"—అని మళ్ళీ అందుకొన్నాడు.

"ఔను, వేళ్లాడుతూండేది. ఆ బొమ్మమొగం మీదంతా ఈగలూ, దోమలూ ఖరాబు చేసేటప్పటికి, తీసి,కొట్టుగదిలో పడేశాను. చూడూ! ఆ పటం చూసి ఎవళ్లో ఏదో అంటారు. దాంతో ఏదో రభస పెరుగుతుంది. ఎందుకూ నాకీ బాదరా బందీ? అయినా నా కెందు కది?" అన్నాడు పాలివెక్.

"శారాజోవ్‌లో పని, సెర్బులు చేసి ఉంటారు" అని బ్రెష్నిడర్ ఎక్కడికక్కడ ఆశను మళ్లీ ప్రోదిచేసుకుంటూ, సంభాషణ సాగించాడు.

పరమాయి సంభాషణలో కలుసుకొన్నాడు.

"అదే, అక్కడే నువ్వు పొరపాటుపడుతున్నావు. టర్కీవాళ్లే చేశారనవచ్చు. బోస్నియా, హెర్జిగోవినాలు లాక్కున్నామని వాళ్లకు కుళ్లుమోతుతనంగా ఉందిగా!" అంటూ పరమాయి సంభాషణలోకి ఉరికాడు. అని అక్కడనించి, బాల్కన్ రాజ్యాలలో ఆస్ట్రియా విదేశాంగనీతిని విపులీకరించసాగాడు.

"1912లో టర్కీవాళ్లు సెర్బియా, బల్గేరియా, గ్రీస్, వాళ్లతో యుద్ధంచేసి ఓడిపోయారు. అప్పుడు ఆస్ట్రియాను తమకు సాయం చెయ్యమంటే చెయ్యలేదుగా, అదే మంట! అందుకని ఫెర్డినాండ్‌ను షూట్‌చేశారు."

అని పాలివెక్ వంక తిరిగి "నీకు టర్కీవాళ్లంటే అసహ్యమేయదూ?—వట్టి కుక్కవెధవలు. ఏం ఇష్టం లేదుకదూ" అని అడిగాడు.

"నాకు ఒక బేరగాడు ఎక్కువా, ఒకడు తక్కువా అంటూ ఏమీ లేదు. టర్కీ అయినా సరే. బర్కీ అయినాసరే మాలాంటివాళ్లు రాజకీయాలు పెట్టుకుంటే వ్యాపారం సాగదు. తాగిన సారాకు డబ్బిస్తూన్నంతకాలం, ఎవడు ఎల్లాంటివాడైనా, ఏమి అనుకొన్నా నా కేమీ అక్కరలేదు. ఫెర్డినాండును చంపినవాడు, టర్కో, సెర్బో, కాథలిక్కో, ముస్లిమో, జెక్కో, లిబరలో, కమ్యూనిస్టో, అనార్కిస్టో, ఎవడైతే నాకేం?" అంటూ పాలివెక్ ముక్తసరిగా జవాబు చెప్పాడు.

బ్రెష్నిడర్‌కు మళ్లీకాస్త ఉత్సాహం రేకెత్తింది. ఒకడి కిద్దరయ్యాక, ఈ రెండు చేపల్లో, ఏదో ఒకటి, తన వలలో చిక్కకపోదని ఆశ పుట్టింది. పాలివెక్ వంక తిరిగాడు.

"అది సరే పాలివెక్! ఇప్పుడిది, ఆస్ట్రియాకు గొప్ప నష్టమని నువ్వు ఒప్పుకోవూ?" అని అడిగాడు.

పాలివెక్‌కు బదులు పరమాయి జవాబు చెప్పాడు.

"ఆ! ఆ! నష్టం కాదనేందుకు వీల్లేదు. ఇంతా అంతానా, ఘోరనష్టం! ఫెర్డినాండ్ స్థానంలో ప్రతి వెధవనీ నిలబెట్టేందుకు వీలు అవుతుందా మరి? ఎందుకూ, ఇవాళ యుద్ధం వస్తేనా, నాఅంతట నేను బయలుదేరి చక్రవర్తి పక్షాన, కొనఊపిరి ఉన్నంతవరకూ యుద్ధం చేస్తాను."

అని పరమాయి ఒకసారి గట్టిగా గాలి పీల్చి రొమ్ముంతా నింపుకొని మళ్లీ సాగించాడు.

"ఇంత జరిగాక చక్రవర్తి చూస్తూ ఊర్కుంటాడంటావ్? ఎప్పటికీ ఊర్కోడు. అతని విషయం నీ కసలు తెలియదు. నే చెప్తున్నాగా. టర్కీతో మనకి యుద్ధం తప్పదు! "నా మామను చంపుతావుట్రా నువ్వు! ఇదిగో కాస్కో, మొదటిదెబ్బ; గూబ పేలిపోతుంది" అంటాడు. ఓ! యుద్ధం రాక,తప్పదండీ! రష్యా, సెర్బియా మనవైపు చేరతాయి. ఒకమాదిరిగా ఆగుతుందా ఇది?"

ఇల్లా ఆగతానాగతాలను చెప్తూన్న నిమిషంలో, పరమాయిముగం పరమానందమయి ఉంది. ఆ అమాయికపు మొగంలో ఉత్సాహం, పున్నమచంద్రుడిలోనుంచి వెన్నెల పొంగుతున్నట్లుగా వెల్లివిరుస్తోంది. రాబోయే విషయాలన్నీ కరతలామలకంగా, కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తూన్న చూపు చూస్తున్నాడు.

ఆస్ట్రియా భవిష్యత్తును నిర్ణయిస్తూ, సాగించాడు:

"మనకు టర్కీతో యుద్ధం వస్తే, బహుశా జర్మనీ అటు టర్కులతో చేరవచ్చు. ఎందుకంటే, ఈ టర్కీవాళ్ళు, జర్మనీవాళ్ళు వాళ్లంతా ఒకటేలే. వట్టి నీచపురకం; కుళ్ళు వెధవలు; చెత్తచెదారమూనూ. అయినా మనవైపు ఫ్రాన్సు చేరవచ్చు. ఫ్రాన్సువాళ్లకు 1871 నుంచే జర్మనులంటే మంటేగా. అక్కడి నుంచి ఇక చూస్కో, మజారేమజా! ఇన్నిమాట లెందుకు, యుద్ధం తప్ప దంటున్నాగా. అంతకన్నా నే చెప్పాల్సిన దేమీ లేదబ్బాయి" అని పరమాయి గ్లాసు ఖాళీచేశాడు.

(16 వ పేజీ చూడుడు)


భారతసమాఖ్యలో కాశ్మీర్ చేరికకు, కాశ్మీర్ ప్రజల ఆమోదం

జమ్మూ, కాశ్మీర్ సంస్థానాల జాతీయసభ ప్రత్యేకసమావేశం, జమ్మూ కాశ్మీర్ ప్రజా ప్రతినిధులైన 300 మంది సభ్యులతో అక్టోబరు 12న శ్రీనగరంలో జరిగింది. దుండగుల ఆక్రమణలో నున్న భాగాలలోనుంచి కూడా ప్రతినిధులు బహు ఉపాయంతో దుండగుల కన్నుకప్పి, ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో, జమ్మూ, కాశ్మీర్ జాతీయ మహాసభ కార్యనిర్వాహకవర్గంవారు, కాశ్మీర్ భారతసమాఖ్యలో శాశ్వతంగా చేరిపోవాలని తీర్మానించిన తీర్మానాన్ని, ప్రతినిధుల మహాసభలో ప్రతిపాదించారు. ప్రజాప్రతినిధులంతా ఏకగ్రీవంగా, ఈ తీర్మానపాఠాన్ని పూర్తిగా హర్షిస్తూ, సంపూర్ణంగా ఆమోదించారు. ప్రజాభిప్రాయంవల్ల తేలే అంతవరకు తాత్కాలికంగా జమ్మూ కాశ్మీర్ సంస్థానాలు భారత సమాఖ్యలో చేరటానికి, భారతప్రభుత్వం ఏడాదిక్రిందట అంగీకరించి సమాఖ్యకు చెందినదై కాశ్మీర్ భూభాగంలోనుంచి దురాక్రమణదారులను తరిమివేయటం విధ్యుక్తధర్మంగా భావించి, పాకిస్థాన్ సైన్యాలతో కూడిన దుండగీళ్లమూకలను కాశ్మీర్‌నుంచి తరిమివేసే పనిలో చాలామటుకు కృతకృత్యులయ్యారు. కాశ్మీర్ ప్రజల అభిప్రాయమేమిటో, కాశ్మీర్ జాతీయమహాజనసభ వెల్లడించింది. తమ అభ్యుదయమార్గం భారత సమాఖ్యలో చేరటంలోనే ఉందనీ, పాకిస్థాన్‌తో చేరటము అభ్యుదయ నిరోధకమనీ ప్రజాప్రతినిధులంతా ముక్తకంఠంతో ఏకగ్రీవంగా వెలిబుచ్చారు. ఈ తీర్మానంచేసిన వెంటనే, మహోత్సాహంతో ప్రజాప్రతినిధులంకా పొంగిపోయారు. భారత ప్రభుత్వానికి కాశ్మీర్ జాతీయ మహాజనసభ చేసిన ఈ తీర్మానపాఠం, అధికారరీత్యా అందజేయబడింది.

సింహళం, బర్మాలలో భారతీయుల సమస్యలు

సింహళంలో వలసపోయిన భారతీయుల పౌరసత్వపుహక్కుల విషయంలో సింహళ ప్రధాని సేనానాయకి, భారత ప్రధాని నెహ్రూ గత డిసెంబరులో, సమాలోచించుకొని ఒక సమాధానానికి వచ్చారని, అప్పుడు ప్రధాని సేనానాయకి ప్రకటించాడు. కాని తర్వాత సింహళ ప్రభుత్వం భారత ప్రభుత్వానికి ఇచ్చిన ముసాయిదాకు, ఆ సంప్రతింపులకు చాలా భేదం కనబడింది.

ప్రస్తుతం, ఈ బిల్లు ఉన్న స్వరూపంలో, సింహళద్వీపంలో భారతీయులు వివాహితులైతే ఏడేళ్లక్రిందటినుంచీ, అవివాహితులైతే పదేళ్ల క్రిందటినుంచీ స్థావరంగా ఉన్నామని నిరూపించుకోగలిగితే, 1 జనవరి 1946 నుంచీ,



భారతరాజకీయాలు

దరఖాస్తు చేసికోటంవల్ల, భారతీయులకు సింహళ పౌరసత్వపు హక్కులు కొన్ని నిబంధనలతో ఇస్తామని ఉంది.

ఈ నిబంధనలలో, సింహళ ప్రభుత్వ వివాహ చట్టాలకు, సాంఘీక ఆచారాలకు లోగిఉండి, అక్కడ సుష్టుంగా జీవనాధారం కలిగిఉన్నవాళ్లై ఉండాలనికూడా-ఉంది.

అన్నిటికన్నా పౌరసత్వంలో, జన్మతః సింహళులైనవారికి, వలసవల్ల పౌరసత్వం అందుకొన్నవారికి, తరతమ విభేదం చూపించబడింది. భూసంస్కరణ విధానాలలో మేళ్లు మొదలైనవి, రెండో తరగతి పౌరసత్వం కలవారికి వర్తించవని భారతీయుల భయం. సమానంగా అందరికీ వర్తింపచేయటం, పురాతనంగా సింహళులై ఉన్న జాతివారికి అన్యాయం చేయటంఅని ప్రధాని సేనానాయకి వాదన. పైగా భారతీయులు, విదేశీయులూ, సింహళానికి వలసరావటం, ఇకముందునుంచీ అరికట్టటమనే చట్టంకూడా భారతప్రభుత్వంపై వత్తిడి తేటానికే అని కూడా అర్థంచెపుతున్నారు.

అసలివన్నీ కాకపోయినా, పౌరసత్వపు హక్కులో తరతమభేదాలుఉంచే సూత్రమే ఒప్పుకోటానికి వీలులేదని ప్రధాని నెహ్రూ భావిస్తున్నాడు.

ఇప్పుడు లండనులో నెహ్రూ, సేనానాయకి ప్రధానులు, ఒకరితో ఒకరు ఈ విషయంలో సంప్రదించుకోటానికి పూర్తిఅవకాశం ఉండటంవల్ల, ఏదో సమాధానం కుదురవచ్చునేమోనని ఆశిస్తున్నారు.

* * *

బర్మాలో వ్యావసాయిక భూమినంతను జాతీయంచేసుకొన్న భూసంస్కరణ విధానంవల్ల, భారతీయ భూస్వాములకు కలిగిన నష్టాల విషయంలో, భారతప్రభుత్వం బర్మా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూంది. బర్మా ఆంతరంగిక సంస్కరణలలో భారతదేశం జోక్యం కల్పించుకోదు. పైగా అభినందిస్తుంది కూడా. అయితే, ఈ చట్టంవల్ల భారతీయ భూస్వాముల పరిస్థితిని గురించే సంప్రదింపులు జరుపుతుంది.

ఈ భూసంస్కరణ విధానంలో, భూస్వాములకిస్తున్న పరిహారాలు చాలా స్వల్పంఅని వాదన. బర్మాలో ఉన్న భారతీయ భూస్వాములలో ఎక్కువమంది దక్షిణాది చెట్టియారులే. వీళ్లు చాలాకాలంనుంచి దిగువ బర్మాలో స్థిరాస్తులు పెంచుకొంటూ వచ్చారు. దిగువ బర్మాలో, వరి వ్యవసాయంక్రిందఉన్న 120 లక్షల ఎకరాల పంటభూమిలోనూ, 25 లక్షల ఎకరాలవరకూ, సాగులోఉన్న భూమి, ఈ చెట్టియారులదే. ఇప్పుడు ఈ భూములు, బర్మా జాతీయ ప్రభుత్వం స్వాధీనంచేసుకోటంవల్ల వచ్చేపరిహారము, అర్ధసంవత్సరపు కిస్తీ మొత్తానికి కూడా సరిబడదని, ఇది కేవలం తమను కొల్లగొట్టటమేననీ చెట్టియారులు చెప్పుకొంటున్నారు. బర్మాలో ఈ భూసంస్కరణ విధానము ఫర్నివాల్ కమిటీ సూచనల ప్రకారంగా జరిగింది. ఆదాయం తేలని చోట అంచనాకి ఇరవైరెట్లు ఉండాలనీ సూచించింది.

దానిలో పరిహారమిచ్చే విలువ భూమిమీద వచ్చే సగటు ఆదాయం ప్రామాణ్యంగా పెట్టుకొని ఇయ్యాలనీ, భూమిమీద వచ్చే సాలుసరి కిస్తీ మొత్తానికి పదిరెట్లు ఉండాలని సూచించింది. ఈ పరిహారం ఇయ్యటంలో చెట్టియార్లకు కల్గిన ఇంకోచిక్కు, ఈకాస్త అయినా ఒక్కసారి ఇవ్వడే ఇయ్యక వాయిదాల ప్రకారం ఇవ్వటం. ఒక్కసారిగా, కాపిటల్ మొత్తాలు ఇల్లా విదేశాలకు ప్రవహింపచేయటం దేశక్షేమానికి భంగకరమని బర్మాప్రభుత్వం ఈ విధానం అవలంబించింది.

కాందిశీక సమస్య

కాందిశీకుల సమస్య ఇప్పటికినీ కేంద్ర ప్రభుత్వానికి గడ్డుసమస్యగానే ఉంది. కాందిశీకుల పునరావాస స్థలాలలో తమను ఇముడ్చుకోటానికి చాలా ఇరకాటకం అనుభవిస్తున్నారు. అసలు దేశమంతటా ఎక్కడికక్కడ స్థానికంగా, ఇండ్లకొరత, జీవన ఉపాధులకూ, వృత్తులకూ కొరత, అసలే ప్రతిచోటా, పెరిగిఉన్న వస్తువుల ధరలు, కాందిశీకుల ఆగమనంతో, ఎన్నో ఇంతలుగా పెరిగి, ఇక్కట్లను మరింత పెరిగిపోయింది. వీట్లతో ప్రతిచోటా స్థానికంగా, ఈ దౌర్భాగ్యస్థితిఅంతా చాలానాళ్లనుంచి, దిక్కూదివాణమూ లేకుండా అనుభవిస్తూ ఉన్న ఆయా పురవాసులకు, "కొత్తగా వచ్చిన కొమ్ములకు వాడి" అన్నట్లు ఈ కాందిశీకులకోసం, ప్రత్యేక సౌకర్యాలు చూపించబోతున్నారని కొఱుగా అనిపించి, కొత్తవాళ్ల ఉనికిని దుర్భరం చేసే పరిస్థితులేర్పడ్డాయి. నాగపూర్ పురపాలక సంఘంవారు, బజారులలో కాందిశీకులు రోడ్డు అంచులపై అడ్డంగా నిర్మించుకొన్న పాపుగుడిసెలను ఊడబీకించేయవలసి వచ్చింది.

కాందిశీకులు, ఇల్లు వాకిలి అన్నీ కోల్పోయి మహాఘోరమైన కష్టాలు అనుభవించి ఉండటంచేత కేంద్రప్రభుత్వము వీళ్లకు సక్రమంగా స్థానమును, ఉపాధులను చూపించవలసిన బాధ్యతతో, ఒక్కొక్కరాష్ట్రం, ఇందరు కాందిశీకులను భరించాలని, నియామకం చేసింది. కాందిశీకులలో పశ్చిమ పంజాబునుంచీ వచ్చినవాళ్ళే ఎక్కువభాగం అవటంవల్ల, వాళ్లందరినీతూర్పుపంజాబు రాష్ట్రం, అక్కడి సంస్థానాలకే ఎక్కువమందిని పంచి ఇచ్చింది. ప్రభుత్వ నియామకం ప్రకారం ఈ క్రింది సంఖ్యలలో అక్కడి పట్టణాలకు గ్రామాలకు పంచి ఇచ్చింది.

తూర్పుపంజాబు రాష్ట్రం, తూర్పుపంజాబు సంస్థానాలు, 13 లక్షలు. (పట్టణాలకే): బొంబాయిరాష్ట్రం, 5 లక్షలు: సంయుక్త రాష్ట్రం, 4 లక్షలు: మధ్యపరగణాలు, 3 లక్షలు: ఢిల్లీ రెండున్నర లక్షలు: మధ్య భారత సంస్థానకూటమి, 2 లక్షలు: మత్స్య సంస్థానకూటమి, 1 లక్ష: జయపూర్, 1 లక్ష; ఉదయపూర్, 1 లక్ష: సౌరాష్ట్రము, 1 లక్ష; అజ్మీర్, బికనీర్, వింధ్యప్రదేశకూటమి, జోధపూర్‌లకు ఏభైవేలు, ఏభైవేలు చొప్పున; కాందిశీకుల పంపకం ఇల్లా నియమించింది.

పడమటి పంజాబునుంచి వచ్చిన గ్రామీణులను, తక్కినపాకిస్తానునుంచి వచ్చిన పంజాబీలనూ అందర్నీకూడా, తూర్పుపంజాబు గ్రామాలలోనే పూర్తిగా నివాసంగా ఏర్పరుచుకొనేట్టు చేయాలని, ఇకనుంచి, పట్టణాలనుంచి వచ్చినా, పల్లెటూళ్లనుంచి వచ్చినా, తూర్పుపంజాబు, తూర్పుపంజాబురాష్ట్రాలను దాటించి ఇవతలకు పంపించకూడదనే ప్రభుత్వం సంకల్పించుకొంది.

కేంద్రప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాలకూ, సంస్థానాలకూ, ఈ నియామకాన్ని అందిస్తూ, ఏ ఒక్క కాందిశీకుడూ, ఎక్కడాకూడా, ఇల్లు లేని స్థితిలో ఉండకూడదని కేంద్రప్రభుత్వం కోరికఅనీ, తదనుగుణ్యంగా రాష్ట్రప్రభుత్వాలు ఆ కోరిక పూర్తిగా నెరవేరేందుకు తగుచర్యలన్నీ తీసికోవాలనీ తెలిపింది.

జూలైలో రాష్ట్రమంత్రుల సమావేశంలో, ఒక్కొక్కరాష్ట్రం కాందిశీకులకోసం ప్రత్యేకంగా ఒక పట్టణం నిర్మించాలనీ, సిమెంటు, ఇనుమూ మొదలైన వస్తువుల లోపంగా ఉన్నందువల్ల పక్కా ఇళ్లు కట్టాలని ప్లానులు వేయక, వీలైనంతవరకు "సగంకచ్చా"గా ఉండే ఇళ్లనిర్మాణానికి చూడాలని సలహా యిచ్చింది.


ఫ్రెంచి ఇండియా ఎన్నికలు

ఫ్రెంచి ఇండియా ఎన్నికలను ఈ అక్టోబరు 24 కి మళ్లీ పెట్టామని పుదుచ్చేరి ప్రభుత్వం ప్రకటించటంతో, భారతప్రభుత్వానికి ఆశ్చర్యమూ సందిగ్ధస్థితీకూడా కలిగాయి.

ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం భారతయూనియన్‌లో జేరటానికి సుముఖంగా ఉన్నట్టు లేదు. కనక ఎన్నికలు జరిగినా ప్రజాభిప్రాయం నిజంగా తెలయదనేది చాలామటుకు రూఢి.

బొంబాయి కమ్యూనిస్టు కేంద్రంనుంచి ఫ్రెంచి ఇండియా కమ్యూనిస్టులు భారత ప్రభుత్వంలో చేరి పోటానికే నిశ్చయించుకోవాలని ప్రకటన వెలువడింది, స్థానిక ఫ్రెంచి ఇండియా కమ్యూనిస్టులు నిజంగా ఇల్లా ఉద్దేశిస్తున్నారో లేదో, లేక స్వపక్షాధికారంకోసమని, తాత్కాలికంగా నినాదాన్ని ఉపయోగిస్తారో, ఇంకా స్పష్టంకాలేదు.

అక్టోబరు 16 తారీఖున పారిసులో, భారత ప్రధాని నెహ్రూ, ఫ్రెంచి అధ్యక్షుడు విన్సెంటు ఆరియోల్‌ను, ఫ్రెంచి విదేశాంగమంత్రి రాబర్టు షూమన్‌ను కలుసుకొని దీర్ఘసంభాషణలు జరిపాడు. ఫ్రెంచిరిపబ్లిక్, స్వతంత్ర భారత ప్రభుత్వంతో ఇతోధికంగా, పరస్పరక్షేమ వృద్ధికరమయిన మైత్రీ బాంధవ్యాలు పెంపొందించుకోటానికీ ఆశిస్తోందని ఫ్రెంచి అధ్యక్షుడు ఆరియోల్ ప్రధానినెహ్రూతో వెలిబుచ్చాడు. ఈ పరస్పర సుహృద్భావం అంటే, "ఫ్రెంచి ఇండియా భాగాల భవిష్యత్తు" అన్న అతి స్వల్ప విషయంలో యాథార్థ్యం గ్రహించి, భారత యూనియన్‌లో అవి చేరవలసిన ధర్మాన్ని గుర్తించి, ఫ్రెంచి రిపబ్లిక్ సౌమనస్య విధానంతో వర్తిస్తుందో, లేదో అన్న చిన్న పరీక్షలోనే, ఈ అక్టోబరు నెలలోనే తేలిపోవచ్చును.



ఢిల్లీలో ఈద్ ప్రార్థనలు: గత గురువారం ఢిల్లీలో జరిగిన 'ఈద్' ప్రార్థనలకు గవర్నర్ జనరల్ రాజగోపాలాచారిగారు హాజరై భారత ముస్లిములను అభినందించుచు ఉపన్యసించారు.

పాకిస్థాన్ జనన వృత్తాంతము

డా. సచ్చిదానంద సిన్హా

ఇండియా విభజన కావింపబడుననే సంగతిని, గత సంవత్సరం జూన్ 3 వ తేదీన లార్డ్ మౌంటుబాటెన్ రేడియోలో ప్రకటించిన వెంటనే, కాంగ్రెసు ముస్లింలీగ్ నాయకులు కూడ ఇదే సంగతిని విస్పష్టం చేసిరి. కాని, అంతకుముందు రాజ్యాంగపరిషత్తులో డా॥ రాజేంద్రప్రసాద్ తెలియజేసిన కొన్ని విషయములనుబట్టి, జాతీయవాదు లెంత ప్రతికూలించినా ఇండియా విభజన జరిగి తీరవలసినదనే సంగతిని నేను ముందే గ్రహించితిని. జూన్ 3 వ తేదీన కాంగ్రెసు, లీగునాయకులు చేసిన ప్రకటనలు సందేహముల నన్నిటినీ తొలగించినవి.

ఆ ప్రకటనలను తలచుకొన్న బాధ, విచారము కలుగును. జైహింద్ అనే మాటలతో ముగించిన కాంగ్రెసునాయకుని ఉపన్యాసము, గాయపడిన, దుఃఖావేదనతో క్రుంగిన అతని హృదయమును వ్యక్తము చేసినది. పాకిస్థాన్ జిందాబాద్ అని లీగునాయకుడు ముగించిన ప్రసంగములో విజయగర్వము తొంగిచూచినది. మతవర్గ సమస్యలవలన ఇండియాతోబాటు, బెంగాల్ పంజాబులుకూడ ముస్లిం, ముస్లిమేతర ప్రాంతములుగా విభజింపబడగలవని వైస్రాయిచేసిన ప్రకటన నాకు తృప్తిని కల్గించుటకు మారు దుఃఖమనే కల్గించినవి.

విభజన కెంతో తీవ్రప్రాతికూల్యమును చూపిన జాతీయనాయకులు చివరకెల్లా లొంగిపోయిరా అను విషయమును తెలిసికొనుటకు, అప్పటినుండీ నేను ప్రయత్నము చేయుచుంటిని. క్రీ॥ శే॥ కాయిదీ ఆజామ్ జిన్నా, తాను కోరినట్లు, విశాలమైన, సర్వతంత్రస్వతంత్రమైన పాకిస్థాను గాక, కుంచుకొనిపోయిన, కుంటుపడిన, పురుగులుపట్టిన పాకిస్థాన్‌కు ఎట్లంగీకరించెనా యని తెలిసికొనవలెనని కూడ నేను ప్రయత్నించుచుంటిని. ఢిల్లిలోని షాజహాన్ లాల్‌ఖిల్లానుండి కొంతకాలము, బెంగాల్‌లోని విలియమ్ కోటనుండి కొంతకాలము గవర్నరు-జనరల్‌గా పాకిస్థాన్ నేలవలెనని యాశించిన జిన్నా, (6 రాష్ట్రములు కావలెనని జిన్నా ప్రథమవాదన) ఈ చిన్న పాకిస్థాను కెట్లంగీకరించెనా యని నేను తెలిసికొన గోరితిని. కాని నా కింతవరకు కారణములు తెలియనే లేదు.

లండన్ (రాయల్ ఎంపైర్ సొసైటీ)లో లార్డ్ ఇస్మే, ఇండియాలో బ్రిటిష్ పరిపాలన ఆఖరి రోజులను గూర్చిన వివరములను కొన్నిటిని బయటపెట్టుచు చేసిన ప్రసంగము నా కిప్పుడే దొరకినది. లండన్‌లో పై సొసైటీవారు జరిపిన సభకు బొంబాయి మాజీగవర్నరు సర్ జాన్ కొల్విల్లీ అధ్యక్షత వహించెను. సర్ కోల్విల్లీ తన ఉపన్యాసములో, మౌంటుబాటెన్‌కు ముఖ్యకార్యదర్శిగా లార్డ్ ఇస్మే, భారతదేశపు భవిష్యత్తు నిర్ణయింపబడే అతి ప్రధాన సమయంలో, అతి ప్రధానపాత్ర వహించినాడని ప్రశంసించెను.

2

లార్డ్ ఇస్మే అప్పుడిచ్చిన ప్రసంగములో మన విషయమునకు సంబంధించినంతవరకూ, తిరిగి చెప్పెదను. అత డిట్లన్నాడు:

"1948 జూన్‌కల్లా అధికారము భారతీయుల కప్పగింపబడవలెనని, బ్రిటిష్‌ప్రభుత్వము 1947 ప్రారంభములో నిశ్చయించినది. లార్డ్ మౌంటుబాటెన్ వైస్రాయిగా నియమింపబడెను. అతనికి ముఖ్య కార్యదర్శిగా నేను నియమింపబడితిని. 1948 జూన్‌కు అధికారము నప్పగించుట చాల తొందరగాఉన్నదని నే నప్పుడే అనుకొంటిని. కాని నేను ఇండియాకు వెళ్లినతరువాత, అది తొందరగా ఉన్నదనికాక చాల ఆలస్యముగా ఉన్నదని నేను విధిలేక గ్రహించవలసివచ్చినది.

"దీనికి ప్రథమ కారణమిది: ఢిల్లీలోనూ, రాష్ట్రములందునూ, నే నూహించినదానికంటె విపరీతంగా మతవిద్వేషము చెలరేగుచుండినది. హత్యలు లెక్కకు మించిపోయినవి. ప్రజలలో భయము, ప్రతిహింసాగ్ని రగులుచుండినది.

"రెండవ కారణము:—భారత పరిపాలనా యంత్రము ప్రపంచములోకెల్ల నత్యుత్తమమైనది. అది ఆ సమయములో మహాభారముతో క్రుంగుచుండినది. ఆ స్థితిలో అది ఎంతోకాలము కొనసాగలేదని నేను గ్రహించితిని.

"మూడవ కారణము:—మేము ఇండియాకు వెళ్లునప్పటి కక్కడ తాత్కాలిక ప్రభుత్వమొకటి ఉన్నది.

"అది ఎంతోకాలము కొనసాగదని నాకు తోచినది. దానిలో 14 గురు సభ్యులున్నారు. వారిలో 9 మంది కాంగ్రెసువాదులు. 5 గురు లీగ్‌వాదులు. ప్రపంచచరిత్రలో ఏ మిశ్రమ ప్రభుత్వములోని పార్టీలు ఒకరితోనొకరు ఇంత తగవులాడుకోలేదని నేను ఘంటాపథముగా చెప్పగలను. తాత్కాలిక ప్రభుత్వము కొనసాగుట అసంభవమని మాత్రము వారు ఏకగ్రీవముగా భావించిరి.

"కాంగ్రెసు మొదటిలో విభజన కంగీకరించే ఏ పథకమునుగానీ ఒప్పుకోదలచలేదు. కాని, లీగ్ విభజన కంగీకరించని ఏ పథకమునూ ఒప్పుకోదలచలేదు. చర్చలమీద చర్చలు సాగినవి. నెమ్మదిగా మనస్సులు మారుట కారంభించినవి. నెమ్మదిగా విభజనకు కాంగ్రెసు ఒప్పుకొనునట్లు తోచినది. అయితే ఇండియా విభజనతోపాటు బెంగాల్, పంజాబ్ విభజనకూడ జరిగి తీరవలెనని కాంగ్రెసు షరతుపెట్టినది. రాష్ట్రముల విభజనకు లీగ్ తీవ్రముగా ప్రతికూలించినను, 'పాకిస్థాన్ అసలు లేకపోవుటకంటే పురుగులు పట్టిన పాకిస్థాన్ అయినా మంచిదే.' అనే స్థితికి వచ్చినది. పై మాటలు జిన్నా సొంతమాటలు. ఈ విధముగా ఉభయపక్షములకు అంగీకారయోగ్యమైన పథకము ఒకటి రూపొందుట మొదలిడినది. చివరకు ఆగస్టు 15 కల్లా రెండు అధినివేశములకు అధికారప్రదానము కావలెనని నిర్ణయింపబడినది.

3

"పై పథకమును 1947 మేనెల ప్రారంభములో నేను, వైస్రాయి కలిసి ఇంగ్లండుకు తెచ్చితిమి. దానిని బ్రిటిష్‌ప్రభుత్వము, ప్రతిపక్షముకూడ అంగీకరించినవి. మేము ఢిల్లీకి తిరిగి వెళ్లితిమి. రెండురోజుల అనంతరము వైస్రాయి ఉభయపార్టీల నాయకులను పిలిచి రౌండు టేబిలు సమావేశమును జరిపెను. వారికి మా పథకము చూపబడినది; అది ముందు త్రోసివేయబడినది. చివరి కంగీకరింపబడినది. జూన్ 3 వ తేదీ రాత్రి లార్డు మౌంటుబాటెన్ రేడియోలో తన పథకమునుగూర్చి ప్రసంగించెను. అతనివెంట పండిట్ నెహ్రూ, జిన్నా, సర్దార్ బలదేవుసింగు కూడ పథకమునుగూర్చి తమతమ అనుచరులకు నచ్చజెప్పుచు మాట్లాడిరి."

ఇది లార్డు ఇస్మే చేసిన ప్రసంగపాఠము.

ఈవిధముగా కాంగ్రెసు, లీగ్ అసంభవమనుకొన్న కార్యము, పరిస్థితుల ఒత్తిడివలన, అవసరమైన మార్పులతో సంభవమైనది.

సుప్రసిద్ధ నాటకరచయితలు విషాదాంత నాటకమును ముగించవలసివచ్చినప్పుడు అంతిమ రంగపు విషాదభారమును కొంత సడలించుటకు ఒక విదూషకుని ప్రవేశపెట్టుదురు. షేక్స్పియరు ఇదేవిధముగ చేసెను. నేను షేక్స్పియరును మించిపోలేనుగాని, లార్డు ఇస్మే ప్రసంగసమయమున సభకు హాజరయిన ఒక విదూషకుని మన కథలో ప్రవేశపెట్టుట ఉచితమని నాకు తోచుచున్నది. బెంగాల్, పంజాబు విభజన పూర్తిగా ఉచితము, హేతుబద్ధము నని లార్డు ఇస్మే చెప్పెను. కాని మన విదూషకుడు "కాంగ్రెసు అంత హేతుబద్ధముగా ప్రవర్తింపక పోవలసినది. అప్పుడు విశాలమైన, మతవర్గజనాభాదృష్ట్యా సమానమైన పాకిస్థాన్ అవతరించి ఉండెడిది." ఆ విదూషకుని పేరు తెలిసికొన పాఠకులకు కుతూహలముగా ఉండవచ్చును. అతడు మన పాత స్నేహితుడు, మాజీ ఇండియా కార్యదర్శి ఎల్. ఎస్. ఎమెరీ మహాశయుడు. ఇతడు చర్చిల్‌కు తగిన మిత్రుడని ఇటీవల చర్చిల్ హైదరాబాదు ప్రసక్తిని కామన్సుసభలో తెచ్చినపుడు ప్రధాని ఆట్లీ చేసిన ఎత్తిపొడుపుతో వెల్లడియైనది.

4

దీర్ఘకాలమునుండి, కాంగ్రెసు లీగ్ విభజన సమస్యపై జరుపుచున్న ఆందోళన, పోరాటము ఇరుపక్షములవారిని అలయగొట్టినది. అయితే కాంగ్రెసు నాయకులకంటె లీగ్ నాయకులొక నిశ్చిత దృఢాభిప్రాయమునే మొదటినుండీ అనుసరించిరి. వారి వైఖరిలో, "అయితే", "కానీ" మొదలైన సందిగ్ధపదజాలము లేదు. వారి పాట ఒక్కటే; విభజన—విభజన—విభజన. మొదట్లో కాంగ్రెసునాయకులు కూడ భారత ఐక్యతనే బలీయముగా ఉద్ఘాటించుచుండిరి. కాని, నెమ్మదిగా వారి నరములు సడలుట ప్రారంభించెను. ఐక్యతనే నమ్ముకొని తమ ఏకైకలక్ష్యమైన స్వాతంత్ర్యమును ఎప్పటికో వాయిదా వేయుటా, లేక వెంటనే దానిని సాధించుటా అనే సంశయము వారిని బాధింపజొచ్చినది.

1942 లో సర్ స్టాఫర్డుక్రిప్సు ఇండియాకు వచ్చినప్పుడుకూడా, కాంగ్రెసు ఐక్యతనే సమరించుచు, ఒక తీర్మానమునుకూడ చేసినది. అయితే ఆతీర్మానములో మొట్టమొదటిసారిగా వారి సంశయములు తొంగిచూచినవి. ఇండియాలో ఉండుట కిష్టములేని ఏభాగమును కాని బలవంతముగా ఉంచుట తమ అభిప్రాయము కాదని వారా తీర్మానములో ఒక వాక్యమును చేర్చిరి. దీనితో కాంగ్రెసు ఒక మెట్టు దిగినట్లయినది. అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్ ఇటువంటి తీవ్రసమస్యనే ఒకసారి ఎదుర్కొనవలసి వచ్చినది. అతనికి రెండే మార్గములు కనబడినవి. కొన్ని రాష్ట్రములను విడిపోనిచ్చుటా, లేక వారితో యుద్ధము చేసి లొంగదీయుటా? అతడు జంకు లేకుండ రెండవ మార్గమునే ఎన్నుకొనెను. ఇష్టములేని రాష్ట్రములను బలవంతము చేయకూడదనే సిద్ధాంతము నతడు నెట్టివేసెను. విభజన కోరిన రాష్ట్రములతో అతడు యుద్ధమునకు వెళ్లి, వారిని నిలువునా లొంగదీసెను. లింకన్ చేసిన ఈచర్య ఫలితముగా, అమెరికా నేడు అతివిశాలము, బలీయము అయిన రిపబ్లిక్‌గా వర్ధిల్లుచున్నది.

కాంగ్రెసు దిగిన ఒకమెట్టును ముస్లింలీగ్ బాగా ఉపయోగించుకొన్నది. ఇంకా ఎక్కువ ఒత్తిడి చేసినచో కాంగ్రెసు అన్ని మెట్లు దిగిపోగలదని లీగ్ ఊహించినది. 1946 లో తాత్కాలిక ప్రభుత్వ మేర్పడుసరికి లీగ్ కంటె కాంగ్రెసు ఎంతో ధైర్యమును కోల్పోయినది. కాని తొందరగా, ఏదో విధముగా స్వాతంత్ర్యమును దగ్గరచేసే నిమిత్తం వారు లీగ్ ప్రతినిధులతో మిశ్రమప్రభుత్వము నేర్పరచుట కొప్పుకొనిరి. ప్రభుత్వము సాఫీగా సాగకుండా లీగ్‌వారు చేయగల్గినదంతా చేయుదురని తెలిసినా వారు మిశ్రమప్రభుత్వమున కొప్పుకోవలసివచ్చినది. ఈవిధముగా కాంగ్రెసు మరొక మెట్టు క్రిందకు దిగజారినది. ఏమైనాసరే వారు లీగ్‌తో మిశ్రమప్రభుత్వ మేర్పరచుట కొప్పుకొనియుండకపోవలసినది. ఇదివరకువలెనే ప్రతిపక్షముగా ఉంటూ, ముస్లిం లీగుకే సర్వాధికారమును దత్తము చేయవలసినదని లార్డు వేవెల్‌ను కోరి తాము వేరొక నిర్మాణాత్మక కార్యక్రమమును కాంగ్రెసు చేపట్టియుండవలసినది. కాంగ్రెసు ఇంత దృఢముగా, ధైర్యముగా వ్యవహరించినచో, ముస్లిం లీగ్ అట్టి విషమపరిస్థితులలో ఒంటరిగా ప్రభుత్వమును సాగించుట కిష్టపడెడిదా యని నా అనుమానము. ఏకారణములచేతనైతే నేమి, కాంగ్రెసు అట్లు చేయలేదు. తత్ఫలితముగా మిశ్రమ తాత్కాలిక ప్రభుత్వ మేర్పడినది. దాని ముఖ్యలక్షణము లార్డు ఇస్మే తన ప్రసంగములో చెప్పనే చెప్పినాడు.

9 మంది కాంగ్రెసు మంత్రులకూ, 5 గురు లీగ్ సభ్యులకూ ప్రభుత్వములో నిత్యమూ జరిగే సంఘర్షణ కాంగ్రెసు మనోనిబ్బరమును మరింత సడలగొట్టినది. లీగ్‌కు తాను పొందిన విజయములవలన మరింత హుషారు పుట్టినది. చివరికీ హుషారు అప్పటి ఆర్థికశాఖా మంత్రి లియాకతాలీఖాన్ తయారుచేసిన బడ్జెట్ రూపమును తాల్చినది. ఈ బడ్జెట్‌ను కాంగ్రెసు ఎంతో ప్రతిఘటించినది; కాని దానిని అడ్డుపెట్టలేకపోయినది.

కాంగ్రెసు మంత్రులలో ఒకనిని, ఈ బడ్జెట్ పూర్వాపరములనుగూర్చి నే నడిగితిని. బడ్జెట్‌పై చర్చ లేమీ జరుగలేదని అతడు నాతో చెప్పెను. మంత్రివర్గ సమావేశమునకు లియాకతాలీ వచ్చినాడట. తన బడ్జెట్‌లోని ముఖ్యాంశములను టూకీగా అతడు చెప్పినాడట. దానితో అంతయు అయిపోయినదట. అంటే, ఆ బడ్జెటు మిశ్రమ ప్రభుత్వపు బడ్జెటు కాక, ఆర్థిక మంత్రిదే నన్నమాట. లేక అతని పార్టీ ముస్లిం లీగుదో. దీనితోనూ, ఇంకా మరికొన్ని ఇటువంటి సంఘటనలతోనూ కాంగ్రెసు మంత్రులకు ప్రాణములు విసుగెత్తిపోయినవి.

(16వ పేజీ చూడుడు)

గొప్పవారితో గుసగుసలు-3. కలియుగ చక్రవర్తులు:

అశోకుడు

కీ॥ శే॥ వారణాసి శ్రీనివాసరావు

[పాటలీపుత్రశిథిలాల్లో రాజభవన స్తంభాంతులమీద నిల్చుని కాచుకున్న వన్నొక ఆజానుబాహుడైన తేజస్వి, మహాశాంతమూర్తి సమీపించి—]

అశోకుడు : ఎందుకయ్యా, నీవు పిలిచింది ?

నేను : ప్రభో, తమ రశోకచక్రవర్తులేనా ?

అ : (చిరునవ్వు) నీమంత్రబల మెరక్కనా అసందేహం; లాకుంటే మావంటివాండ్లపట్ల మంత్రం పారదేమోననా ?

నే : స్ఫుటం చేసుకుందామనే. మానవస్వభావంచా అడగడంగాని తమ రన్న కారణాలు గాదు.

అ : (పచార్లుచేస్తూ) సరే. దేనికి మమ్మల్ని రమ్మంది ?

నే : కొన్ని సందేహాలు తీర్చుకోడానికి.

అ : అనే దేవి చెబితే వచ్చాం. ఏమిటో అడుగు.

నే : వారికి నామీద మహానుగ్రహం ! తమరు పిప్పలీవనక్షత్రియులా ?

అ : క్షత్రియులమే గాని, పిప్పలీవన క్షత్రియు లేమిటి ? (జ్ఞప్తి నటించి) ఓహో, అదా ! అబ్బా, మావెనుక మూడోతరంలో మాటా ? ఆం.

నే : తమమతం,?

అ : ఈదేశంలోవాండ్ల కింకొక మత మెక్కడిది, ఆర్యమతం గాక ?

నే : బౌద్ధమతం గాదండీ ?

అ : బౌద్ధమత మంటూ ఒకటి బయల్దేరింది, మీకాలంలో. మారోజుల్లో బౌద్ధసిద్ధాంతం గాని మతం గాదు. మా దాసిద్ధాంతం గాదు.

నే : అంటే ?

అ : అంటె, మేం దా న్నభిమానించి, దాన్లో వున్న నిగ్గు ల్నేరి వాటిం నూటి చూచుకుని అనువర్తించాంగాని, మేం దా న్నెప్పుడూ స్వీకరించలా. అట్లాటివా టెన్నిట్నో భరించగల పూర్వార్యమతంతోనే కాలం గడిపాం.

నే : బిందుసార మహారాజుగారికి తాము ప్రథమ కుమారులా ?

అ : (మొగం కనుపించీ కనపించకుండా తిప్పుతూ) కాం.

నే : తమకంటే పెద్ద లున్నారా ?

అ : ఆ.

నే : వా రుండగా తమరు సింహాసన మెట్లా గెక్కారు ?

అ : (చిరునవ్వు నవ్వి) అడగవయ్యా ! స్వర్గంలో అంతా చెప్పనే చెప్పారు "ఆయన సంకటంగా ప్రశ్నిస్తాడని."

నే : ఓపిగ్గా సమాధానం జెప్పడం తమ కలవాటుకదాని నా ఆశ.

అ : అవున్లే. వాం డ్లెవ్వరూ, ఇద్దరే వుండేవారు, లాకపోవడం చేత మేమే యెక్కాల్సొచ్చింది.

నే : ఎవ్వరూ లాకపోవడంచాతంటే !

అ : యుద్ధాల్లో మృతి నొందడంచాత.

నే : తమతో జేసిన యుద్ధాల్లోనా ?

అ : (చిరునవ్వు నవ్వి) పట్టుదలగా ప్రశ్నిస్తావే ! ఆ; మొదటవా రిద్దరూ రాజ్యంకోసం యుద్ధం జేసారు. ఒకరు మరణించారు. మిగతా వాడు మాతో పోరి మృతినొందారు.

నే : తమకంటే పెద్దవారు కదా, వా ర్నెలనీకుండా తమరు...

అ : ఏమిటోయ్ ప్రశ్న ? రాజకుటుంబ మోయ్.

నే : చిత్తం : బుద్ధగుప్తు డెవరండీ ?

అ : ఆయన మా సేనాని; బౌద్ధుడు. ఆయనే మాకు రాజ్యాన్ని సంపాదించిపెట్టింది.

నే : బౌద్ధుడు సేనా నేమిటండీ—యుద్ధాలు హింసాప్రదాలుగా ?

అ : రకరకాల బౌద్ధు లుండేవారు. బౌద్ధ సిద్ధాంతాభిమానులు, లోకృంలో దిరుగుతూండేవారు. ఆయన వారిలో నొకడు.

నే : చిత్తం : తమకాలంలో జరిగింది కళింగ దండయాత్రొకటేనాండి ?

అ : ఊ.

నే : దాని క్కారణమండీ ?

అ : మాకు మూ డ్నాలుగు తరాల్నాడు ఖారవేలు డనే కళింగాధిపతి మగధరాజ్యంలో ప్రవేశించి పాటలీపుత్రాన్ని పట్టుకుని రాజ్యాన్ని చీకాకుజేసి పోయినాడు. వచ్చినవా డందరితోబాటు రాజ్యా న్నాక్రమించుకుని పాలించకుండా ప్రజలను బాధించి, ఊళ్లు దోపి కొల్లాపించి, రాక్షసనీతి నవలంబించాడు. అసమానబలసమేతుడవడం చాత, చక్కని సైన్యాన్ని తయారుచేసి తనతర్వాతవారి కొప్పగించిపోవడంచాత మా తాతగారు తండ్రిగార్లనాడు ఆ అవమానానికి తగ్గ ప్రతిక్రియ చేద్దామని వా రెంత ప్రయత్నించినా కొనసాగిందికాదు. తాతగారు మా తండ్రిగారికి, వారు మాకు ఎరిగించిన చివరికోరికా ప్రతిక్రియానిర్వాహణే. మేం రాజ్యానికి రాగానే ఆ పనిని జయప్రదంగా నెరవేర్చాం.

నే : జయప్రదంగా నేమిటి, మహాఘోరంగా ననుకుంటారే !

అ : (తల వంచుకుని నేల బొటనవ్రేలు రాయుచూ) ఆ. అట్లాగే. కళింగకళేబరాలు గుట్టలు పడ్డాయ్: రక్తం ఏరై పారింది. షుమారు 15,000 మంది చెరబడ్డారు. ఇప్పటికీ మాకు వొళ్లు జలదరిస్తుం దా దృశ్యాల్ను తలుచుకుంటే !

నే : ప్రభువుల్లుగదా, తమ రాపలాక పోయ్యారా ?

అ : ఎంత పిచ్చివాడవోయ్ ! ఖారవేలుడు మాగధులకు గావించిన అవమానాన్ని మాపుకుంటేగాని ఆయుధాలు దింపమని ఉద్యమించిన సేనాపతులను, సైనికులను ఆపడానికిన్ని గాక మొన్న రాజ్యాని కొచ్చిన ప్రభువువశమా ? అప్పటికీ మా అంగరక్షకులతో గొంతకొంత వారించి, చెరబడ్డవాండ్లందరిని వదలిపెట్టి ఆ రాజ్యాన్ని పూర్తిగా లొంగదీయక దాని వ్యవహారాల్ను చూచీ చూడనట్లు కనిపెట్టాం.

నే : తమ సామ్రాజ్య మెంతవర కుండేదండి ?

అ : తాతగారిరోజుల్లోనే దక్షిణాన కావేరీనది వరకు, వాయువ్యాన పారసీకరాజ్యపుసరిహద్దు వరకూ, అక్కడ దక్షిణాన పారసీక సముద్రం దాకా వుండేది. మిగతాపైపుల హిమవంతాన్నానుకుంది. మారోజుల్లో కళింగం గూడా కలిసింది.

నే : చిత్తం : తమ రా కళింగఘోరావసను జూచి తమ రాజునీతిని మార్చారంటారే ?

అ : (కొంచె ముండి) వాస్తవం. బుద్ధెరిగినప్పట్నుంచీ మా కొక ఊహ తోచేది. "రాజులు రాజ్యాలుకట్టి, సామ్రాజ్యాలు కట్టి యేం సార్థకం. ప్రజాసౌఖ్యం వాటితో అమరుతుందా ? ప్రజల్ను నీతిమంతుల్ను చేసే ఉపాయా లున్నాయా ? ఉంటే, వాటిద్వారా నందర్నీ కాకపోయినా చాలామంది నైనా బాగుచేయలేమా ? కామక్రోధలోభమదమాత్సర్యాల్ను పూర్తిగా వదల్లేకపోయినా, కొంచెం వాటిని తగ్గించే సాధనాలు విచారిస్తే ప్రజాసౌఖ్యం చేకూరదా ?" అని తోచేది. దానికి తగ్గ తంతునంతా ఆలోచించుకుని, తగినవాళ్ల సలహామీద, అవకాశంకోసం వేచివున్నాం. కళింగదండయాత్రావ్యవహారం షుమారు పదేండ్లు పట్టింది. దాన్లో జరిగే ఘోరాల్ను చూచేకొద్దీ పై సంకల్పం దృఢమైనది. అది పూర్తికావడం తోడనే రణభేరిని వేయించకుండా, ధర్మభేరీని వేయించి దిగ్విజయకాంక్షను, ధర్మవిజయవాంఛ క్రిందికి తిప్పాం.

నే : ధర్మవిజయమంటే యేధర్మ మండీ ?

అ : ఏ ధర్మమేమిటి ధర్మమనకు. అది నీ కొకటి మా కొకటీనా ? మనదేశీయుల కొకటి విదేశీయుల కొకటీనా ? మే మేదో బౌద్ధమతాన్నవలంబించామని ఆ మతధర్మాల్నే అనుసరించడానికి మహాప్రచారం సాగించామని మీకాలం వాండ్లనుకోవడం ప్రమాదం. మా స్తంభాలమీద మేం జెక్కించిన నీతు లేమతానివి ?

నే : చిత్తం. అన్నిమతాలవారూ అనుసరించదగ్గవి.

అ : ఇకనేం, అవిఘ్నంగా మాకోర్కె తీర్చుకున్నాం.

నే : బాగుంది. అయితే, ఆర్యమతస్థులు తమ నీతి నాచరించలే దేమండీ ? పురాణంలో తమ ర్నార్యప్రభువుగా చాటించలేదేమండి ?

అ : దాని కొకటే కారణం. మనసంఘంలో ననుశ్రుతంగా వస్తూన్న కట్టుబాట్ల నాదరించి బ్రహ్మక్షత్రియాధిక్యతే ప్రధానమని మే మన లేదని. పురాణం గూర్చేవా రాజాతివారలే గాబట్టి మమ్మల్ని మ్లేచ్ఛప్రభువుగా పరిగణించారు. దానికేం ! అంచాత మా కేమీ లోపం రాలేదు.

నే : చిత్తం : తమరు బౌద్ధమతాన్ని వ్యాపింపజేయడంకోసం తగ్గ వాండ్లను పంపారంటారే ?

అ : మే మందుకోసమే పంపలేదు. మా అభికారంతో వెళ్లినవాండ్లు పై మా ధర్మసూత్రాల ప్రచారంకోసం వెళ్లారు. వారితో కొందరా మతప్రచారకు లెళ్లారు. వాండ్లలో మాకుటుంబీకులే వున్నారు. వారు మంచిపని చేయడాని కెళ్తున్నారుకదా, వద్దనట మెందుకని మేం వారించలేదు గాని, మీరు పోయా పనేసి రండయ్యాయని మే మెవర్నీ పంపలా.

నే : చిత్తం. అంటే, తమ సామ్రాజ్యంలో పైనుంచి క్రిందిదాకా రాజకీయాధికార్లతోబాటు ధర్మాధికార్లుండేవారన్నమాట.

అ: ఆ. మండలధర్మాధికారి మొదలు, గ్రామ ధర్మాధికారి వరకు.

నే : ఆ ధర్మాధికార్లే ధర్మాన్ని తప్పితే ?

అ : బాగుంది నీ ప్రశ్న. ఎంత ప్రభువైనా యెవడి కడుపులో దూరి, యెవరి ఊహాపోహల్ను గమనించగలడు ? నలుగురికీ ధర్మవంతుడని నచ్చేవా డొక్కొక్కడైనా వుండడూ ఒక్కొక్క రాజ్యభాగంలో ? ఆయన్నే నియమించేవాండ్లం. ఆయననీతి తటాపటాయిస్తే మరొకణ్ణి నియమించేవాండ్లం. అయినా పరిపాలనావిషయం చూచీ చూడన ట్లుండడం లౌక్యం.

నే: చిత్తం. అట్లాగైతే యెరక్కడుగుతా— వాండ్లకే రాజకీయాధికారమో, రాజకీయాధికార్లకే ధర్మాధికారమో నిర్ణయించక పొయ్యారా, ఒక్కొక్కచో టిద్దర్ని పెట్టడానికంటే ?

అ : రాజకీయాధికార్లు సాధారణంగా లౌక్యులు. లౌక్యులధర్మరక్తి సాధారణంగా తబ్బిబ్బౌతూ వుంటుంది. అందువల్ల ఆ పని ప్రత్యేకించి అధికార్లను నియమించేవాండ్లం.

నే : చిత్తం. తమరు సర్వదా సామ్రాజ్యంలో పర్యటనం చేస్తూండేవా రంటారు, నిజమేనాండి ?

అ : కాకపోతే రాజధాన్లో గూర్చుని సుఖాలనుభవించడానికోయ్ రా జయ్యేది ? అది విదేశసాంప్రదాయం గాని మనది కాదయ్యా ! రాజు ప్రజాసేవలో కాలం గడపా లనే మన పూర్వుల అభిప్రాయం.

నే : అ దేమండీ అట్లా సెలవిస్తారు ? రాజైందానికి సుఖానుభవ మక్కర్లేదండీ ?

అ : అనుభవించనీవయ్యా, అధికార ముంది కదాని దాన్నే ప్రధానం జేసుకోరా దన్నాం గాని.

నే : ఆ పర్యటనంలో దా మేమేం జేసేవారో అడగొచ్చునా ?

అ : అడిగితే నేమీ ? ఏవైనా పెద్దవిషయాలుంటే పరిష్కారం జేసేవాండ్లం. ధర్మనాటకాలాడించి మేం స్తంభాలమీద చెక్కించిన నీతుల్నుగురించి ప్రచారం జేయించేవాండ్లం. కళాపోషణ జేసేవాండ్లం. యింకా అనేకములైన చిల్లర వ్యవహారాలు తీర్మానం జేయించేవాండ్లం. మొత్తానికి ప్రభువు మన కందుతారా, అబ్బో యెక్కడ రాజధాని మన మేం భోగలమని యెవరూ బెంగపడకుండా కొంచెం ఓపికబడితే, వారు మనఊరుకో, దగ్గర పట్టణాలకో వస్తారుకదా, అప్పుడు మనపని చేసుకుందామనే మాట ప్రతివ్యక్తికీ తోచేట్లు ప్రవర్తించేవాండ్లం. ప్రభువు సులభుడనే పద్ధతిక్రింద చాలావరకేర్పడ్డ యేర్పాటది.

నే : చిత్తం. సామ్రాజ్యంనిండా రోడ్లు, సత్రాలు, వాట్లో మూన్నాళ్లవరకు సుచితోపాయాలు ప్రజలకు...

అ : ఆ: ఆమాత్రం సౌకర్యా లేర్పరచకుంటే ప్రభుత్వా లెందుకయ్యా ! ప్రజలవద్ద పన్నుల పేర దీసుకున్న ధనం ఏదోవిధంగా వారికే ముట్టజెప్పడం ధర్మం.

నే : చిత్తం. ధర్మచికిత్సాలయాలు మనుష్యులకు సరే, పశువులకూ, పక్షులగ్గూడా నేమిటండీ !

అ : (చిరునవ్వు నవ్వుచూ) ఇవన్నీ మా కాలంవాండ్లకు సామాన్యవిషయా లనుపించేవి. మీకంతా విపరీతవిషయా లనుపిస్తాయి కాబోలు ! పశువులూ, పక్షులూ మటుకు రాజ్యంలోవికావా ? వాటి క్షేమం, సౌఖ్యంమటుకు పోషించక్కర్లేదా ?

నే : పక్షు లెట్లా చికిత్స పొందేవండీ ?

అ : పశువులకు వాటికి భగవంతుడు తమ అక్కరను గమనించే శక్తి కటాక్షించాడు. ఒక కుక్క యేం జేస్తుందో పరిగ్గా పరిశీలించి చూస్తే, దాని కేదో రుగ్మత ప్రవేశించగానే అది పోయి కొన్ని రకాల గడ్డిని, మొక్కల్ను తిని... తింటుంది. అట్లాటివాటి నక్కడక్కడా వైద్యశాస్త్రం మెరుగున్నంతవరకు మనమే సంతన జేసుంచితే, ఆ చోట్లకే వెళ్లి వాటిబాధను నివారణ చేసుకుంటాయిగా ?

నే : (నమస్కరిస్తూ) ప్రభో, తమరు ప్రపంచసామ్రాజ్యా న్నేలవలసిన మహాపురుషులు !

అ : (చెవులు మూసుకుని) స్తోత్రపాఠాలు వద్దు.

నే : తమకాలంలో మన కీర్తెంతవరకూ ప్రాకిందండి.

అ : ఏమి పడమర గ్రీసు, ఈజిప్టువరకు, తూర్పున చీనా జపానులవరకు, ఉత్తరాన సైబీరియావరకు, దక్షిణాన సింహళంవరకూ బ్రాకింది.

నే : బౌద్ధమతంగూడా అంతవరకూ నక్కడక్క తేర్పడ్డ దంటారే ?

అ : అదేం కష్టమోయ్, ఆ మతం ప్రాకడానికేం ? అప్పటికి దాన్లో పురాణ వేదాంత భాగాలు విశేషించలా. సత్ప్రవర్తనా ప్రధానంగా వుండేది కాబట్టి సర్వజనాంగీకారమై ప్రపంచంలో గబగబా వ్యాపించింది.

నే : అది చాల్దాండీ ? మతానికి వేదాంతం, పురాణ మెందుకండీ ?

అ : రుచిభేదాల్నుపట్టి యేర్పడుతాయి. శరీరానికి గావలసిన బలం సమకూర్చే ఆహారం తేలికగా పాక మాతూంటే దాన్లో రుచిభేదాలకొరకెన్నెన్ని మార్పులు, మార్గాలు ఏర్పడ్డాయి. కేవలసత్ప్రవర్తన అందరికీ రుచిస్తుందా ? అదెందు కుండాలి, అదేమిటి, దాని లాభ మేమి, లోనైన విషయా ల్నాలోచిస్తే వేదాంతం బయలుదేరుతుంది. దాన్ని మునుపు వా రట్లా గనుకున్నారు, ఇట్లా గనుకున్నారు, వా రట్లా వుండేవా రిట్లా వుండేవా రంటే, పురాణాలు బయల్దేర్తాయి. దాంతో మతం పెరుగుతుంది. ప్రతి మతంచుట్టూ యేర్పడ్డ కంపంతా యిదే.

నే : అయితే ఇదంతా మన కామక్రోధాది విశేషాల మహత్తనే తమమతం.

అ : కేవల మదే గాకపోవచ్చు గాని, చాలావర కదే.

నే : రుచు లంటే, జ్ఞాపక మొస్తూం రోజూ తమ పాకశాలలో రెండు నె:

అ : (నన్ను సైగజేసి వారించి) నీకవరకు రంధ్రాన్వేషణం పనిలా గుంది !

నే : అందుకే గాదండీ గుసగుస లందీ.

(22 వ పేజీ చూడుడు)

కథానిక :

పరిణామం

శ్రీ వీరమాసునేని సంగమేశ్వరరావు

ధర్మారావు బాల్యం ఎలా గడిచిందో మనకు తెలియదుగాని బాగా గాయకం వొచ్చినాక స్వగ్రామం వొదిలి మేనమామగారింట్లో వుండి, చదువుకో మొదలుపెట్టాడు. ఎంతో పిరికి, పెద్దవాళ్లు ఘట్టిగా కళ్లు ఉరిమితే, కళ్లవెంబడి నీళ్లు కార్చే ధర్మారావు ఈనాడు అన్ని విషయాల్లోనూ, అంటే—ఉద్యోగం, పెళ్లి యిత్యాది జీవితావసరాలు, విధులు అయిన వాటిల్లోకూడ పెడతిరిగి మాట్లాడుతాడని ఎవ్వరూ ఊహించలేదు.

మొదట్నుంచీ పుస్తకజ్ఞానంమీదకన్నా ఇతరలౌకిక విషయాలు, ప్రాపంచిక భోగట్టాలు అంటే ధర్మారావుకు మహాయిష్టం. అందువల్లే స్కూలుఫైనలు మూడేళ్లకుగాని పూర్తిచెయ్య లేకపోయాడు. తన అనుభవాన్ని బట్టి ఎవరి బిడ్డలమీద శ్రద్ధతో వారు దగ్గరుండి చదువు చెప్పించుకోవటం మంచిదిగాని, ఎప్పుడూ వొకరి బాధ్యతక్రింద వొదలి పెట్టడం మంచిది కాదు అంటాడు ధర్మారావు. కారణ మేమిటి? నువ్వు మేనమామల ఇంట్లో కష్టపడ్డావా? నిన్ను వాళ్లు సరిగా చూడలేదా? అని అడిగితే అందుకూ వొప్పుకోడు.

ధర్మారావు ఉద్యోగం చెయ్యాలని వాళ్ల అమ్మకోరిక, వాళ్ల నాన్న అభిలాషాను. అందువల్ల స్కూలుఫైనలు కాగానే ఉద్యోగం చెయ్యమని పట్టుపట్టారు. చెయ్యనన్నాడు ధర్మారావు. దాంతో అమ్మ, నాన్నకు విరోధిగా,—బంధువులకు పరమశత్రువుగా—తెలిసిన వాళ్ల కందరకూ నిలకడలేని మనిషిగా, అయినట్లు క్రమంగా గ్రహించాడు ధర్మారావు. ప్రతివాడి దృష్టిలోనూ ఒక విచిత్రవ్యక్తిగా కనబడసాగాడు. ఈ వైఖరి, ఇతనంటే, ఇతర్లకు కలిగిన అయిష్టత క్రమంగా 'ద్వేషం'గా మారింది. ఇది గ్రహించి తనకు యీ భౌతికాన్ని యిచ్చిన తల్లిదండ్రులకు ఎదురుతిరగటం, తాను మానుకోవటం మంచిదనుకొన్నాడు. దాంతో తహశీలుదారుగా వున్న పెద్ద తండ్రి సహాయంతో, తాలూకాఫీసులో 'డిస్పాచింగ్' గుమస్తాగా తయారయ్యాడు. వాళ్ల అమ్మ, కొడుకు ఉద్యోగానికి వెళ్తున్నాడని ఆరోజు ఉబలాట పడి పిండివంటలతో భోజనం పెట్టింది. వాళ్లనాన్న కొన్ని జతలు కొత్తపంచలూ, చొక్కాలూ కుట్టించి, జీతం వచ్చేవరకూ వాడుకొనేందుకు కొంత రొక్కం యిచ్చి సాగనంపాడు. కొద్దిరోజులు చెయ్యంగానే 'సర్వీసుకమీషన్' ప్యాసైనవాడు రావటంవల్ల ధర్మారావు ఉద్యోగం కాస్తా వూడింది. ఇది జరగటం ధర్మారావుకు ఎంత ఆనందాన్ని కలిగించిందో, వాళ్ల అమ్మకూ, నాన్నకూ అంత విషాదాన్ని కలిగించింది. కానీ వారు నిరాశతో వొదిలి పెట్టకే 'సర్వీసుకమీషన్'కు కట్టమని ధర్మారావును వేధించారు. 'సరే' నని తన యిష్టంతో, ఆలోచన, పనీ లేకుండానే పరీక్షకు కట్టాడు. తీరా ఆ 'సర్వీసుకమీషన్' పరీక్షకు వెళ్లేవాళ్లు అడిగిన ప్రశ్నలన్నీ వెధవ్విగానే కనపడ్డాయి ధర్మారావు కంటికి.—ప్రపంచంలోకెల్లా ఎత్తైన శిఖరం—ఎలిజెబెత్తురాణీ చర్చికి పెళ్లికి వెళ్తూ ఎల్లాంటి దుస్తులు ధరించింది? (అసలు ఎలిజెబెత్తుకు పెళ్లి కాలేదన్న సంగతి ఎవరికి తెలియదు?...)—సారకాయను ఇంగ్లీషులో ఏమంటారు? ఎక్కడో, ఏ శతాబ్దంలోనో పుట్టి అంతరించిన నామ, రూపాలు లేని రకాన్ని ఇద్దర్ని ఏరి, వాళ్లను గురించి వ్రాయమనటం......... ఈ ప్రశ్నలవల్ల తాలూకాఫీసులో R. C. నెంబర్లు కోట్ చేస్తూ, మెమోలువ్రాసే గుమస్తాగాళ్లకు లాభ మేమిటి? ఈ పరీక్ష ప్యాసుఅయితేనే తాలూకాఫీసులో ఉద్యోగం చెయ్యటానికి అర్హుడవుతాడనటంలోగల అంతరార్థం ధర్మారావుకు యీ రోజుకూ బోధపడలేదు. సంకుచిత హద్దుల్లో, మానవుని స్వేచ్ఛను అరికట్టే ఉద్యోగాలంటే ధర్మారావుకు పూర్తిగా అసహ్యం కలిగింది. ఉద్యోగం ఎందుకు చెయ్యవురా? అంటే దానికి సమాధానం చెప్పటానికి తాను సిద్ధంగా లేనంటాడు ధర్మారావు. అసలుకారణం ఏమిటంటే... దానిని ఎవ్వరూ వినరు, అథవా విన్నా అర్థం చేసుకోవటానికి ప్రయత్నించక వేళాకోళం చేస్తారన్న విషయం ధర్మారావుకు తెలుసు.

ధర్మారావులో ఒక ప్రత్యేకత ఉంది. మిగతా అన్ని విషయాల్లో ధాటిగా ఉపన్యాసాలు యిస్తాడు. చర్చించి పెద్దవాళ్లచేత ఔనని వొప్పిస్తాడుగాని, ఉద్యోగం విషయం వచ్చినప్పుడు మాత్రం చర్చించడు. ఇష్టంలేక మౌనంతో నవ్వుకొని వెళ్లిపోతాడు.

ధర్మారావుచేత ఉద్యోగంచేయించటం తమవల్ల చాతకాదని తల్లిదండ్రులు గుర్తించి, మేనమామచేత చెప్పించారు. ధర్మారావుకు మేనమామమాటలమీద కొంత గురి వుంది. అందుచేత మళ్లీ తాలూకాఫీసులో నాలుగు గోడల మధ్య కుర్చీలో ఇరకక తప్పలేదు. కానీ వసుధాబుద్ధిలో లేంది, ఖర్మలో రమ్మంటే ఏ జాతకానికైనా ఏలా వస్తుంది?

నిత్యమూ కవర్లమీద అడ్రసులు వ్రాయటం, పోస్టు బిళ్లలు అంటించడం, డిస్పాచి పుస్తకంలో వ్రాసుకోవటం. ఇంతకు దప్ప మరో విషయం తనకు సంబంధించిందిగాని, తన దేశానికి సంబంధించిందిగాని, తన కుటుంబానికి సంబంధించిందిగాని, ఏదీ తెలిసేటట్లు, తెలుసుకోవటానికి వీలయ్యేటట్లుగా కనబడలేదు ధర్మారావుకు. ఎంత వోపిక, ఓర్పుతో మనస్సును సమాధానపరచి అమ్మ, నాన్నకోరిక తీర్చటానికైనా ఉద్యోగం చెయ్యాలన్నా సాధ్యపడలేదు. ఆ పరిధి కాస్త దాటి, బయట వాతావరణంలో కొంత స్వేచ్ఛతో బ్రతకాలని పుట్టిన కోరిక బలవత్తరమై, అనారోగ్యమిషతో ఉద్యోగం నుండీ తప్పుకున్నాడు ధర్మారావు.

ఆలోచిస్తున్న కొద్దీ ధర్మారావుకు అవకాశాలు లభిస్తే ఉద్యోగ రీత్యా ఏగుమస్తాగిరిలో పనిచేసేదానికంటే, ఇంకా చాలా విధాల, తాను ప్రపంచానికి ఉపయోగపడగలననే దృఢనమ్మకం మనస్సులో ఏర్పడిపోయింది. "తాను అజ్ఞానినని గాని, అసమగుణ్ణి అనిగాని, ఎవరికీ, ఎందుకూ పనికిరానివాణ్ణి అనిగాని" ధర్మారావు ఎప్పుడూ తన్నుగురించి దుర్బలతతో నిందించుకోడు. తన వ్యక్తిత్వంమీద, అంతరాత్మమీద, శక్తిమీద ఏదో కొంత విలువ, గొప్పతనం ఉన్నాయనే ధర్మారావుఆత్మవిశ్వాసం. బొత్తిగా ఆ విషయం మనం కాదనటానికి వీల్లేదు.

అతని సంగతి అర్థం చేసుకోలేరని ఎరిగి, ధర్మారావు అందరకూ దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తాడు. దీనివల్ల ఒకరకమైన హేయభావం కనిపించింది అందరికీ అతనంటే.

ధర్మారావు క్రాపు దిద్దితే అదిగో పోకులు బలిసినై బడుద్ధాయికి అంటారు వాళ్లఅమ్మతో సహా అంతాను. ఒక జతపంచలు ఎక్కువ కొనుక్కుంటానన్నా, తెల్లచొక్కాలు బారువి కుట్టించమన్నా వాళ్లనాన్న, "సంపాదించుకోలేని వెధవకు మంచి వెక్కడనుంచీ వస్తాయి? తన మొహానికి ఆ పాటి చాల్లే?" అంటాడు.

ఇన్ని యీసడింపులు,తిట్లు, చివాట్లు నిత్యమూ తినటానికైనా వొప్పుకొని ధర్మారావు జీవిస్తాడుగాని, ఉద్యోగం చెయ్యటానికి మాత్రం వొప్పుకోడు. ధర్మారావు చుట్టూ వున్న వాతావరణం... మనస్సు యిలా ఉండగా అతని హృదయంలో ఒక ఆశయంకూడ బయలుదేరింది. అది పేదయింటి 'శ్యామల'ను పెళ్లిచేసుకోవాలని. ఈ విషయం క్రమంగా వాళ్ల అమ్మ, నాన్న చెవిదాక పోయింది. అంతా మండిపడ్డారు. గత్యంతరంలేక కుక్కినపేనులా నోరు మూసుకొని వూరుకొన్నాడు ధర్మారావు.

నాగరికత, నవ్యత, సంస్కారం, అభ్యుదయత్వంలో ఆరితేరిన మనుష్యులం మేం అనుకొనేవారంతా, యీ వాలకంలో జీవితం గడుపుతున్న ధర్మారావుని పిచ్చివానిగా చూశారు. ఇంకేముంది? మనస్సు చెడిపోతుంది. పెళ్ళి చెయ్యండి. లేకపోతే పిచ్చి ఆసుపత్రిలో చేర్చాల్సి వొస్తుంది అన్నారు అంతా. పాపం! జనమంతా తన్ను గురించి యిలా అనుకోవటం విని ధర్మారావు బాధతో కృశించ మొదలుపెట్టాడు. లోకంలో అందరిమాదిరిగా కుళ్లులో, స్వార్థంలో, బానిసత్వంలో, ఆత్మవంచనతో బ్రతకటంచేతగాని లోకవిరుద్ధజీవులకు ఇల్లాంటి బాధలు తప్పవు.

బాధలలోనూ, కష్టాల్లోనూ ఒకవిధమైన సుఖం, తృప్తీ ఉందనుకోవటం వెర్రితనంగా కనబడసాగింది ధర్మారావు కంటికి. ఉద్యోగంచేస్తూ, పదిరాళ్లు సంపాయిస్తూ, ఏదో గౌరవంగా బ్రతుకుతున్నా మనుకొంటూ, కాలం వెళ్లతీయ్యాల్సిన ధర్మారావు (ఇది బంధువులు, తల్లిదండ్రులు, ఆ రకానికి చెందిన తదితరుల దృష్టిలో మాత్రమే) అనవసరంగా మనస్సుని బాధపెట్టుకొని అవస్థపడుతూ కాలం గడుపుతూ ఉన్నాడు.

* * *

ధర్మారావు పెళ్లి ఆలోచనలు జరుగుతున్నాయి. ఎన్నో సంబంధాలు వచ్చి పోతున్నాయి. కానీ ఒక్కటీ జతపడటం లేదు. ధర్మారావుకు పిల్ల అందమయింది, గుణంకలది, సంస్కారంకలది కావాలని కోరిక. వాళ్ల అమ్మకు కట్నం ఎక్కువ రావాలని కోరిక, వాళ్ల నాన్నకు కట్నంతోపాటు సాంప్రదాయం, బంధుత్వం మంచిది గావాలని అభిలాషా ఉన్నాయి. ఇవన్నీ కలిసివున్న సంబంధం జతపడటమంటే ఎలాగో అర్థంగాకుండా వుంది లోకానికి. సృష్టిలో ఏదో ఒక లోపంలేకుండా అన్నీ ఒక్క చోట, మూర్తీభవించి ఎలా ఉంటాయి?

బంధువర్గంలో వారంతట వారే, ఆరువేలు రొక్కం రూపేణ యిచ్చి పిల్ల నిస్తామని ధర్మారావుకు సంబంధం వచ్చింది. దీనికి మొదట్లో పిల్ల యీడుగాదని ఇంట్లో అంతా వద్దన్నారు. కానీ మిగతా ప్రపంచంలో, ముఖ్యంగా ధర్మారావు తల్లివేపువారు ఆ సంబంధాన్ని పూర్తిగా బలపరచారు. మొదట్లో వొద్దు అనుకొన్నవాళ్ల అమ్మ, నాన్న మనస్సులు మార్చుకొన్నారు. కానీ ధర్మారావు మాత్రం మార్చుకోలేకపోయ్యాడు. దాంతో ఇంట్లో చాలాసంఘర్షణలు బయలుదేరాయి. మన పెద్దవాళ్ల ఆలోచనలు పెళ్లిల్ల విషయంలో చాలావిచిత్రంగా ఉంటాయి. స్వబుద్ధిమీద, స్వనిర్ణయంమీద ఆధారపడి నిర్ణయానికి రాలేరు. మధ్య ఎంతమంది బుర్రలతోనో కలిపి పనిచేసిగాని నిశ్చయించరు.

ధర్మారావుదృష్టిలో తనపెళ్లికి సంబంధించిన విషయాలలో, తనూ, తన తలిదండ్రులూ తప్ప మిగతాయెవ్వరకూ జోక్యం ఉండకూడదని ఉంటుంది. అట్లని ప్రపంచంలో ఎవరి సామాన్యపు అలవాటు, హక్కు ఎవరు వొదులుకొంటారు?

ఆరాత్రి ధర్మారావుతాతగారు, ఒకాయన ధర్మారావుని ఆసంబంధాన్ని ఒప్పించటానికి వాళ్ల యింటికి వచ్చాడు. నిర్బంధంగా "నీకు మెజారిటీ లేదు. ఈ సంబధం మా కందరకూ యిష్టమయింది. నువ్వు చేసుకుతీరాలి!" అన్నాడు.

ధర్మారావుకు తనకు కాబోయే పిల్ల, వాళ్ల కుటుంబం ఏసంసారంలో, ఏవాతావరణంలో జీవించే మనుష్యులో బాగా తెలుసు. అది సరిపడదనుకొనే తనకు వొద్దనుకొన్నాడు. అందువల్లే రెండు మాసాలనుంచీ తలకాయ ఎగరవెయ్యలేకపోతున్నాడు.

ఆ రాత్రి వాళ్లతాత వచ్చి ఖచ్చితంగా మాట్లాడటంచూచి ధర్మారావు ఇలాఅన్నాడు. "నాకు ఇప్పటికీ యిష్టంలేదు. కానీ యీ భౌతికాన్ని ఇచ్చిన కృతజ్ఞతతో, మీ అందరికోసరం, ఆ పిల్లమెడలో తాళిబొట్టు కట్టమంటే కడతాను." అని సమాధానం చెప్పాడు. ఈ సమాధానం వినగానే "చూసుకోండి, నాదెబ్బ! వొప్పించాను." అని ధీమాగా అన్నాడు ధర్మారావుతాత.

ఇంత నిర్బంధంగా పెళ్లి విషయంలో పెద్దవాళ్లు ఎందుకు పిల్లల్ని వొప్పిస్తారు? అనే ప్రశ్నకు ధర్మారావుకు సమాధానం దొరకలేదు. అది వాళ్ల స్వభావమా? ఇల్లాంటి సమయాల్ని అవకాశంగా తీసుకొని నలుగురిలో తమ ప్రతిభ వెల్లడిచేసుకొనేందుకు ప్రయత్నమా?...... ఎవరు చెప్పుతారు?.........

మరునాడు ధర్మారావు తండ్రి ఆ సంబంధం ఖాయం చేసుకు రావల్సిందిగా, ఒక పెద్దను పంపాడు. తీరా ఆయన ఆ ఊరు వెళ్లేటప్పటికే, అక్రితంరాత్రే పెళ్లి కూతురువారు, రెండు నెల్లనుంచీ ఏ సంగతీ తేల్చి చెప్పలేదన్న విసుగుదలతో, మరో సంబంధం ఖాయ పరచుకొన్నారని తెలుసుకొని వచ్చి, ఆ విషయాన్ని చెప్పాడు.

ఆ బంధువుల సంబంధాన్ని మిగిలిపోయేటట్లుగా కాలం జరిపి, ఘర్షణ పెట్టినందుకు ధర్మారావుని అంతా నిందించారు.


ఆ ఊరునుంచే అంటే వెనుకటి బంధువుల సంబంధం వొచ్చిన గ్రామంనుంచే మరో పరాయి సంబంధం వచ్చింది. వారికి ఒక్కతే ఆడపిల్ల. వారి కున్న ఆస్తికూడా కొద్ది ఎకరాలుమాత్రమే. అదీ అంత పెద్ద సారవంతమైన పొలం కాదు. పిల్లమాత్రం మంచిది, సంస్కారంగల మనిషి. ధర్మారావు వెళ్లి ఆ పిల్లని చూచికూడ వచ్చాడు. కాని కట్నందగ్గర పేచీ వచ్చింది. రొక్క రూపేణా డబ్బు లక్ష్నందగ్గర కుమ్మరిస్తేగాని ఆ సంబంధం చేసుకోవటానికి వీల్లేదని ధర్మారావు తల్లిదండ్రులు, బంధువులు అంతా అడ్డుపడ్డారు. ధర్మారావు చాటుగా తండ్రిని ఆ పిల్లనే చెయ్యమని ప్రాధేయపడి అడిగాడు. తండ్రి యిలా అన్నాడు: "ఒరేయ్! అబ్బాయ్! నీ కన్నీ వెఱ్ఱి వేషాలుగా ఉన్నాయ్! లోకంలో యీనాడు నగదు రూపేణ కట్నం తీసుకోకుండా పెళ్లి చెయ్యటమనేది పరువుతక్కువ పని. వాళ్ల పొలంతో మనకి సంబంధం లేదు. నిమిషాలమీద అమ్మి రొక్కం కుమ్మరించటానికి వాళ్లు సిద్ధపడితే చెయ్యటానికి నా అభ్యంతరం లేదు. అయినా నీ పెళ్లికి నీ ఆలోచనలు, నీ నిర్ణయాలు ఏమిటి? పెద్దవాళ్లం మేం ఉండగా నువ్వు నోరు మూసుకు కూర్చోక దేనికీ యీ అల్లరిఅంతాను? నీమాట సాగుతుందనేనా?" అని కళ్లు ఉరిమి గద్దించి పలికాడు.

ధర్మారావు ఆలోచించుకొన్నాడు. ఈ ప్రపంచ చర్యలు, సిద్ధాంతాలు, నిర్ణయాలు, కట్టుబాట్లు, ఆచారాలు అన్నీ చాలావికారంగా ఎవడి జీవితంమీద వాడికి హక్కు లేకుండా అన్నీ హద్దుల్లో బిగింపబడ్డట్టుగా— ప్రతివాడు బానిసగా—తమ జీవితాల్ని ఎవరికో అప్పజెప్పి నడవటమే యీ కాలంలో సంఘంయొక్క శాసనంగా, హాయిగా కాలం వెళ్లబుచ్చుకొన్న మానవుల విధిగా ధర్మారావు కంటికి కనబడ్డది.


"లాభంలేదు." అని యిహ తన ప్రయత్నాలు మానుకున్నాడు. విఫలుడై జుట్టుఅంతా పీక్కు ఏడ్చాడు. తన వుద్దేశ్యాలు, ఆదర్శాలు అన్నీ న్యాయంగా మంచివే. కాని ఆ న్యాయమనే దానికి స్థానం ఎక్కడ? తన కర్తవ్యాన్ని విధులను ఎవ్వరూ నెరవేర్చుకోనివ్వ రన్న సంగతి ధర్మారావుకు పూర్తిగా అనుభవంమీద అర్థమయ్యింది. ఈవిధంగా ఉన్న సహజమైన మనస్తత్వాన్ని క్రమేపీ ధర్మారావు పోగొట్టుకొంటున్నాడు.

ఏమానవుడూకూడ తనకు ఉండాల్సిన సహజత్వం పోగొట్టుకొంటే, ఆ జాతిలోకి మళ్లీ రావటం అసంభవం అన్న విషయం ధర్మారావు ఆలోచనలోకి వచ్చింది. కానీ ఏంప్రయోజనం? అన్నీ వొదులుకు బ్రతుకుతున్నాడు ధర్మారావు.

19 వ పేజీ చూడుడు)



ఈ "లైఫ్‌ఫ్లోటు" బరువు 200 పౌనులు. దీనిని ముడిచి కట్టకట్టిన స్థితిలో ఇద్దరు మనుష్యులు సునాయాసంగా ఓడమీదకి, కిందికీ చేర్చవచ్చును.




పరిపూర్ణప్రయోజనస్వరూపంలో


రాడార్ యంత్ర
కొత్త "లైఫ్

బ్రిటిష్, నౌకాశాఖ ఈ కొ
ద్రంలో నౌకాభంగము జరిగినప్పుడ
చేసింది. లైఫ్‌బెల్టులో చాలా వి
J. లైఫ్, గాలిడింగీని యుద్ధానంతరం
కన్నా మేలితరంగా, "J. S. లైఫ్"
తయారు చేశారు. ఈ ఫ్లోట్‌ను గాలి
మోటారుటైర్ లాగ ఉంకి, టైర్ వలం
రుతో, తేలవరుపుగా నింపి పైన తె
టుంది కూర్చు చేందుకు ఉన్న నేలఅ
లతో ఉండబట్టి పొడిగాఉండి, గము

ఈ "పుట్టి"లోనే తిండి, వ
దుకు అలమారులున్నాయి. సముద్ర
కొనేందుకు టెలిస్కోప్, కాంపస్,
యంత్రాలే కాక, రాడార్ యంత్ర
ఉన్నాయి. "పుట్టి" లోపలికి పార్లిన
చేదలు, స్పాంజి, పుట్టి నడిపే తెడ్లూ, "
దుకు, సరంజామూ, అలమర్లూ, అ
నప్పుడు చిన్నమూటగా ముడిచి
వీలుంటుంది. పగంవరకూ
మంది మనుష్యులు ఈ "పుట్ట
దుకు అవకాశముంది. ఈ "లైఫ్
పౌనులు మాత్రమే. గాలిలేనప్పుడు,
మాము మాత్రమే ఆక్రమించ
నింపాలంటే కార్బన్‌డై ఆక్సైడ్‌వ
చిన్న సీసా మూతను తెరుస్తారు. అ
ఒకదారం లాగితే చాలును, కొద్ది
పెద్దదై, ఉపయోగానికి తయారుగా

సీటిలో వదలగానే "లైఫ్‌ఫ్లోట్"—అందులోకి ఎగబ్రాకుతున్న నావికులు.






లైఫ్‌ఫ్లోట్ చిత్రము.

యుతమైన ఫ్లోట్"

త్తరకం "లైఫ్‌ఫ్లోటును" సము
ం నావికులరక్షణకు తయారు
ంతవింతమార్పులు జరిగాయి.
తయారు చేశారు. ఇప్పుడు దాని
ానే ఈ గాలి బుడగ "పుట్టిని"
తో నింపితే, చుట్టూ ఒక పెద్ద
ధుం అడుగుమట్టం అంతా, రబ్బ
చాప, గుడారం ఉంచినట్టు ఉం
తా, గాలినింపిన రబ్బరు మెత్త
ద్రపునీళ్ళ చలి తగలనియదు.
ంచినీళ్ళు, భద్రపరచుకొనేం
కంలో ఎక్కడున్నదీ తెలుపు
మొదలైన మామూలు నావిక
ాలుకూడా లోపల అమర్చి
నీళ్లు బైటికి తోడేసేందుకు
పుట్టి" అంతా గాలితో నింపేం
న్నీ ఉంటాయి. గాని తీసేసి
వీపున మోసుకుపోయేందుకు
నీటిమీదికి దింపినప్పుడు, పది
నిలిచి తమ్ము రక్షించుకొనేం
ఫ్లోట్" మొత్తం బరువు 200
$3 \times 2 \times 1\frac{1}{4}$ అడుగుల పరి
పకొంటుంది. దీనిలో గాలి
ాయువును బిగించిఉన్న ఒక
మూత తెరవటానికి పైనుంచి
సెకండులలో గాలిపూర్తిగా
ండుతుంది.



మూటకట్టక పూర్వము, "లైఫ్‌ఫ్లోట్"లో ఉన్న ఉపకరణాల స్వరూపము. రాడార్ యంత్రం బిగించు కొనే తెరచాప కొయ్యను, టెలిస్కోప్ గొట్టంలాగా కావలసిన పొడుగుకు పెంచుకొంటూ పోవచ్చును. రాడార్ యంత్రం, గాలిలేనప్పుడు లైఫ్‌ఫ్లోటు మూటయొక్క పరిమాణాలు బొమ్మలో గమనించవచ్చును.

★

తెరచాపనూ గుడారాన్నీ అమర్చుకొంటూన్న చిత్రం.





మొద్దబ్బాయి

చి॥ మందుల హనుమంతరావు

అనగనగా, ఒక వూరిలో తల్లీ కుమారులు వుండేరి. కుమారుని పేరు యండ్రకాయ. అతనికి పొట్ట గోసినా వొక అక్షరంకూడా లేదు. పాపము, తల్లి పీతమ్మ కొమారుని జీవితమునుగూర్చి చాల చింతిల్లుచుండెను. 'బిడ్డా యండ్రకాయ, నీకు వొక వ్యాపారవృత్తిని చూపెదను చేయుదువా?' అని తల్లి అడిగెను. 'ఆ చేయుదు'నని చెవులూపుతూ నిలబడిపోయెను. 'నీకు నూరు పెసరట్లు పోయించి యిచ్చెదను. వాటిని నీవు వూరిలోకి గొంపోయి కానీ కొక పెసరట్టు అమ్మవలయును. ఇలా ప్రతి నిత్యము అమ్మితివేని నీ కో చక్కని చుక్కను పెండ్లి చేయగలను అని తల్లి చెప్పెను.

ఆ పెండ్లి ఆశతో పెసరట్ల బుట్టతో బైలుదేరి వూరి వెలుపల మడుగుల దగ్గరకు వెళ్లి 'పెసరట్లో పెసరట్లు.' అని అరిచెను. మడుగులో కప్పలు 'బెకబెకా' యని అరిచినవి. 'మీకు పెసరట్లు కావలయునా?' అని అడిగెను. కప్పలు 'బెకబెకా' యనెను. నూరు అట్లు అందులో పారవైచి డబ్బు అడిగెను. కప్పలు బెక బెకా యనెను. రేపు యిస్తారా యని అడిగెను. మళ్లీ బెకబెకా యనెను. రేపు యిస్తారా యని యింటికి తిరిగి పోయెను.

మరునటి దినము నూరు పెసరట్లు తీసుకొని అదే మడుగుకు పోయెను. అట్లో పెసరట్లో అని అరిచెను. కప్పలు మళ్లీ బెకబెకా యనెను. 'పెసరట్లు యిస్తాను కాని దుడ్లు యిస్తారా?' యనెను. కప్పలు బెకబెకా యనెను. నూరు అట్లు అందులో పడవేసి దుడ్లు అడిగెను. అడుగగానే కప్పలు బెకబెకా యనెను. రేపు యిస్తారా యనెను మొద్దబ్బాయి. చూడు కప్పలారా, నిన్నటి, యివ్వాళటివి, రేపటివి అన్ని దుడ్లు యివ్వాల అనెను. కప్పలు బెక బెకా యనెను.

ఇంటికి వచ్చి యండ్రకాయ 'అమ్మా మూడు దినముల దుడ్లు రేపే యిస్తామన్నారు'. క్రొత్తగా వ్యాపారమువలన వృద్ధరయియ్యవలసినదని తల్లి పీతమ్మ తెలుసుకొనెను.

'అదే సాయంకాలము రాజుగారి యింట్లో ధనముతో వుండిన వొక బంగారు కడువ వొకటి దొంగలు తీసుకొనిపోయి అదే కప్పలు గల మడుగులో వేసి పోయిరి.

యీ మొద్దబ్బాయి మరునటి దినము నూరు అట్లు తీసుకొని అదే మడుగునకు పోయెను. అట్లో పెసరట్లో అని అరచెను. కప్పలు బెకబెకా యనెను. అంతలో అట్లు పారవేసి దుడ్లు అడిగెను. కప్పలు మూడు రోజులనుంచి తినడం వల్ల అరవకుండ వూరికే వుండె. యండ్రకాయకు కోపము వచ్చి మడుగులోకి దూకెను. దూకగానే బంగారు కడవ చిక్కెను. దానిని తీసుకొని తల్లి కిచ్చెను.

పీతమ్మ గ్రహించి కడవను పొయ్యి క్రింద బూడ్చి బెట్టె. బజారునకు పోయి ఒక రూపాయికి లడ్డూలు తెచ్చి, పిల్లవాడు యండ్రకాయ పడుకొని వుంటే, 'వరే యండ్రకాయ, లడ్డూలవాన పడుతున్నది లేరా' యనెను. వాడు క్రింద పడి యేరుకొని తింటూవుంటే, పీతమ్మ మీదినుంచి చల్లడము మొదలు పెట్టెను. ఇలా వొక పది నిమిషములు కురిపించెను. తరువాత సాయంకాలము యండ్రకాయ తిన్నగా సికారిగా వెళ్లుతుంటే వీధిలో చాటింపుతో 'రాజుగారి యింట్లో బంగారు కడవ పోయినది. యెవరేకాని తెచ్చినట్లయితే నూరు రూపాయలు బహుమానము' అన్నారు. అనగానే యండ్రకాయ 'యే అబ్బీ, నా దగ్గర వున్నది!'అని చెప్పి యింటికి తోలుకొని వచ్చెను. 'అమ్మా ఆకడవ వాండ్లది అంటా ఇవ్వమని'అన్నాడు.

ఆమె 'యెక్కడి కడవా?' యనెను.

'అమ్మా, నిన్న తెచ్చిన కడవ' అనెను 'వరే మొద్దు ముండాకొడక, కడవ గిడవ యేమీ లేదుపో' అనెను. తల్లిని, వానిని, పట్టుకొని కోర్టునకు తీసుకవెళ్లిరి. కోర్టులో 'పీతమ్మా నీ కొమారుడు యిచ్చినానని పలుకుతుంటే నీవు లేదని అబద్ధములాడెదవా?' అనిరి.

సరే కాని, నాయనా, దానికేమి, యెప్పుడు యిచ్చినాడో అడగండి.

"వరే యండ్రకాయ, యెప్పుడు యిచ్చినావురా మీ యమ్మచేతికి?" అని కోర్టు మేజిస్ట్రేటు అడిగెను.

"అమ్మా, ఆపొద్దు లడ్డూలవాన పడ లేదా, అప్పుడు" అనెను.

"చూడండిసార్, యెప్పడైనా లడ్డూల వాన కురియునా? వీడు వొట్టి పిచ్చివాడు. లేనిపోని తగాదాలు ఇంటికి యిలాగే తెస్తూ వుంటాడు" అని పీతమ్మ అనగానే కోర్టువారు పీతమ్మను, యండ్రకాయను వదలివేసిరి.

రెండు కుక్కలు

చి॥ శాంతకుమారి

అనగనగా ఒక వ్యవసాయదారునికి రెండు కుక్క లుండేవి! అతడు వాటిని బాగా ప్రేమించేవాడు. కాని ఆ రెండు కుక్కలకు ఒక టంటే ఒకటికి ఇష్టముండేది కాదు. అతడు వాటిని ఎప్పుడైనా కట్టివేయడం మరచిపోతే, ఆ రెండు కుక్కలూ బాగా పోట్లాడు కొనేవి. అందుచేత, వానిని అతడు దూరంగా కట్టివేసేవాడు. అతడు, ఆ రెండు కుక్కలకు ఉన్న వైరానికి చాలా విచారపడేవాడు. అందుకని అతడు మర్యాదరామన్న అనే మంచి తెలివైనవాని దగ్గరకు వెళ్ళి సంగతి అంతా పూసగ్రుచ్చినట్లు చెప్పేడు.

అప్పుడతడు "నీ రెండు కుక్కల్ని దగ్గరలోనే ఉన్న అడవికి తీసుకొని వెళ్ళి, ముందు ఒక కుక్కను వదిలి వేసెయ్యి. ఆ అడవిలోనే ఉన్న తోడేలు దానిని చంపుదామని చూస్తుంది. అప్పుడు రెండవ కుక్క ఇదంతా చూసి బాగా మొరుగుతుంది! వెంటనే దానినికూడా వదలి వేసెయ్యి. ఆ తోడేలును, రెండు కుక్కలూ కలసి తప్పకుండా చంపి వేస్తాయ్!" అని చెప్పేడు.

ఆ వ్యవసాయదారుడు అట్లాగే చేసేడు. తను అనుకున్న ఉపాయం నెగ్గినందుకు అతడు చాలా సంతోషించేడు. ఆతరువాత, రెండుకుక్కలు ఎంతో స్నేహంతో మెలగుతూండేవి. ఆ తోడేలువలన, ఆ రెండు కుక్కలూ ఎప్పుడూ స్నేహంగానే ఉన్నాయ్.

బాలగేయాలు



శ్రీమతి పర్చ్చా సీతాదేవి

[సంపాదకురాలు]

౨

వంట యిల్లు దిద్దేటీ కోలు ఓ అత్తగారూ !
మా అన్న లొచ్చారూ కోలు మ మ్మంపారమ్మా.
మీ అన్నలొస్తేనూ కోలు ఏమి తెచ్చినారే ?
నాకు నల్ల చీరే కోలు నెమలడుగుల రెవికే,
పాపకు పట్టంగీ కోలు పాలు త్రాగు గిన్నే,
వారికి యంబ్లాషా కోలు అంగీలా జోడూ,
అత్తకు పట్టు చీరే కోలు అద్దాలా రెవికే,
మామకు పట్టంచూ కోలు మడతల శాలువలూ,
అయితే నే నెరుగా కోలు మీ బావేగానీ.
భారతం చదివేటీ కోలు బావాగార్లండీ !
మా అన్నలొచ్చారూ కోలు మ మ్మంపారండీ.
మీ అన్నలొస్తేనూ కోలు ఏమి దెచ్చినారూ ?
నాకు నల్ల చీరే కోలు నెమసడుగల రెవికే,
పాపకు పట్టంగీ కోలు పాలు త్రాగు గిన్నే,
వారికి యంబ్లాషా కోలు అంగేలా జోడూ,
అత్తకు పట్టు చీరే కోలు అద్దాలా రెవికే,
మామకు పట్టంచూ కోలు మడతల శాలువలూ.
అయితే నేనెరుగా కోలు మీ అక్కేగానీ.

నక్క మోసం

చి॥ యనమండ్ర అన్నపూర్ణ

అనగా అనగా ఒక తోట గలదు. అందు ఒక నక్క ఒక ఎలుగుబంటి ఎక్కువ స్నేహముతో నివసించుచుండెను. ఒకనాడు అవి పంటలు పండిద్దా మనుకొనినవి. పంటలు పండినపుడు, మొదటి సంవత్సరం పంట లడుగుభాగం (భూమిలో పండినవి) నక్క తీసుకొనుటకును, పైభాగం ఎలుగుబంటి తీసుకొనుటకును, రెండవ సంవత్సరం పంట పైభాగం (భూమిపైనిపండినవి) నక్క తీసుకొనుటకును, క్రిందిభాగం ఎలుగుబంటి తీసుకొనుటకును ఒప్పుకొనినవి. మొదటి సంవత్సరం నక్క వేరుసెనగ పంటవేసినది. వంతుప్రకారము నక్క పంట క్రింది భాగమున ఉన్న వేరుసెనగలు లన్నీ తీసుకొనెను. పాపం ! ఎలుగుబంటికి ఒక్క ఆకులుమాత్రమే ఒచ్చినవి. రెండవ సంవత్సరం మొక్కజొన్నలు వేసినవి. ఈసారికూడా నక్కవంతు ప్రకారం మొక్క జొన్నలు తీసుకొనినది. పాపం! ఈసారి ఎలుగుబంటికి మన్నులోఉన్న మొక్కల వ్రేళ్లు దొరికినవి. ఈసారి నక్క మోసం తెలుసుకొని ఇంక ఎప్పుడూ దానితో పంటలు పండించకూడదని ఎలుగుబంటి బుద్ధి తెచ్చుకుంది.

గ్రామ ఆర్థిక దుస్థితి

శ్రీ కుదిరి యే. దేవరాజు

మన గ్రామములందలి ఆర్థికదుస్థితికి అనేక కారణము లున్నవి. వ్యవసాయము ముఖ్యమైన పరిశ్రమయై యుండియూ, గ్రామాదులలో అట్టి వ్యవసాయము అభివృద్ధిపొందుటకు విరివైన వసతులు లేకపోవుట, ముఖ్యంగా మన దేశంలో కూలినాలిపై ఆదర్వపడి యున్న (ముప్పాతిక కన్నా హెచ్చు) గ్రామాదులవారికి అదైనా సరిగా దొరకక, అథవా, లభించినా అది యే దినమునకు ఆ దినమునకైనా చాలక పోవుట, చేత నాల్గు డబ్బులు రాగానే సరిది వాడుకోక, క్రమప్రకారం జీవించక, భవిష్యత్తు గూర్చి కొంచెమైనా ఆలోచనపెట్టక, అది యేమో, దినజీవితంలో గడుపుతూ అనేకకష్టాలను, కడకు ఆరోగ్యభాగ్యం కూడా కోల్పోయి, అనాథులుగా, కొంప గూడు లేక అతినీచజీవనం జీవిస్తున్నారు మన గ్రామవాసులు.

అంతియేగాక, అతి పురాతన పద్ధతుల వదలనంటున్న మన గ్రామంవారు కూలితనంలో సంపాదించిన ఆ కొద్దిరూకలను, తగాదాలకు, దావాలకు వ్యయపర్చుతున్నారు. ఒక పెద్ద రైతు ఆ గ్రామాన్ని తన స్వంత అదుపులో పెట్టుకొని తానే భుక్తి పర్చుకొని, తన పిల్లలనే అభివృద్ధిపర్చుకొనుచూ, తన ఇతర సోదరులపైగాని, వారి భవిష్యత్తుగూర్చిగాని, అసలు తన గ్రామాభివృద్ధిపర్చు కోరికగాని, లేక ఒక క్రూరమృగమువలె తన పథకాన్ని గ్రామాలలో చలామణీచేస్తూ, ఇంతవరకూ గ్రామాలు అధోగతిలో వుండుటకు ఆ కొద్ది జ్ఞానంకలిగిన పెద్ద రైతులే బాధ్యులని తప్పక చెప్పవలసియున్నది.

ఇప్పట్లో గ్రామాదులు, కొన్ని విషయాలల్లో ముందజ వేస్తున్నాయనక తప్పదు. కొన్ని గ్రామాలు అన్నివిధాలా మేల్కొన్నాయి. సర్కారుజిల్లాలలోని, పెద్దమద్దాలి, పామర్రు, కోలనన్ను, బుచ్చిరెడ్డిపాళెం, రాయలసీమలోని నారాయణవనం, కోడూరు, ముఖ్యంగా రాజంపేట తాలూకా, నందియాల తాలూకాలు మన రాయలసీమలో అభివృద్ధికి వచ్చినవని ఒక విధంగా చెప్పవచ్చు. ముఖ్యంగా యువకులు గ్రామాదులల్లోకూడా సోమరితనాన్ని ప్రేమించి, అర్థంలేని ఆటపాటలల్లో మునిగి, తమ ఆర్థికాన్నేగాక తమ కుటుంబాన్నే నాశనంచేయుటకు కారకులై పోతున్నారు. గ్రామసౌభాగ్యమే దేశసౌభాగ్యం కాన, గ్రామాదులను ఆరోగ్యవంతముగను, ఐశ్వర్యవంతముగను జేసికొని ఆనందించుట యెల్లరి విధి. తరతరములనుండి వెనుకబడియున్న గ్రామస్థులను మేల్కొల్పుటకు మన మెంతయో పాటు పడవలసియున్నది.

గట్టిగా ఆలోచించిన ప్రతిమానవుడూ, తాను దినమునకు కొన్ని గంటలకాలమును వృథాపర్చుతున్నాడు. తన వృత్తికి పోగా మిగిలిన కాలాన్ని దురభ్యాసాలకు వ్యయపర్చుతున్నాడు. వ్యవసాయదారుడు పంజాబులో సం॥లో 150 దినములు, మదరాసు రాజధానిలో రెండుకారులు పండుచోట్ల యెనిమిది మాసాలున్నూ, ఒకపంట పండుచోట ఐదుమాసాలున్నూ, బెంగాలు సంయుక్తరాష్ట్రాలల్లో షుమారు యేడుమాసములే పని యుండునని లెక్క తీర్చినారు. కాన ఈ దేశవాసులు మిగత సమయాన్ని వృథాపర్చుతున్నారన్నమాట. తీరుబడి సమయాన్ని వుద్యోగస్థులు సయితం యేదైనా లాభకరమైన వుపవృత్తిలో వినియోగపర్చిన చాలా సహాయకారిగా ఉండును. పశ్చిమవాసులు వుపవృత్తి క్రింద తమ తీరుబాటు కాలాన్ని వ్యయపర్చి వుపయోగాన్ని పొందుచున్నారు. వైమానికులు సహా తమ కష్టమైన పని ముగిసి ఇంటికొచ్చినప్పుడు, యే చిత్రపటముల వ్రాయుటయో, ఫోటోలు కడిగి అందులో వివిధపనులు చేయుట, పావురములు పెంచుట, కూరగాయమొక్కలు, క్రోటనులు మొదలగువాటిపై శ్రద్ధ పూనుట, నాటకాలు, మంచిగ్రంథములు చదివి జ్ఞానాన్ని అభివృద్ధి పర్చుకొనుట, ఇంట యేదో ఒక మరామత్తుపని మొదలగునవి చేసుకొంటూ తమ ఆదాయాన్ని సౌభాగ్యాన్ని వృద్ధిపర్చుకొంటున్నారు.

ఈ భారతావని కూటికి గుడ్డకు అల్లాడిపోతున్న దంటే, ఇట్టి వుపపనులు ప్రోత్సాహంతో, గౌరవంతో చేయకపోవడమేనని మొదట చెప్పవలెను. అయినా వ్యవసాయం ముఖ్యజీవనోపాధియైన ఈ విశాలభూమిలో భారీపరిశ్రమలతో పాటు ప్రతిగ్రామంలో, ప్రతిఇంట, ప్రతి మానవ అవతారం ఒక వుపవృత్తిక్రింద యేదో ఒక సులభసాధ్యమగు కుటీరపరిశ్రమ నేర్చి సాధనంచేసిన తన కింతో లాభదాయకమేగాకుండా ప్రపంచంలో మన దేశం పదిసంవత్సరాలల్లో జపాన్, చైనా, రష్యా, అమెరికాల కన్నా ముందు నిలబడగలదు.

రసాయనములు, ముడిపదార్థములు విరివిగా, సునాయాసంగా దొరికే లక్షలాది గ్రామాలు ఒక్కొక్క చేతిపరిశ్రమ అభివృద్ధిపర్చిన తన లాభానికేగాదు, దేశసౌభాగ్యానికి, పాటుపడిన అసలు భారతీయు తాతామని నా నమ్మిక. ఇండియాలో, శ్రీ కుమారప్పగారు (అ. భా. గ్రా. ప. సం.) చెప్పినట్లు భారీపరిశ్రమలకన్నా చిన్న చిన్న కుటీరపరిశ్రమలకు, కావలసిన ముడిపదార్థములు లెక్కలేకుండా సంవత్సరాల కొలది మన్నుపాలై పోతున్నాయి. గ్రామాదుల్లో భారీపరిశ్రమలపై పెట్టే లక్షలధనం, కొన్ని నూర్ల కుటీర పరిశ్రమలు స్థాపించిన, వేలకొలది ప్రజలకు పని కల్పించి, జీవనోపాధి నిచ్చుటే గాక, గ్రామాదులలో వృథాగా పాడైపోయే ముడిపదార్థములు వుపయోగానికి తెచ్చుట, మూల మూలదేశమంత, తనకు తాను ఒక పరిశ్రమలో నిపుణుడై, కేవలం, లాభానికే కాకుండా, రేపటి దేశసౌభాగ్యానికి, దేశరక్షణకు ఈ కుటీరపరిశ్రమలు చెక్కుచెదరక, యే ప్రభుత్వపురాతుసులు యెట్టి భస్మీకరణ శక్తిగల ఆయుధాలతో వచ్చినా, యెదురునిల్చి, తరుగులేని శౌర్యంతో పోరాడి మన ఐక్యభారతభూమిని బంతిలాగా చేతిలో కాపాడేందుకు మూలమైయుండుటకు ఈ కుటీరపరిశ్రమలే, ఈ గ్రామాలే, ఈ వుపవృత్తులేయని చెప్పిరి."

ప్రస్తుత గ్రామాదులల్లో అనేక మతాల భేదాలు పోయి సోదరత్వం యేర్పడుతున్నది. కాని, తామేల వ్యయప్రయాసలకులోనై, సుఖమనుభవించలేక, రాత్రింబగళ్లు కష్టించి, కష్టించి కడకు దేవుణ్ణే నిందించేస్థితికి వస్తున్నారు. ఇదే మన గ్రామాదులల్లో ముఖ్యంగా మన ఆర్థికాన్ని గూర్చి ఒక్కమాటు ఆలోచించవలసి వస్తుంది. వ్యవసాయం గ్రామాంతరాలల్లో మొదటి ఆధారపరిశ్రమ. వ్యవసాయానికి, సహకారియై, ముఖ్యఅవసరమై, రైతుగా గ్రామాలలో వుండేవారికి, మరొక పరిశ్రమలుకూడ అంత ఆధారపరిశ్రమయై వుంటున్నది. అదే, వుపవృత్తి, లేక కుటీరపరిశ్రమలు. ఇట్టి పరిశ్రమలు ఆయా గ్రామాదులల్లో ఒకటిరెండు నూత్నపద్ధతులల్లో అమర్చుకొన్న, మరియు ప్రతిఇంట ప్రతిగ్రామవాసి, తాను పొద్దంతా వ్యవసాయం చేసి తీరుబాటుగా వున్న కాలంలో తనకు, తన ఇంటికి, లేక గ్రామానికి, లేక తన వ్యవసాయానికి అవసరమైనవే ఒక చిన్నకుటీరపరిశ్రమను నేర్చుకొని, దినమూ ఒక గంటకాలం దానిపై వ్యయపర్చి ఆలోచనతో తన నేర్పరితనాన్ని చూపించిన, ఆ గంటకాలంలో ఒక పావులా సంపాదించుకొన గలుగుటేగాక, తాను మరొక గ్రామం, లేక మరొకరి సహాయం కోరవలసిన పని లేకపోయేంది. ఇట్టి కుటీరపరిశ్రమలు ఒక గ్రామంలో ఇరవై రకములు అభ్యాసంలో వుంచుకొనవచ్చు. వాటికి కావలసిన ఆయుధాలు వేలు, నూర్లు పోసి కొననక్కరలేదు. అయితే ముఖ్యంగా గ్రామాదులలోకి విద్యుచ్ఛక్తి ప్రభుత్వం రప్పించిన, గ్రామాలు కరెంటుమూలకంగా ముందుకు రాగల కుటీరపరిశ్రమలు, వ్యవసాయం ఇతరము లనేకము లున్నవి. ప్రతి గ్రామంలోకి విద్యుచ్ఛక్తి రావాలంటే వుత్పత్తి కేంద్రాలు ఇపుడిప్పుడే తయారౌతున్నాయి. తుంగభద్ర, రామపాదసాగరంలాటి గొప్పవిద్యుచ్ఛక్తి నిచ్చే కేంద్రాలు మన దేశంలో త్వరము మరికొన్ని తనపనిని ప్రారంభించవచ్చు. 650,000 గ్రామాలు గల మన భారతభూమి ఒకేపెట్టున, దీపావళి పండుగనాటి ఇండియావలెగాకపోయినా, 10 సం॥లలో పూర్తిగ్రామాదులు విద్యుచ్ఛక్తి, దానివలనిలాభం అనుభవించగలవు.

వ్యవసాయకులే గాకుండా ఇతరులుకూడా వృథాగా కాలాన్ని పాడుచేయకూడదు "గడచిన కాలం తిరిగి రమ్మన్నా రాదు" అన్నట్లు, ఇన్ని సంవత్సరాలుగా పోయినవి పోవటం, ఇకనైనా మన గ్రామసౌభాగ్యాన్ని పెంపొందింపాలన్న వుపవృత్తి వారు నేర్చుకోవాలి.

కోళ్లపెంపకం, పందులు, పశువులు, పావురాళ్లు, బొత్తాములు, లేసులు, కుట్లుపని, చేనేత, సబ్బులు, కమ్మరం, వడ్రంగం, బొమ్మలు చేయుట, తోలుపరిశ్రమ, చాపలు, బుట్టలల్లుట, కూరగాయలు పండించుట, నూలువడకుట, కాగితాలుచేయుట, కంబళ్లు, రత్నకంబళ్లు నేయుట, నూత్నవిధాన కుమ్మరిపని, చేపలపెంపకం, తేనెటీగలు, పట్టుపురుగులు పెంచుట, చిన్నచిన్న తగరపుపని, ట్రంకుపెట్టెలు, తాళపు కప్పలు చేయుట మొదలగునవి.

ఇంకా కొంచెం పెట్టుబడి, నిపుణతో వున్నవారు, గుడ్డాలు, జాతికుక్కలు పెంచి అమ్ముట, గడియారాలు, పెన్నులు, దువ్వెనలు, పిత్తలి, అల్యూమినియం పాత్రలు, బ్రష్షులు, ఫోటోగ్రాఫీములు కట్టుట, చిత్రపటములు వ్రాయుట, ఇంకా విద్యుచ్ఛక్తి సహాయాన తన నేర్పరితనాన్ని చూపగలిగే అనేక వుపపనులు వున్నవి.

సాధారణంగా నావారు నేయుట, నూలువడకుటకు, పెట్టుబడి చాల స్వల్పము. బీదవారు మొదలు ధనికులవరకూ ఈ పరిశ్రమను నేడు గౌరవంతో చేయుచున్నారు. ఈ పరిశ్రమలో, గాంధీమహాత్ముని లాంటి అతివాదిని కాకపోయినా ఈ పరిశ్రమను ప్రతివారు వుపవృత్తి క్రింద చేయవలసినదై యున్నది. బుట్ట లల్లుట, తాళ్లు, చాపలు, తదితరములుకూడా పెట్టుబడి జాస్తి కోరవు. ఇవంతా గ్రామాదులల్లో సులభంగా దొరికే ముడిపదార్థములతో చేసి, తమ చమత్కారం చూపి డబ్బు సంపాదించవచ్చు. జపాన్, చైనా, మొదలగు దేశాలల్లో ఇట్టి కుటీర పరిశ్రమలవలననే ఆదేశాలవారు అంత ముందంజవేయగలిగిరి. గ్రామాదులల్లోని కుటీరపరిశ్రమలలో మరొక విశేష మున్నది. భారీ పరిశ్రమలకు మూలములై వున్నవి. ఈ కుటీరపరిశ్రమలద్వారా, పరిశీలన చక్కగా జరగగలదు. ఆవల నిపుణత్వముతో భారీపరిశ్రమలు నెలకొల్పవచ్చు. మరికొన్ని కుటీరపరిశ్రమలు గ్రామాదులలో వృథాపోయే ముడిపదార్థముల వుపయోగపర్చిన వౌతవి.

గ్రామాదుల్లో పందుల పెంపకం అతి సులువుగా చేయవచ్చు. నాటుపందులతో సీమపందుల కలియకపర్చి మంచిజాతిరకాలు తయారుచేయవచ్చు. అశుద్ధం తినకుండా ఒక జాగాలో పందుల నుంచి తిండిపెట్టి పెంచిన ఈ రోజులల్లో మంచి ధరకు అమ్మవచ్చు. నాటుపంది 1½ సం. యెంతగా పెంచినా ఐదుమణుగులకన్నా పెరగవు. సీమపందులలో "బర్క్‌షైర్" పందులు 9 మాసాలల్లోనే అంత బరువగును. సీమపందులు, నాటుపందులకన్నా మేలుధరకు అమ్మవచ్చు. కాన, గ్రామాదుల్లో నాటుపందులను క్రమంగా సీమపందులతో కలియికచేసి మంచి రీతిగా పెంచిన లాభదాయకం. ఇల్లాగే కోళ్ళపెంపకం. నాటుకోళ్ళు 30 లేక 40 గ్రుడ్లు పెట్టేవి బలే జాతి అంటాము. కాని సీమకోళ్ళు సంవత్సరం పొడుగునా గ్రుడ్లుపెట్టును. నాటుకోళ్ళు మంచి తిండిపెట్టి జాతిపుంజులతో ఐక్యపర్చిన మంచి రకాలు వచ్చును. జాతిపుంజులు ఆరు మొదలు యేడుసేర్ల బరువు వుండును. అల్లాగే నాటుకోడి గ్రుడ్లకన్నా, జాతికోడిగ్రుడ్లు బరువుగాను పెద్దవిగాను వుండును. సీమకోళ్ళలో, లెగ్‌హారన్, మైనార్కాలు, రోడ్ ఐలెండ్ రెడ్లు, ఆర్పింగ్టన్లు మొదలగునవి మనం పెంచుట లాభం. వాటిలో మనకోళ్ళు సరియైనరీతిగా పెంచి యెక్కువ శ్రమ పెట్టుబడి లేకనే లాభం పొందవచ్చు. తీరికున్న కాలంలో వాటిపై కొంచెం శ్రద్ధపెట్టిన చాలు.

ఇక పశువులపెంపకంలో వేరే చెప్పనక్కరలేదు. ప్రపంచంలోవున్న ప్రతిదేశం కన్నా మన హిందూదేశంలోనే పశుసంపద జాస్తి, అయినా ప్రజలకు లాభం కొద్ది. ముసలి, గొడ్డుపోయిన పశువులను మనవారు సంవత్సరాల కొలది అదొక భక్తితో, సరియైన పోషణ లేకపోయినా, వుంచుకొని లాభదాయకమగు మిగిలిన పశువులనూ పాడుచేయుచున్నారు. అట్టి ముసలి ముతకపశువును వెంటనే చంపి, వాటి తోలు, యెముకలు, కొమ్ములతో వివిధ పనులు చేయవచ్చు. ఆవు, గేదె, మేకలు మంచిరకాలు పెంచాలి. వాటికి పశుశాస్త్రవేత్తల సహాయంతో ఆరోగ్యంగా మన గ్రామాదులవారు వుంచుట లేదు: ప్రభుత్వపు పశువైద్యుల సలహా మనవారికెక్కక, మన పశుసంపద అడుగంటుచున్నది. ఇప్పటి ప్రభుత్వపు యేర్పాట్లప్రకారం, గ్రామాదులవారేగాక పట్టణవాసులు సహా విరివైనపాలు, మంచిరకాల పశుసంపద పొందవచ్చు. ముర్రా, సింధి, ఒంగోలు, మైసూరు, రకాలు మన నాటు జాతితో సంపర్కంచేసి బలమైన, మంచి విరివైన పాలు, వ్యవసాయలాభంపొందవచ్చు. వ్యవసాయకులకు పశుసంపద అతిముఖ్యం. గ్రామాదులల్లో యెరువుకు అతిముఖ్యం. మరి పచ్చికబయళ్ళు విరివిగా వున్న గ్రామాదులల్లో విస్తార పశువుల పెంచి, యెరువు, పాలు, వ్యవసాయంచేయ బలమైన పశువుల పొందవచ్చు. హిందూదేశానికి పాలు ముఖ్య అవసరం. ప్రతివారు దినమునకు 8 ఔన్సుల పాలుత్రాగిన ఆరోగ్యం బాగా కాపాడుకొనవచ్చునని ఆహార శాస్త్రవేత్త "మెక్కారిసన్" చెప్పుచున్నాడు. ఆవుపాలు రెండుగంటలకు జీర్ణమయితే మేకపాలు 50 నిమిషాలల్లో జీర్ణమైపోవును. ఆవు, మేక, తల్లి పాలల్లో, పంద్రెండువిధములైన లోహ, లవణ పదార్థము లున్నవి. మేకపాలు అన్నింటా శ్రేష్ఠం. దీని భావం మహాత్మాగాంధి బాగా తెలిసి ఆ పాలనే వుపయోగించిరి. మంచిరకముల మేకలు మనవార్లు శుభంగా పెంచి విస్తార పాలు, వాటి మాంసంవలని లాభం పొందవచ్చు. మేకలు, గొర్రెలువాటి బొచ్చువలన చాలాలాభం.

ఇంతియే గాక, తేనెటీగలు, పట్టుపురుగులు పెంచి, సులభమైనమార్గాలల్లో విరివైన లాభం

(18 వ పేజీ చూడుడు)

పాకిస్థాన్ జనన వృత్తాంతం

(9 వ పేజి తరవాయి)

5

భారతదేశ స్వాతంత్ర్యముకొరకు ఎంతో త్యాగము చేసి, ఎన్నో బాధలనుభవించిన కాంగ్రెసు దేశభక్తులకు విశ్రమ ప్రభుత్వము లోపల ఉండి ముస్లింలీగర్లు చేసే ఆకతాయితనము, రాజకీయచర్యలు ఏమీ అర్థము కాలేదు. దానితో వారికి పరమాసహ్యము, విసుగూ కలిగినవి. ముస్లిం అధికసంఖ్య, హిందూ అధికసంఖ్య ఉన్న ప్రాంతములుగా దేశమును విభజించుట ఒక్కటే ఈ ప్రతిబంధకముల కన్నిటికీ నివారణోపాయమని వారు చివరకు తలపోయవలసి వచ్చినదంటే ఇక ఆశ్చర్యమేమున్నది? ఇది పైగా అహింసాయుతముగా కూడ సాధింపవచ్చును. కాని దేశవిభజనకు ఇదివరలో రాజాజీ ప్రతిపాదించిన ప్రణాళిక ఒక్కటే తమకు శరణ్యమని కూడ వారు బాగుగా గ్రహించిరి. ఈ ప్రణాళికను 1944 లో సాక్షాత్తు గాంధీజీయే జిన్నాకు మొత్తం 19 సార్లు ప్రతిపాదించెను. కాని ప్రతిసారి ఆ మహానుభావుడు దానిని తిరస్కరించెను. కాని ఇప్పుడు జిన్నా స్వభావము మారినది. అతనికి ఎంతవచ్చిన అంతియే చాలును. అతనికి విభజనవలన వచ్చిన నష్టమేమీ లేదు. ఎంత కొంచెము వచ్చిననూ లాభమే. కనుకనే కుంచుకొనిపోయిన, విరిగిన, పురుగుల్లుపట్టిన పాకిస్థాన్ కైనా సరే నని అత డంగీకరించి తన మొండి పట్టుదలను సాధించెను.

విభజన జరిగి సంవత్సరముపైగా గడిచినది. ముస్లిం లీగ్ గాని, కాంగ్రెసుకాని విభజన వలన ముంచుకురాగల ఫలితములనుగూర్చి గాఢముగా అలోచింపలేదు. కాంగ్రెసు ఇంతవరకు ఏదిచేసినా, దేని కంగీకరించినా అన్నియు మహోన్నతాశయములతోడను, దేశభక్తి, సేవయే ప్రధానముగను చేసినది. కాని ముస్లింలీగ్ అట్లు కాదు. ఏళ్లతరబడి వారు గొంతెత్తి హింసావిద్వేష గీతమునే ఆలపించిరి. ఇండియాలో రెండు జాతులున్నవనే తప్పుడు సిద్ధాంతమును, మతప్రాతిపదిక సాధాతము చేసికొని దేశములో ప్రచారముచేసిరి. వారు లేపిన తుపాను ఫలితములు వారికి ముందుగనే తెలిసియుండవలెను. పగలు తరువాత రాత్రి వచ్చితీరునట్లు తమ దుష్ప్రచార ఫలితముగా, దేశమంతటా ప్రతిహింసాగ్ని, మతకర్షణక్షోభము చెలరేగునని వారు ఎప్పుడో గ్రహించియుందురు. అట్లగుట, వారిది క్షమింపరాని చర్య. లాహోరునుండి వెలువడే ఇంగ్లీషు దినపత్రిక 'పాకిస్థాన్ టైమ్సు'లో ఇటీవల పశ్చిమపంజాబు ప్రధాని ప్రకటన ఒకటి ప్రచురితమైనది. పంజాబు ముస్లిం ప్రజలలో నైతిక అధఃపతనము సంభవించినందుకు విచారించుచు, పశ్చిమపంజాబును హిందూ సిక్కు ప్రజలు వదలి పారిపోయిన తరువాత, అక్కడ మద్యపానము మూడింతలుగా పెరిగిన దని అతడు వెల్లడించెను.

6

లాహోరులోని క్రైస్తవబిషప్ లండన్ టైమ్సుకు ఒక వ్యాసమును వ్రాయుచు ఇట్లు ఉల్లేఖించెను. పశ్చిమపంజాబు గ్రామములలో నివసించు భారతీయ క్రైస్తవులనుగూర్చి వ్రాయుచు, అత డిట్లా అన్నాడు :

"ఈ క్రైస్తవ గ్రామీణులు ఇదివరకు హిందూ, సిక్కు జమీందారులక్రింద రైతులుగా, కూలీలుగా పనిచేయుచుండెడివారు. ఆ జమీందారు లిప్పుడు ఇండియాకు వలస వెళ్లిపోయిరి. వారి భూములన్నియు తూర్పు పంజాబునుండి వచ్చిన ముస్లింరక్షణార్థులకు, చిన్నచిన్న వాటాలుగా ఇవ్వబడినవి. ఈ క్రొత్త ఆసాములు తమ కున్నవన్నీ చిన్నచిన్న భూములగుటచే కూలీ ఖర్చులను భరించలేరు. ఈ విధముగా క్రైస్తవులు తిండికి దూరమై పోయిరి."

ఇది యథార్థ విషయము కనుక దీనిపై వ్యాఖ్యానింపవలసిన పని లేదు.

ఇక ఆర్థిక పరిస్థితులనుండి రాజకీయ స్థితిగతుల వంక తిరిగినచో, లండను పత్రిక 'న్యూ స్టేట్స్‌మన్' ఇటీవల ఒక సంపాదకీయములో "రెండు అధినివేశములకు యుద్ధమా?" అను శీర్షికక్రింద ఇట్లు వ్రాసినది.

"కాశ్మీరు వ్యవహారములో పాకిస్థాన్ కలుగజేసికొనే జోక్యము చూడగా పాకిస్థాన్ అక్రమచర్య చేయుచున్నట్లగపడుచున్నది. దాడిమూకలతో తనకు సంబంధము లేదని ఒక వంక తప్పుకొనుచు, మరొకవంక వారికి పూర్తి సహాయము నిచ్చుచున్నది. తన సైన్యమునుకూడ కాశ్మీరుకు పంపుచున్నది. జన వాక్య నిర్ధారణను, దాని ఫలితములను సందేహించుచు, బలాత్కారముగా కాశ్మీరీలను లొంగదీయ జూచుచున్నది. పరిస్థితులు విషమించి, ఉభయ అధినివేశములకు యుద్ధమే బ్రద్దలయినచో బ్రిటిష్ ప్రభుత్వము పాకిస్థాన్‌నే కామన్వెల్తునుండి బహిష్కరింపవలసియుండును."

దీనిపై గూడ వ్యాఖ్యాన మక్కరలేదు. ఇది జగద్విదితమైన యథార్థము.

ఇంతటితో ఈ విలాపము, ఈ విషాదము చాలును. లార్డు ఇస్మే తన ప్రసంగములో చిట్టచివరకు చెప్పిన ఒక అద్భుత సంఘటనను వినుడు :

"ఢిల్లీలో ఒక రోజున నా భవనప్రాంగణమున ఒక వృద్ధుడు గుడ్డపేలికలు చుట్టుకొని నిలబడియుండెను. నా కతడు నమస్కరించెను. నా కతనిలో విశేషమేమీ కాన్పింపలేదు. నేను తిరిగి నమస్కరించి కారులో ఎక్కబోవుచుంటిని. ఇంతలో అతడు కన్నీళ్లుకార్చుచు ఇట్లనెను :

"'సాహెబ్! నన్ను మీ రెరగరు. నాపేరు ఆలీషేర్.' అతనిపేరు నిజముగా ఆలీషేర్. నేను కారు దిగి, అతనిని ఇంటిలోనికి తోడ్కొనిపోయి ఏమి జరిగిన దని ప్రశ్నించితిని.

"'నన్ను దుండగీండ్రు ముట్టడించిరి. మమ్ము విపరీతముగా బాధించిరి. నా కుటుంబమును నిర్మూలముచేసిరి. నా పిల్లలను నరికివేసిరి. నా ఆస్తినంతను దోచుకొనిరి. నేను భాగ్యవంతుడను.' అని అత డనెను. ఆలీషేర్ భారత సైన్యములో రైసల్దార్ మేజర్. అతడు గత యుద్ధములో ఫ్రాన్సులో గౌరవపతకములు పొందెను.

"ఒక వారము రోజులతర్వాత ఒక పెద్ద సిక్కు వ్యక్తి సైనిక దుస్తులలో నా కడకు వచ్చెను. నేనతనిని చూచి అభినందించితిని. అతడు నా పటాలములో ఆలీషేర్‌కు బదులు రైసల్దార్ మేజర్‌గా నియమింపబడెను. 'ఎట్లున్నది జీవిత' మని నే నడిగితిని. 'అంత బాగుగా లేదు. నాకు నాలు గిళ్లు ఉండెడివి. అన్నియు పోయినవి. నా కుటుంబమున కేమీ ఫర్వాలేదు. కలహములు చెలరేగుచున్నప్పటికి వారంతా ఇండియాకు వచ్చివేసిరి.' అని అత డన్నాడు. 'నాకు చాల విచారముగానున్నది. కాని ఆలీషేర్ దుస్థితికి నీవు లోనుగాలేదు' అని ఆ కథనంతా అతనితో చెప్పితిని. అతడు వెంటనే దుఃఖాశ్రుమగ్నుడై, 'నే నతనికి సాయము చేసెదను. అతడు ముస్లిం కావచ్చును. కాని అతడు నా సోదరుడే. అతనికొరకు నే నేమైనా చేయగలను' అని అన్నాడు."

పై కథను లార్డు ఇస్మే వింతగ నున్నదనీ, ఒక నిగూఢసత్యద్యోతకముగనున్నదనీ అన్నాడు. ఇది నిజమే. కాని అంతేకాదు, ఆ కథ మనకు ధైర్యమును, ఉత్సాహమును, ఆశను, ఆవేశమును పురిగొల్పుచున్నది. ఎందుకనగా, పాకిస్థాన్ జాతిద్వయ సిద్ధాంతము నెంతైనా గొంతెత్తి అరచునుగాక, భారతదేశ హృదయ మెల్లప్పుడు ఒక్కటే. కాలము పరిపక్వమైనప్పుడు, ఇప్పటికి కాకపోయినా ఎప్పుడో మన అదృష్టము ఫలింపవచ్చును. ఒక కవి ఇట్లా అన్నాడు :

> "అతడు వర్తుల మొక్కటిగీసి
> నన్ను వెలినెట్టినాడు :
> విశ్వాసహీను డతడు
> ద్రోహి, ద్వేషార్హు డతడు :
> కాని ప్రేమబలమున కడకు
> నే నతని నిర్జించినాను.
> వర్తులము మరొక్కదాని గీసి
> అతని, నతని వృత్తమ్ముగూడ
> నేను లోగొంటి."

పరమానందాయ్

(7-వ పేజీ తరువాయి)

బ్రెష్నిడర్ ఠక్కున నిలబడి, తీవ్రంగా పరమాయిని చూస్తూ, "ఇంతకన్నా నువ్వు ఏమీ చెప్పనూ అక్కరలేదు. ఇల్లా కాస్త ఈ పక్కకు వచ్చావంటే, నేను నీకు చెప్పాల్సినది కొంతఉంది. ఇల్లారా!" అంటూ పరమాయిని పక్కనున్న వరండాలోకి తీసికెళ్లాడు.

బ్రెష్నిడర్ "నిన్ను పోలీసుస్టేషనుకు తీసుకెళ్తున్నా"నని చెప్పగానే, పరమాయి చాలా ఆశ్చర్యపడ్డాడు. బ్రెష్నిడర్ పొరపాటు పడుతున్నాడనీ, తను ఎవర్నీ నొప్పించేమాట ఏదీ అనలేదనీ, తను ఏపాపమూ ఎరగడనీ; పరమాయి బ్రెష్నిడర్‌కు నచ్చజెప్పచూశాడు.

కాని బ్రెష్నిడర్ పరమాయితో, సాక్షాత్తూ తను చూస్తుండగానే పరమాయి అప్పటికప్పుడే అనేక నేరాలు చేశాడనీ, ముఖ్యంగా రాజద్రోహ నేరంకూడాచేస్తూ మాట్లాడాడనీ, అందుకని అరెస్టు చేస్తున్నాననీ చెప్పాడు.

ఇద్దరూ మళ్లీ పానశాలలోకి వచ్చారు. పరమాయి పావిలెక్‌తో—

"పావిలెక్! నే నింతవరకూ ఐదు గ్లాసులు సారా, ఒక బ్రాందీ సోడా, ఒక రొట్టె తీసుకొన్నాను. ఒకగ్లాసు షెర్రీ షాంపేన్ కూడా త్వరగా ఇచ్చెయి—పోవాలి. నన్ను అరెస్టు చేశారట" అన్నాడు.

బ్రెష్నిడర్ తన సి. ఐ.డి. బాడ్జి పావిలెక్‌కు చూపించాడు. చూపించి ఒక క్షణం, అతని మొగంవంక పరకాయించిచూసి, పావిలెక్‌ను—

"నీకు పెళ్లి అయిందా" అని అడిగాడు.

"ఆఁ"

"నీపెళ్లాం ఈ వ్యాపారం చెయ్యగలదా ?"

"ఆ!"

"అయితే సరే, మీ ఆవిడను ఇల్లాపిల్చి, వ్యాపారం ఆవిడకి అప్పచెప్పి తయారుగా ఉండు. ఇప్పుడే మళ్లీ వచ్చి నిన్ను అరెస్టుచేసి తీసికెళ్తాను."

పరమాయి పావిలెక్ వంక తిరిగాడు.

"నువ్వు ఏం కంగారుపడకోయ్! నన్ను ఇప్పుడు అరెస్టుచేసిందీ రాజద్రోహం నేరంక్రింద నేట" అంటూ ఉపశమనవాక్యాలు చెప్పి సముదాయించాడు.

పావిలెక్ "నా విషయంలో ఇదేమిటి! నేను నోరు మెదపకుండా ఇంత జాగ్రత్తపడ్డానే!" అంటూ అంగలార్చాడు.

బ్రెష్నిడర్ విజయసూచకంగా ఇకిలించి మీసం దువ్వాడు.

"చక్రవర్తి మొగంమీదంతా ఈగలు ఖరాబ్ చేశాయి అన్నావుకాదూ? చిక్కావులే! తలలో జేజెమ్మ వదలకొట్టాను ఆగూ!" అని ఉరిమాడు. పరమాయిని వెంటబెట్టుకొని బ్రెష్నిడర్ పోలీసుస్టేషనుకు బయలుదేరాడు.

ఆ విధంగా, సుభటాగ్రేసరుడైన ష్వేక్— మన పరమానందాయి—తన సహజసౌమ్యధోరణిలో, (ప్రథమ) ప్రపంచసంగ్రామంలో ప్రవేశం గల్పించుకొన్నాడు. పరమాయి యుద్ధం విషయంలో బహుమారదృష్టి ఉపయోగించా డని చరిత్రకారులు ఒప్పుకోకతప్పదు. పరిస్థితులు సరీగ్గా అతన చెప్పినట్టుగా పర్యవసానము చెందలేదంటే—అతనికి రాజకీయ చాణక్యనీతిలో ప్రవేశం తక్కువ అనుకోవాలి తప్ప, తదితరము ఏమీకాదు.

లేఖ

ఆంధ్రుల కొక మనవి

పూర్వ సాంప్రదాయాను సారమునన్నూ, పురాణ, ఇతిహాసములవలనన్నూ మనకు ప్రాప్తించిన శుభాశుభములను తులుగు తిథుల యందు పండుగ రూపమున ఏవరి శక్తికొలది వారు చేసుకొనుచున్నారు. శ్రీరామనవమి, వినాయకచవితి, దుర్గాష్టమి, నరకచతుర్దశి మొదలగు పండుగలు పైవిధముగ చేసుకొనుచున్నాము. ఇది పూర్వకాలమునుండి వచ్చుచున్న సంగతి. ఇది అందరకు తెలిసియే యున్నది.

ప్రస్తుత కాలమున హూణ సాంప్రదాయము పనులయందు, మాటలయందు, వేషమునందు ఎంత వంటపట్టిననూ శుభాశుభములకు పంచాంగం తిరుగవేయుచున్నారు. చిన్నపిల్లలకు పుట్టినరోజు పండుగ పుట్టిన తిథియందేగాని ఇంగ్లీషుతేదీయందు చేసుకొనుట లేదు. అన్నప్రాశన, అక్షరాభ్యాసము, ఒడుగు, పెండ్లి వగైరాలు తెలుగు తిలథుయందు ముహూర్తము పెట్టుకొని ఆచరించుచుంటిమేగాని తదన్యములు మనము వుపయోగించుటలేదు. మన పెద్దలకు తిథులు పెట్టుకొనునపుడుపోయిన తిథియేగాని ఇంగ్లీషు తేదీలు వుపయోగించుట లేదు. కాని ప్రస్తుతమున మన ఆంధ్రనాయకుల జన్మదినోత్సవములు ఇంగ్లీషుతేదీలయందేగాని తులుగుతిథుల యందు జరుపుటలేదు. ఇది చాలా విచారకరమైన విషయము. స్వరాజ్య సంపాదనా నిమగ్నులయి యుండుటచేత ఈ విషయము మరచిరేమో తెలియదు.

కావున మన మందరము కూడి వెనుదిరిగి ఆంధ్రసాంప్రదాయ చిహ్నముల పరికించి ఆ ప్రకారము వ్యవహరించుటకు ప్రయత్నించవలెను.

నువ్వుకు నూరు తెగుళ్లు అన్నట్లు, నూరు కాదు నూటఎనిమిది తెగుళ్ల తప్పించుకొని స్వరాజ్యము అనే నువ్వుకాయను పండించుకొనగల్గితిమి. అట్టిది మనకు ప్రాప్తించిన తిథి సర్వజిత్ నిజశ్రావణ బహుళ౧౪ అయివున్నది. కావున మనము ఆ తిథియందే స్వాతంత్ర్యోత్సవము జరుపుకొనుట ఉచితము. కాబట్టి ప్రతి శ్రావణ బహుళ౧౪ శ్రీ భారతదేశస్వాతంత్ర్య దినోత్సవము జరుపుకొనవలయును. హూణులు ఉత్తరపడవ ఎక్కినతరువాత మన సాంప్రదాయము మనకు వంటబట్టువరకూ ఇంగ్లీషు తేదీలు వాడుకున్నప్పటికీ ప్రాముఖ్యము కలిగినట్టిన్నీ, తరతరములు కాదు, యుగయుగములు చెప్పుకొనునట్టి చేసుకొనునట్టి స్వాతంత్ర్యోత్సవము తెలుగు తిథియందే చేసుకొనవలయును. పంచాంగ కర్తలకుకూడ ఈ విషయమును మరువదగినదికాదు. ఇకనుండి మన ఆంధ్రనాయకుల జన్మదినోత్సవములు వారి తెనుగు తిథియందే చేసుకొనుట ఉచితము. ఈ విషయమును మీటింగుల యందు తీర్మానించ అవసరము లేదు. కావున ఆంధ్ర పెద్ద లందరు ఈ విషయమును అభిమానించి ఆ చరణలో పెట్టెద రని నమ్ముచున్నాను.

కా. వీరేశ్వరుడు

పూర్వకవులు :

అద్దంకి గంగాధరకవి కవితాలహరి

శ్రీ కోన వేంకటరాయశర్మ

కీర్తివిస్తార ధురంధరుండగు శ్రీ కృష్ణదేవరాయ నరపాలాఖండలుని సామంతప్రభువగు 'కుతుబ్ శాహి' యను బహమనీ సులతానుడు శ్రీ కృష్ణదేవరాయలు చనిపోయిన తర్వాత స్వాతంత్ర్యమును బ్రకటించి 'గోలకొండ' నగరమును రాజధానిగా జేసికొని పరిపాలించినాడు. ఇతడు కటకేశ్వరుని బాఱద్రోలి 'కొండపల్లి'ని, జయించి, తన మూడవ కొమారుడగు 'మల్కిభరాము'ని రాజప్రతినిధి (Governor-general)గా నచ్చట నియోగించి, యరివీరభయంకరుండయి 'విజేత' యని యనిపించికొనియెను. కావుననే యద్దంకి గంగాధరకవి 'కుతుబ్ శాహీ'ని—

"కటకేశ్వరుని దోలి కైవసంబుగ జేసె
గొండంత జయముతో గొండపల్లి
గంపమందలితాఖానుండు గౌతమీ
తటిని లంఘించిపో బుటముపెట్టె
బైడవిరాహచ ప్రాంగణక్షోణిలో
వీగదోలి బరీదు వెన్కు జూచె
సాగరగౌతమీసంగరసలమున
నడిదంబు గడిపె ప్రఖ్యాతి గాగ
సప్తదిగ్రాజులను దన కరియు గోరు
వెట్టికాపుల జేసి మువ్వెట్టి గొనియె
...నితరతలాధీశు లెవ్వ రీడు
పృథివి గుదుప నమలుక చక్రేశ్వరునకు."

అని ప్రశంసించెను. 'కుతుబ్ శాహీ'కి హైదరఖాన్, జాంషీదు, మల్కిభరామ్—అను మూవురు కొమాళ్లు. ఇందు గనిష్ఠుడగు 'మల్కిభరాము'నే 'ఇబ్రహీమ్' అనియెదరు. 'కుతుబ్ శాహి' చనిపోయిన తర్వాత నాతని ద్వితీయ పుత్త్రుడు 'జాంషీద్' అనువాడు పరిపాలనమునకు వచ్చి క్రీ. శ. 1543 వ సంవత్సరము నుండి క్రీ. శ. 1550 దవ సంవత్సరమువఱకు నేడేదులు పరిపాలించెను. ఇతడు మహాక్రూరుడు. రాజ్యతృష్ణయె పరమావధిగా బెట్టికొని తన యన్నయగు 'హైదరఖాన్' నేత్రముల నూడబెఱికించి తన తమ్ముండగు 'మల్కిభరాము'ని దన రాష్ట్రమునుండి పాఱద్రోలి హిందువుల ననేకవిధముల బాధించిన ప్రబుద్ధుడు. ఇతని బాఱినుండి మల్కిభరాముడు తప్పించుకొని విజయనగరసామ్రాజ్యమునకుం జని శ్రీ కృష్ణదేవరాయల యల్లుడగు నళియరామరాయల యౌదార్యము ననుసరించి యచ్చట దలదాచికొన్నవాడయి దురాత్ముడగు 'జాంషీద్' చనిపోయిన తర్వాత 'గోలకొండ' రాజ్యము నాక్రమించి కైవసమొనర్చికొనియెను.

విజయనగరములో మల్కిభరాము డుండునప్పు డాంధ్రభాషాప్రాశస్త్యము, సొంపు, తియందనముల గ్వాచిత్కముగ జవి జూచినవాడగుటచే 'గోలకొండ' నగరమున కేగుచు ద్రోవలో నున్న 'యద్దంకి' గ్రామమున విడిసి యా గ్రామవాస్తవ్యుడగు గంగాధర కవిశేఖరుని కవితాలహరి నవలోకించి, తత్సౌరభము నాఘ్రాణించి, తత్రాపి యాతని యశఃకీర్తుల నాలకించి తృప్తిపడి యాతని బిలువంబనిచి తన యాస్థాన కవితల్లజునిగా నియమించికొని 'గోలకొండ' పట్టణమునకు గొంపోయెను.

అక్కవితాకళానిధియు 'మల్కిభరాము' వెంట జనినను అచ్చటనే యుండక స్వస్థలమున నే 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' యన్న పడువున నుండుచు, నప్పుడప్పుడు 'గోలకొండ'కు జనుచుండినట్లు లగపడుచున్నది. 'గోలకొండ'లో నుండినప్పుడు మల్కిభరాముని దత్రత్యులచే దన కవితా ప్రాగల్భ్యమున మెప్పందికొనుచు బహూకృతుల గౌరవ సత్కారముల బడయుచు 'దపతీసంవరణోపాఖ్యానము'ను రచించి తన యేలికయగు మల్కిభరామునకు గృతియొసంగెను.

"ఘోరన యాచకప్రతతి
భూరివిపద్దశ నొందుచుండగా
...నారయ శాలివాహనశ
కాబ్దము లద్రియుగాబ్ధిసోములం
దారణవత్సరంబున ని
దాఘదినంబున జ్యేష్ఠ శుద్ధ ష
ష్ఠీరవివాసరంబున నృ
సింహుని కృష్ణుడు సేరె స్వర్గము
ద్వారక నున్న కృష్ణు డవ
తారసమాప్తము నొందు కైవడిన్."

అను పెద్దనామాత్యుని చాటూక్తి ననుసరించి శా. శ. 1447 తారణ సంవత్సర జ్యేష్ఠ శు 6 రవి వాసరమున జనిపోయెనని తెలియ నగుచున్న శ్రీకృష్ణదేవరాయల సమకాలీనుడగు 'కుతుబ్ శాహి' యను సామంతప్రభువు పొందిన విజయ పరంపరల గుఱించి గంగాధర కవి—

"పటమటను సవాయి బసవనిగా జేసి
యచట గొయ్యలకొండ నాకరింప
దమది మల్లాఖాను దక్షిణంబున్పొట్టి
హరియించె బానుగల్లాదిగిరుల
నుత్తరంబున బరీ దోడి పాఱగదోలి
మెతుకుదుర్గం బాక్రమించి మించె
బ్రథమ దిక్కున నొడ్డి పాత్రసామంతుల
ధట్టించి కంబమువెట్టు గొనిరొ
నతని బొగడంగ దగదె యా చతురశీతి
రూఢి గిరిదుర్గలుంతన ప్రౌఢతేజు
వాహశిఖరాధిరోహ రేవంతమూర్తి
కుతుబుశాహిని క్ష్మాపాలు గుణవిశాలు."

అని పేర్కొని యతని విక్రమాటోపమును గన్నులకు గట్టినట్లు లొనర్చెను. కావుననే రాయసము వేంకటపతి తన 'లక్ష్మీవిలాసము'న "అలఘుప్రాభవభవ్యుడౌ కుతుబశాహి" అని యుగ్గడించి యట్టి ప్రచండు నియమేయ సైన్యంబు "నగ్గలికన్బాహులచేత గెల్చి బిరుదులైకొన్న శ్రీరంగరాయల చిత్తం బిగురింప రాయసము వ్రాయంజాలితి" నని వాకొనియెను. కాని కృష్ణదేవరాయని సామంతప్రభువులలో నొకరుండయిన నందేల నారపరాజీ 'కుతుబసాహి'ని గొండవీటి యొద్ద నోడించినట్లు తీక్రింది 'కళాపూర్ణోదయ' మందలి—

"వదలక యుత్కలేంద్రుని స
వాయి బరీదు నడంచు దుర్జయా
గ్గ...దుపన మల్క దల్లడిల
గొట్టె మహాద్భుతసంగరంబులో
నెదిరిచి కొండవీటికడ
నెవ్వరు సాటి విచిత్రశౌర్యసం
పద పస నారసింహవిభు
పట్టికి నారనృపాలమౌళికిన్,"

అను పద్య మవగత మొనర్చుచున్నది. ఈ 'కుతుబ్ సాహి' క్రీ. శ. 1512 వ సంవత్సరము మొదలు క్రీ. శ. 1543 వ సంవత్సరమువఱకు బరిపాలించినవాడు. ఇతని యనంతరము 'జాంషీద్' అనువాడు క్రీ. శ. 1543 వ సంవత్సరమునుండి క్రీ. శ. 1549 వ సంవత్సరము వఱకును బరిపాలింపగా బిమ్మట మల్కిభరాముడు క్రీ. శ. 1550 దవ సంవత్సరమున రాజ్యముసేయ నారంభించెను.

కాబట్టి గంగాధరకవి క్రీ. శ. 1518-20 దవ సంవత్సరములమధ్య జన్మించి క్రీ. శ. 1570-75 సంవత్సరముల వఱకు ననగా నేబదిరెండేడుల కధికముగ జీవించియుండెనని చెప్పవచ్చును. ఇతడు మల్కిభరాము నాస్థానకవియై యాతని కోర్కి ననుసరించి భారతము నాదిపర్వము నేడవ యాశ్వాసమున నంగారపర్ణు డర్జునునితో దపతీ సంవరణుల గుఱించి చెప్పినకథను గైకొని ప్రబంధరచనాబంధురుండయ్యెను.

సంవరణు డను ధరారమణుం డుద్యానవనంబున నొకక్రొమ్మావిక్రీనీడ జంద్రకాంత శిలావేదకపై నాసీనుండయి పరివారజనమ్ముల సేవల గైకొనుచుండు నంతలో నొక శారికాకీరమంతరిక్షమునుండి తీవ్వన రాటశేఖరునిమ్రోల వ్రాలి తపతి కన్నియ రూప, భావ, గుణవిశేషంబుల నభివర్ణింప న ధరారమణుండు మోహితుండయియుండుట నెఱింగి "తపతి నీ కిల్లాలగునట్లు లే నొనర్తు; నట్టి విన్నాణంబు నాకు గల" దని చెప్పి తీవ్వన నాకాశపథంబున కేగి, తపతి యొద్దకుం జని సంవరణుని రూప, యౌవన, సౌభాగ్యంబుల దనివార నభివర్ణించి యాతనిపై నగ్గలమగు ప్రేమ యుదయించునట్లు లొనర్చు, నా రాజమూడామణి తపతీ కరగ్రహణమునకయి జగచ్చక్షువగు నాదిత్యు నుపాసించి యాతనిచే బాస చేయించుకొనియె గాని కుసుమాస్త్రుండు నిశితబాణప్రసారంబున గాయము గాయముల జేయుచుండ జేయునది లేక నొంటియై యంతఃపురదృశ్యంబుల విలోకించుచుండెను.

సంవరణ భూనేతను జిత్రాతిచిత్రముగ వివిధ రీతుల గీర మభివర్ణించినది మొదలు తపతి మనంబాతనిపై లగ్నం బొనర్చి తహతహ జెందుచు మర్త్యలోకావలోకనవ్యాజమున జెలికత్తియలతో బర్యటన మొనర్చుచుండగా, దైవయోగంబున నొక వనంబున దపతీ సంవరణులు గూడుటయు, సంవరణుడు—

"కనియె నొక కన్య గోమల
కనకప్రభ నిజశరీరకాంతిమపాంతం
బున వృక్షలతావళి గాం
చనమయము జేయుచున్న చంద్రనిభాస్యన్."

విలోకించి యొక్కింతసేపు నిమీలితనేత్రుండయి మనంబున—

"నెఱిగురులు న్విలోలసిత
నేత్రయుగంబును నొప్పులొల్క వా
తెఱయును దీని యాననము
దెల్పు గరంబు మనోహరంబు నా
యెఱిగిన యంతనుండి సతి
నిట్టి లతాలలితాంగి జూచి యే
నెఱుగ సురేంద్రకన్యకలు
నిట్టిరె రూపవిలాససంపదన్."

అని వితర్కించుచు, గింకర్తవ్యతా విమూఢుండై కామాంధకారంబున గన్నులగపడక పరితపించుచు, జిల్కపల్కుల విస్మరించి, సంవరణుడు దపతిని "వివాహము నేసికొనవలసిన"దని వేడికొనుటయు, నత్తరుణియ "నే నస్వతంత్రను. నా తండ్రి లోకసాక్షి. ఆతని నుపాసించి యతనిం బ్రార్థించిన నన్ను నీ కిచ్చు"నని చెప్పి తపతి తన దారి బట్టుటయు, సంవరణుడు ద్విగుణీకృత మన్మథ మన్మథుండయి భాస్కరు నారాధించి, సేవించి ప్రార్థించి, వసిష్ఠమహర్షి ద్వారమున దపతిని బరిణయం బొనర్చికొనుటయు, సాదిగా గల కథావిభాగమును బ్రబంధముగా నొనర్చి గంగాధరకవి కవులలో మేల్బంతి యని యనిపించుకొనినాడు.

ఈ ప్రబంధరచనాబంధురత్వమున శ్రీ వాక్కవి సార్వభౌముని నైషధమును మదినెంచియే రచన సాగించినట్లు లీ క్రింది—

"కనుకలి వినుకలి లోపల
వినుకలియే మిగుల మదనవేదన చేయు
న్వినుకలి వలపుల గాదా
ననువుగ మఱి మరులుకొనిరి నలదమయంతుల్"

అను (ప్ర. ఆ. 41 ప.) పద్య మవగత మొనర్చుచున్నది. ఈ ప్రబంధమున శృంగార రసము వెల్లివిరియుచున్నను నడుమనడుమ వ్యంగ్యవర్తనలు అందున నుత్తమ వ్యంగ్య మభివర్ణించుటయు గలదు. ప్రథమాశ్వాసమందలి డెబ్బదియైదవ పద్యమగు—


"ఇల భరియింప నృపాలుడు
దలయెత్తిననాడు మొదలు ధైర్యముతోడం
దలలెత్తిరి ఫణివల్లభ
కులశైల దిగంతదంతి కూర్మ కవీంద్రుల్."

అను పద్య ముత్తమ వ్యంగ్యమును సూచించుచున్నది. ప్రాయికముగా నితడు సంస్కృత పదములనే వాడుటనుబట్టి యీతనికి సంస్కృతమునం దభిమానము మెండనియు, నా సురభావయం దధికముగ బాండితీప్రకర్ష కలవాడనియు దెలియవచ్చుచున్నది. ఇక్కవిశిరోమణి రేఫ, శకటరేఫల మైత్రిని బాటించెనని ప్రథమాశ్వాసమందలి డెబ్బదియవ పద్యమగు "సారవిభూతి రెండవ......మించె గీర్తులన్" అనియు, ద్వితీయాశ్వాసమందలి ముప్పదినాల్గవ పద్యమున "తరుణి ఈ భూంగ రాజ్యము సుత" అనియు బ్రయోగించుటవలన స్పష్టమగుచున్నది. ఛందశ్శాస్త్రానిరిక్తములగు నఖండవళులు, 'ఇ'కార సంధులు ప్రయోగించినాడు. అఖండయతి నీత డెట్లు లుపయోగించెనో (ప్ర. ఆ. 11 ప. 12 ప.) పరికించిన దేటపడగలదు. ద్వితీయాశ్వాసమందలి "అంగన నీకు నీవు మఱి" —అను పద్యము పోతనామాత్యుని "ఆ యెలనా నీకు దగు"—అను పద్యమును,బోలియుండిన దనవచ్చును. ఇతడు క్త్వార్థకేకార సంధులును నకారద్విత్వములును వాడలేదు. పదునాఱవ శతాబ్దమున నిమ్మహామహుని కవితాలహరి అడ్డమాకలు లేక దేశము నాల్గు చెఱగుల బ్రవహించినది.



పరిశ్రమల మంత్రి శ్రీ సీతారామరెడ్డిగారు భీమవరంలో నేషనల్ సిమెంట్ పైపుల ఫాక్టరీకి ప్రారంభోత్సవం జరిపినప్పటి ఫోటో.

సాహిత్యమీమాంస:



కళాపూర్ణోదయము: కావ్యవిమర్శ

శ్రీ వి. రామారావు

ఈయుద్గ్రంథ మొక విచిత్రకథాసంవిలసితమైన ప్రబంధము. "సకల లక్షణ లక్షితంబైన ప్రబంధము కీర్తికారణంబనియు నితరం బపహాసకారణంబనియు" నూహించి, పింగళిసూరనాఖ్య మహా కవిచే యీ ప్రబంధము రచియింపబడెను. కృతికర్తచే పేర్కొనబడినట్లు లిది సర్వలక్షణలక్షితంబైనదే. కతం బేమన— దీనియందు తక్కిన ప్రబంధములందు వలె నాయికా నాయకుల విరహావర్ణనము, విప్రలంభ శృంగారములు వర్ణించుటకే తన సామర్థ్య మంతయు వినియోగింపక కవి తన ప్రతిభను విచిత్ర కథా కల్పన యొనరించి తద్ద్వారా శృంగారరసపరిణామములు గ్రంథమందు చర్చించెను. శృంగార మనునది మానవుల కవసరమే. ధర్మార్థములవలె కామముగూడ పురుషార్థమే. అర్థోపార్జనము పురుషున కవశ్యకరణీయమే. అది లేనిదే జీవితనౌకాయానము దుర్లభము. ధర్మసాధమున కది యుపకరించును. అట్లని అర్థోపార్జన మన్యాయ్య మెటుకాగూడదో యట్లే కావ్యము రూపాశ్రయము గాక గుణభావాశ్రయ మైనచో సుఖకరమని- పింగళి సూరనతనయసమాన ప్రతిభచే తన గ్రంథమందు సమర్థతతో నిరూపించె ననుటకు సందేహము లేదు. అతడెట్లు తన కథాకల్పనయందు శృంగారరసానుభవము ఐహికమందు సుఖదుఃఖకరమని నిరూపించెనో కనుగొందము.

కళాపూర్ణోదయము పూర్వకథ, యుత్తరకథ యని ద్విభాగ మొనరింపవచ్చును. పూర్వకథయందు రూపసమాశ్రయమైన శృంగారసానుభవ మెట్లు తాత్కాలికమై, కష్టపరంపరలకు లోనైనదో యెరుంగవచ్చును. ఉత్తరకథాభాగమందు గుణభావాశ్రయమైన రసానుభావ మెంత సుఖకరమై శాశ్వతానంద ప్రదమైనదో కనుగొనవచ్చును. ఈ కథకు శారదా చతుర్ముఖుల శృంగార లీలావిలాస విశేషములు మూలాధారము. వాటిపైననే నిది యాధారపడియున్నది.

కలభాషిణి వెలయాలిబిడ్డ; నారదుని యనుగ్రహము వడసినది. కృష్ణుని భార్యలయొద్ద సకల రహస్య సంగీత విద్యాసంపన్నత బడసినది. సాహిత్యమందుగూడ కొంత ప్రవేశము గలిగియే విషయమైన నేకసంతన గ్రహింపగలిగిన బుద్ధివిశేషము గలది. మణికంధరుడు నొక గంధర్వుడు. నారదుని ప్రియశిష్యుడు. సహజముగ గానవిద్యాచాతురి గలిగినను నారదుని సహాయమున, కృష్ణుని యనుగ్రహమున సంగీతవిద్యావేత్త యయ్యెను. ఒకప్పుడు వీ రిరువురు రంభానలకూబరులను జూచుట తటస్థించెను. కలభాషిణి నలకూబరుని రూపమును గని మోహించి వానితోడ నెట్లైన సమాగమ మాసించెను. మణికంధరుడుగూడ నట్లే రంబనుజూచి కామమునకు లోనయ్యెను. కాని నారదుని శిష్యుడగుటచేతను, రంభ తనకు లభ్యము గాకపోవుటచేతను నప్పటికి మౌనము వహించెను. కలభాషిణి మణికంధరులకు నొండొరులపై ప్రేమ జనించెను కాని ఇది రంభానలకూబరుల రూపసమ్మోహనచే లోలోన యుడగెను. కామరూపిణి యగుటకు కలభాషిణి నారదునివలన వరము బడసెను. మణికందరుడు గంధర్వు డగుటచే కామరూపి అందువలన కలభాషిణి, రంభరూపముతో నది లేని సమయము కనిపెట్టి నలకూబరునితో ననంగక్రీడల దేలుటకు జూచుచుండెను. మణికందరుడుగూడ నట్లే లేచియుండెను. విధివశమున కలభాషిణీ మణికందరులే రంభానలకూబరులరూపములతో మనసిజక్రీడలం దేలిరి. పిమ్మట వా రిరువురు వియోగము చెంది, నొక యరణ్యములో మృగేంద్రవాహన యను శక్త్యాలయమున మామూలు రూపములతో కలిసిరి.

పూర్వభాగములోనే నింకొక విచిత్రమైన కథ గలదు. శాలీను డొక పల్లెటూరి బ్రాహ్మణుడు. రసికత లేనివాడు. సుగాత్రి బీద బ్రాహ్మణ పడుచు. పతివ్రత, ప్రేమైకనిధానము. సుగాత్రి తన యపూర్వ పాతివ్రత్యముచే పతిని ప్రేమాభిముఖునిగా జేసికొనెను. కాని పతికి భార్యకు గర్భము గాకుండ నుండవలయు ననియు, సతికి శిశుజననమం శచే పుత్రుడు గలుగ వలయు ననియు శారదాదేవి వలన వరములు బడసిరి. శాలీనన కాయుదంతము తెలిసి బావిలో పడెను. సుగాత్రి పత్యనుసారిణియయ్యెను. భగవదనుగ్రహముచే మరల జీవించిరిగాని యొకనొక రెరుగకుండపోయిరి. వారు మరల మృగేంద్రవాహన యను శక్త్యాలయముననే గలిసిరి.

అనగా కలభాషిణీ మణికంధరులు (శాలీనుడు, సుగాత్రి) మణిస్తంభుడు సుఖాసత్తియను పేర్లతో శక్త్యాలయమున గలిసికొని, నొకరి వృత్తాంతమిం కొకరికి తెలిపిరి. ఆశ్చర్య సాగరమున మున్కలిడిరి. అపుడు కలభాషిణి విరక్తిజెంది మణికంధరునిచే శక్తికి బలియయ్యెను. మరల ద్వారకానగరమున నుండెను. మణికంధరుడు రాజగుటకు ఇంకొక జన్మమునందు వరము బడసెను. పూర్వకథ ముగిసినది. కలభాషిణీ మణికంధరుల రూపసమాశ్రయమైన రసానుభవము తాత్కాలిక మైనది. అనేక కష్టపరంపరలకు లోనైన దని నిరూపింపబడినది. బీద బ్రాహ్మణ సంసార మెట్లు నిర్మలమై, రూపసమాశ్రయమును, గుణభావాశ్రయమునుగూడ గాక యెట్లు సాగిపోయిన దోసుగాత్రీ శాలీనుల యుదంతము తెల్పుచున్నది. ఇట్టిది పవిత్రమయ్యు యమాయికమైనది.

ఇక నుత్తరకథాభాగమునకు బోయినచో పూర్వకథయందలి మణికంధరుడే యుత్తరకథయందు నాయకుడు కళాపూర్ణుడు. పూర్వకథయందు సుగాత్రి - శాలీనులకే కళాపూర్ణోదయము గల్గెను. శాలీనుడే గర్భము ధరించెను. చోద్య మందకుడు. అ దెట్లనగా: శాలీనుడు స్త్రీరూపము ధరించుటకు కుతూహలము చెందెను. అందుకు సుగాత్రి సమ్మతించి, తాను పూరుష రూపము ధరించెను. ఆ రూపములతో వారు సుఖానుభవనందగానే శాలీననకే కళాపూర్ణుడు పుట్టెను. అందుచే వారిరువురు శారదాదేవివలన బడసిన పరస్పర విరుద్ధమైన కోరికలు సఫలములయ్యెను. దేవలోకపుచిలుక మదాళయుడు రూపానుభూతియను రాజదంపతులకు మధులాలసగా (కథానాయిక) జన్మించెను. ఇచ్చట కలాపూర్ణుడు మధురలాలసలశృంగార రసానుభవము గుణభావాశ్రయ మైనది. సుఖకర మైనది. శాశ్వతానందప్రదమైనది. జయప్రదమైనది.

ఈ మహాప్రబంధము ఆ మూలాగ్రము జదివినచో గావ్యప్రయోజనమగు రసానందసిద్ధి యగుటకు సందేహము లేదు. పూర్వోత్తర కథా భాగములయందు నాయకు డొకడే యగుటచే పూర్వ భాగమందలి రస మాస్వాదించి, కష్టానుభవ మంది ఉత్తర భాగమందు గుణభావాశ్రయమైన సుఖానందము బడసి కళాపూర్ణోదయు డయ్యెను. ఉత్తర జన్మమం దీత డొక యపూర్వమణిహారముచే సర్వజ్ఞత్వము బడసి పూర్వజన్మ సంస్కారణ గల్గియుండుటచే శృంగారకళాపరిణామములను పూర్తిగా నాస్వాదించుట కవకాశము గలిగినది.

పింగళిసూరన చక్కని కథలరూపమున ఆంధ్ర లోకమున కింత హృద్యమగు ప్రబంధము నందించి ఆంధ్రసాహిత్యాంబరమున యుజ్వలతారగా వెలుగొందుచున్నాడు, అఖండమేధ, కళా వైదగ్ధ్యము, కవితానైపుణ్యము, రసవేదిత్వము నీకవివర్యునందు పెనగొన్నది. ఇతడి శైలి మృదుమధురమై మంజులమై, ఆంధ్ర సంస్కృతభాషాపదములు సమానముగా గల్గియున్నది. భావములు మృదువుగా నుండును. ఈతని కవిత్వ ద్రాక్షాపాకమునుండును. ఇత డొక పద్యములో సుకవిపల్కు లెట్లుండునో కలభాషిణిచే చెప్పించెను.

"చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము
గల్గినను, సౌరభము జలువయు దలిర్పం
బొలుపెసగు కప్పురపు బలుకులకు గోమలత
నెలకొనిన సౌరభము జలువ పసయుం
గోమలతయు గలిగి జనముల చెంపెసగుమలయ
పవనంపుగొదములకు మధురత్వం
బలవడిన నీడు కల దనగవచ్చు గడు వెల
య గల యీ సుకవిపలుకులకు నెంచగా"

చలువ, చెలువము, మాధుర్యము, కోమలత సుకవిపల్కుల కుండునట. నిజముగ నీతనిపలుకు లట్లే యుండుననుటకు సందేహము లేదు. తిక్కన పోతనల తరువాత నీతడే సారస్యమగు కవిత్వము జేయగలవా డని చెప్పవచ్చును.

ఇంతటి ప్రభావము గల్గి, సునిశితమై కవిత్వము జేయగలవాడైనను, కాలప్రభావమునకు దలయొగ్గి తన గ్రంథము శృంగారపరము జేసెను. ఇదే సంకుచితత్వము నా కాలపు కవులెల్ల తమ గ్రంథములందు వెల్లడి జేసిరి. ఈతడు నిర్ఛిద్ర సారస్యయుతమైన నీ గ్రంథము లోకకల్యాణమునకే యొనరించినను, రాజాదరమునకై ప్రాకులాడుటచే శృంగారాస్పదము జేయక తప్పినది గాదు. ఏది యెట్లున్నను భారతీదేవి యురస్థమైన ప్రబంధ సుమహారమునం దీ కళాపూర్ణోదయము పారిజాత ప్రసూనమువలె దివ్యపరిమళము లీనుచు సురుచిరప్రసూనమై వెలయుచుండును.

గ్రామ ఆర్థిక దుస్థితి

(15 వ పేజీ తరువాయి)

పొందగలము. వీటిని పెంచేవిషయంలో ప్రభుత్వం కావలసిన సహాయం చేయుచున్నది. దినానికి అరగంటసేపు వాటివిషయం శ్రద్ధతీసుకొన్న చాలు. ఒక తేనెపట్టు దాదాపు 15 రూ. విలువ గల తేనె నిచ్చును. పట్టుపురుగులు ఇంటి పెరటిలోనే అసలైన పట్టు నిచ్చును.

ఇక ఇతర పరిశ్రమల విషయం అంత విస్తారంగా చెప్పనక్కరలేదు. వడ్రంగం ప్రతి గ్రామానికి ప్రతి ఇంటికి ముఖ్యం. వ్యవసాయ పనిముట్లు, ఇల్లు కట్టుకొనుటకు, మరి ఇతర యే వ్యవహారాలకూ వడ్రంగం కావాలి. దానితో కమ్మరం అంతముఖ్యం. ప్రతిగ్రామాలల్లో ఇనుప పని ముఖ్యావసరంలో ఒకటి. ఇంతియే గాక మన మన గ్రామాదులల్లో ప్రతివారు ఈ రెండు పనులు తప్పక నేర్చియుంచుకోవాలి. నిపుణత్వం చూపు తరుణంవచ్చిన, ఈ పరిశ్రమలకు అప్పుడు ప్రాముఖ్యత గలదు. భారీగా తయారుచేసే ఇనుపకార్ఖానాలపై ఒక్క బాంబు శత్రువు పడవేసిన నాశనమైపోవును. అంతటితో వుల్లిపాయ కోసుకోను కత్తిసహా తయారుచేసుకోలేని స్థితికి వస్తాము. కాని ఇట్టి కుటీరపరిశ్రమలు గ్రామంలో ప్రాకుకొని తనకు తాను, రక్షించుకొనేందుకు కావలసిన కత్తులు, తోటాలు, తుపాకులు, ఇతర అవసరపనిముట్లు చేసుకోగలుగుతాము అట్టి సమయంవచ్చిన. మరిఅన్నిటికన్నా ముఖ్యం వ్యవసాయానికి, ఇండ్లు కట్టుకోను, రాకపోకల సౌకర్యాలు చేసుకొను ఈ రెండు అత్యవసర పరిశ్రమలు.

పిత్తలి, అల్యూమినం, కంచు పోతపనికూడా పైచెప్పిన రకంలో రెండువిధాలగా సహకారం చేయును. ఒకటి వ్యవసాయుకులకు, రెండవది తన రక్షణకు. ఇంకా దంతం, కొమ్ము, తోళ్లు, బుట్టలు, సబ్బులు, మట్టికుండలు, పింగాణీ, బొమ్మలు, పేనాలు, నేత, తగపుపని, మొదలగునవి విస్తారంగా ఈ కుటీరపరిశ్రమ క్రింద తెచ్చి గ్రామాలవారికి కావలసిన సహాయం చేయ ప్రభుత్వం పూనుకొని కుటీరపరిశ్రమల పథకాన్ని మన గ్రామవాసులకు నేర్పుచున్నది. గ్రామాలవారు ఇదియేమి శ్రద్ధతో గ్రహించాలి. ఇప్పుడు ఒక సాధారణ కిరసనాయిల్లాంపు కొనాలన్న, లేక యే ఇతర చిన్నవస్తువు కొనాలన్న సీమదేశాలవి కొంటున్నాము. కాని సీమదేశాలకు, ఇట్లు కొనేదానివలన వారి సౌభాగ్యాన్ని వారి పరిశ్రమలను అభివృద్ధిపర్చుటే గాక, మనం, మనదేశంలో అట్టి చిన్న చిన్న వస్తువులు చేసుకొని, చేసుకొనేందుకు కావలసిన వస్తువులు దొరికే మన గ్రామాలను అభివృద్ధిపర్చుకొని ప్రతివారు పట్టుదలతో ఇతర దేశాలను చూచైనా ఈ స్వాతంత్ర్యం పొందినమీదనైనా మన నాయకులు మన ప్రభుత్వం చెప్పినట్లు ముందు చూపుతో, ఆలోచనతో, ఇట్టి అతి ముఖ్యమైన కుటీరపరిశ్రమలు నేర్చుకొని వృథా కాలయాపనం చేయక లాభం పొందుదాం.

యెన్నియో దినాలగా అడుగంటి యేమీ తెలియని గాఢాంధకారంలో పడియున్న గ్రామాదులల్లో కుటీరపరిశ్రమలవల్లే లాభం రాగలదు. ధైర్యసాహసాలతో తమతమ చమత్కారంతో ఇతరులను ఢీకొనేశక్తి రావాలంటే, కావలసిన బలం కావాలి. అట్టిది లక్షలాదిగా ప్రాకుకొనివున్న గ్రామాదుల్లో కుటీరపరిశ్రమలు చిరస్థాయిగా నెలకొని కాకిబలగంలా యెప్పటికి తరుగులేని సిబ్బందిగా వుండాలి. పరిశ్రమలతోపాటు ఆరోగ్యం, విద్య ముఖ్యం. కాన గ్రామాదులలోని పెద్దలు తమ పంచాయితీల మూలకంగా గ్రామసంఘాల మూలకంగా ఇట్టి యేర్పాటు కలుగజేసుకోవలసిన విధియై వుంది.

ప్రతి గ్రామంలో ప్రచారం ప్రోత్సాహం జరగాలి. గ్రామగ్రామంకు రాదారివసతి, నీటివసతి, పశువుకు మేతవసతి చక్కగా చూచుకోవాలి. ప్రతి గ్రామంలో ఒక తపాలా ఆఫీసు, పాఠశాల, కుటీరపరిశ్రమలు, వార్తలు తెలుసుకొని విరామకాలంలో ఆనందంపొందరేడియో మొదలగునవి యెప్పుడైతే వుంటవో ఆ గ్రామం, దాని ఆర్థికస్థితీ వేరే చెప్పాలా ?

పరిణామం

(11 వ పేజీ తరువాయి)

తను ఎంతో సుఖంగా బ్రతకాలని బాల్యం నుంచీ ఉద్దేశ్యాలు గల ధర్మారావు ఒక్క రోజు కూడా సుఖం అంటే ఏమిటో ఎరుగడు. కాలం గడుపుకోవటానికని, పుస్తకాలు చదవటం, రేడియో వినటం, తన ఆశయాల కనుగుణంగా వ్రాయటం మొదలుపెట్టాడు. మొదట్లో అతని రచనలు ఎవ్వరికీ పనికిరాలేదు. అన్ని పత్రికలూ త్రిప్పి పంపినై. తన భావాలు ప్రచారంచేస్తే ఆ పత్రికలుకూడ మాక్కెట్లోంచి కానరేమో! అందువల్లే తన రచనలు వెయ్యటం లేదేమో అని ధర్మారావుకు సందేహం కలిగింది. జీవితంలో ఏరంగంలో, ఎక్కడ తాను కాలు పెడ్తాం అన్నా అందరకూ తన గాలే సరిపడకుండా ఉన్నట్లుగా తోచింది ధర్మారావుకు.

ఇది యిలా ఉండగా ... "ఉద్యోగం చెయ్యకుండా, చేతిలో ఎప్పుడూ ఆ పుస్తక కాగితాలు, వ్రాతలూ ఏమిటి? కూటికొచ్చేదా? గుడ్డకొచ్చేదా? ఊరిమీద తిరుగుతూ, ఎన్నాళ్లని యింట్లో పడివుండి తింటాడ్?" అని ఇంట్లో అంతా, దుయ్యబట్టసాగారు ధర్మారావుని. ఇంట్లో పెద్దవాళ్లకి, చిన్నవాళ్లకి, జీతగాళ్లకు గూడ ధర్మారావు అంటే అలుసయిపోయి, ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతారు. ఎవరు ఎన్ని అన్నా తన్ను కాదు అనుకొని తలవంచుకు తిరగటమే ధర్మారావు అలవాటు చేసుకొన్నాడు.

క్రమంగా పెళ్లి ముడిపడేదాకన్నా, కట్నం బాగా వస్తుందని, ధర్మారావుచేత ఉద్యోగం ఎలాగైనా చేయించాలని వాళ్ల పెద్దవాళ్లకు పట్టుదల ఎక్కువయింది. కానీ యీ విషయంలో ధర్మారావు ఘట్టిగా మొండిచర చటంవల్ల ఎన్నో సాధ్యం చెప్ప చూచి, ప్రయోజనం శూన్యమని వొదిలేసి ఊరు కొన్నారు.

మళ్లీ సంవత్సరం. మాఘమాసంలో సంబంధం కుదిర్చి ధర్మారావుకు పెళ్లి ముడిపెట్టారు. సంబంధాన్ని గురించిగాని, పెళ్లిఏర్పాట్లను గురించిగాని, అంతా పెద్దవాళ్లకే వొదిలేసి ధర్మారావు పిల్ల మెడలో తాళిబొట్టుమాత్రం కట్టాడు. వాళ్ల బంధువులు, స్నేహితులు కొంత మంది అతని మౌనం చూచి క్రమంగా మనిషి మారిపోని, తమలో కలుపుకోవటానికి అర్హుడవు తున్నాడని అనుకోసాగారు.

* * *

పెళ్లిలో అత్తవారింటికి మూడు నిద్రలకు వెళ్లినప్పుడే ధర్మారావుకు ఆ ఇంట్లో ఎటువంటి స్థానం ఉందో, ధర్మారావు భార్య రాజ్యలక్ష్మికి అర్థమయ్యింది.

ఆ రాత్రే ధర్మారావు ప్రథమంగా తన భార్యతో పరిచయం చేసుకోటానికి మొదలు. గదిలోకి వెళ్లేముందే అతని బుర్రలోకి చాలా ఆలోచనలు వొచ్చాయి. తన భార్య ఎల్లాంటి స్వభావం కలదో...... తన్ను అర్థంచేసుకోగల సంస్కారం ఆమెలో వుందో, లేదో...తన ఉద్దేశ్యాలు, భావాలు, ఆదర్శాలు ఆమెకు రుచిస్తాయో లేదో! ... ఒకవేళ లోకంలో అందరివలె ఆమెకూడా తన్ను, తన ప్రవర్తననూ నిరసిస్తే తన బ్రతుకేం కావాలి? అన్నిటికన్నా మించింది ఆమె ముఖంలోకి ఇంతవరకూ గట్టిగా తేరిపార చూడకపోవటం అతణ్ణి కొంత అలయించింది.

గదిలో కాలు పెట్టగానే ధర్మారావు కంటికి తెల్లటి దుప్పట్లతో, పూలతో చక్కగా అలంకరింపబడిన పడకలు రెండు కనబడ్డాయి. వాటి దగ్గరగానే బల్లమీద అగరువొత్తులు గుమాయిస్తూ వెలుగుతున్నాయి. అక్కడే తీపి, కారం, రకరకాల మిఠాయీసరుకు, పళ్లు, పాలూ ఉన్నాయి. ఇవి ఏవీ ధర్మారావులో ఎల్లాంటి చలనం, మార్పు కలిగించలేదు. ధర్మారావు తలయెత్తి నలుమూలలా పరికించిచూచాడు. ఎవ్వరూ కనిపించలేదు. కొద్ది నిమిషాలకు ఎవరో తలుపుత్రోసిన చప్పుడు అయింది. అతని గుండెలు ఎందుకో వేగంగా కొట్టుకున్నాయి. రాజ్యలక్ష్మి జలతారు పువ్వులుగల బెనారసుచీర ధరించి వెండి మరచెంబుతో, మంచినీళ్లతో వచ్చింది. చెంబు బల్లపై ఉంచి అక్కడే నిలబడిపోయింది. ధర్మారావు భార్యముఖంలోకి చూచాడు. ఆ నల్లటిదేహం పిచ్చనొసలు, చిన్నకళ్లు, దేహంపై దిగ్గురోమం వికారంగా కనబడింది. భూమిమీద కాలు ఆనలేదు. వెంటనే గదిలోనుంచి వెళ్లిపోవాలని తలుపుదాక వెళ్ళాడు. కానీ కంటికి ఎదురుగుండా తల్లిదండ్రులు, బంధువులు, సంఘం —ప్రపంచమంతా ఒక్కసారి తనలోకి, వికారంగా చూస్తున్నట్లు, అపహాస్యం చేస్తున్నట్లుగ కనబడింది. భయంపుట్టి తలుపు తియ్యకుండానే మళ్లీ తిరిగి వెళ్లి మంచంమీద కూర్చున్నాడు. తన తెలివితక్కువమీద ధర్మారావుకు చాలా కోపమొచ్చింది. పిల్లని చూడకుండా తానెందుకు పెళ్లికి వొప్పుకొన్నాడా? అని బాధపడ్డాడు. పోనీ చూసివచ్చిన అమ్మా, నాన్నా తన కెందుకు చెప్పలేదు? వట్టి భ్రమ. పిల్లగొడవ వాళ్లెందుకు పట్టించుకొన్నారు! వాళ్లు కట్నం పదివేలు చూచి మురిసిపోయ్యారు.

ధర్మారావుకు ఆసమయంలో వొచ్చిన కోపం ప్రతి వ్యక్తిమీదకు, దృష్టికి తగిలిన ప్రతి వస్తువుమీదకు ప్రాకింది. భర్త మౌనంగా ఉండటం, లేచి తలుపుదాక వెళ్లి మళ్లీ తిరిగివచ్చి మంచంమీద కూర్చోటం— యీ వింతచేష్టలన్నీ రాజ్యలక్ష్మికి చాలా అసహ్యంగా కనబడ్డాయి. కొంతసేపు నిలుచుండి విసుగొచ్చి, తన ప్రక్కమీద పండుకొని అమాయకంగా, నిశ్చలతతో నిద్రపోయింది.

ధర్మారావు బుర్రలో ఆలోచనాతరంగాల సంఘర్షణ ఎక్కువయింది. తాను ఈ కురూపితో నేనా నా శేషం జీవితం వెళ్లదీయాల్సింది? ప్రపంచ చెప్పుకోలుకోసం కాపురంచేసి బిడ్డల్ని కనాల్సింది యీ మనిషితోనేనా? తను ఎవరికి ఏ ద్రోహం చేశానని యీ శిక్ష అనుభవించాల్సి వొచ్చింది? దీనికి నిష్కృతి ఏమిటి? హిందూసంఘంలో... లేదా?.. తను కావాలనుకొన్న శ్యామలనూ కాకుండాచేసి, తను కావాలనుకొన్న మరో పరాయి సంబంధాన్నీ చెడగొట్టి కట్నంపేచీతో, యీ కురూపిని తన ఆలోచనలతో, ఇష్ట, అయిష్టాలతో పనిలేకుండానే తనకు అంటగట్టటంలో తన తల్లిదండ్రులకు, బంధువులకు, సంఘానికి గల హక్కు ఏమిటో ఎంత ఆలోచించినా ధర్మారావుకు బోధపడలేదు.

కన్నీళ్లతో రెండు ముప్పాతిక తడిపి ఎప్పుడో తెల్లవారిఝాముకు నిద్రపోయి, ఉదయం ఎంతో ప్రొద్దు ఎక్కి నిద్రలేచాడు. మూడురాత్రులు మూడు యుగాలుగానే ఆ దంపతులకు గడిచిపోయాయి.

ఆ రాత్రి ధర్మారావు అత్తగారి నిర్బంధం వల్ల భార్యతో సినిమాకు వెళ్లక తప్పలేదు. హాల్లో ఇంటర్వల్‌లో అతని చెవులకు యిలా సంభాషణ వినపడింది.

"అతను ఎలా వున్నాడో, అతని సౌందర్యం చూడండి. ప్రక్కన కురూపిలా ఆ భార్య .... ఎంత వికారంగా ఉంది—ఆదాంపత్యం చూడటానికి? ఇల్లాంటి విరుద్ధప్రకృతులు ఎందుకు జతకట్టబడతాయో!"

ఈ మాటలు విన్న ధర్మారావుకు లోకంపై చాలా కోపం వచ్చింది. ముందు ఎందుకు చెయ్యాలి? తరువాత వేలుపెట్టి అలా చూపించి ఎందుకు వెక్కిరించాలి? ఎవ్వరు చెప్పతారు? సమాధానం...,

ఈ ఆలోచనలతోపాటు ధర్మారావుకు ఒక వేపునుంచి గర్వంకూడ వచ్చింది, తన్ను ప్రశంసించినందుకు. దాంతో క్రమంగా ఇతరుల ఎదుటమాత్రం లోకంలో అందరివలె, తన భర్తస్థానానికి తగినట్టుగా ప్రవర్తించ మొదలుపెట్టాడు. దీనిలోగల యథార్థాన్ని గుర్తించలేక అంతా ధర్మారావుని ప్రశంసించ మొదలుపెట్టారు. పెళ్లి అయింతర్వాత బాగుపడ్డాడు. ఇక భరవాలేదు అనుకోసాగారు. రాజ్యలక్ష్మి మాత్రం భర్తను అర్థంచేసుకోవాలని తెగ ప్రయత్నం చేస్తోంది. కానీ అతని మనస్తత్వం ఆమెకు బోధపడేటట్లుగా లేదు.

ఆరాత్రి భర్తతో ఎలాగైనా మాట్లాడి ప్రసన్నం చేసుకోవాలని రాజ్యలక్ష్మి ఎంతో కాంక్షతో గదిలోకి వెళ్లింది. భర్త నుద్దేశించి "మీరు ఎంతో అందంగా, సుందరస్వరూపుల్లా ఉన్నారు. మీలో మంచితనం నన్ను ఆకర్షిస్తుంది" అంది.

ఈ మాటలకు ధర్మారావులోగల ఈర్ష్య, గర్వము తోకత్రొక్కిన త్రాచువలె పైకి వొచ్చాయి.

"ఆ విషయం నాకు తెలుసు, నీపొగడ్తలతో నాకు పనిలేదు." అన్నాడు ధర్మారావు కఠినంగా.

రాజ్యలక్ష్మి తన భర్తముఖంలో తనపై ఆయనకు గల అయిష్టత, ఒకవిధమైన ఈర్ష్య, క్రోధం చూచి, బాధపడి, వెళ్లి తన మంచంమీద పడుకొని ఏడ్చింది. తను భర్తను తనవైపుకు త్రిప్పుకోలేక పోయినందుకు, తనకు కురూపి దేహాన్ని భగవంతుడు ఇచ్చినందుకూ ఎంతో కుమిలి కుమిలిపోయింది.

రాజ్యలక్ష్మి భర్త ముభావంగా ఉంటున్నా, అతనికి భోజనందగ్గరగాని, స్నానపానాదుల ఏర్పాటుల్లోగాని ఎంతో శ్రద్ధ తీసుకొని పని చేస్తూ ఉండేది. ఒకొక్కప్పుడు ధర్మారావుకు భార్యచేసే సేవలు ఆకర్షించి, ఆమెను ఆప్యాయతతో చూడాలని బుద్ధిపుట్టేది. కానీ మళ్లీ ఆమె 'కురూపి' ఆకారం కళ్లలో మెదిలి అతని ప్రవర్తన మామూలుధోరణిలోనే పడవేసేది.

ఒక రోజున రాజ్యలక్ష్మికి తన భర్త వ్రాసి ఉంచిన రచనలు చదివే అవకాశం చిక్కింది. ప్రతి రచనలోనూ తన భర్తయొక్క స్వేచ్ఛా వాయువులు, ఉద్దేశ్యాలు, ఆదర్శాలు, భావాలు అన్నీ ప్రతిబింబించి కనబడ్డాయి తన భర్త హృదయం ఎంతో లోతైందని, తనబోటి సామాన్య సంస్కారులకు అమాయకులకు ఆయన్ను అర్థంచేసుకోవటం తలకుమించిన పని అని, ఎంత హృదయవిశాలతగల తనభర్తకు తన బోటి స్త్రీ భార్యగా దొరకటం నిజంగా తన భర్త దౌర్భాగ్యమేననీ, అందువల్లే ఆయన తన్ను ఆదరించలేకపోతున్నాడని తెలుసుకొన్నది. అది గుర్తించిన మరుక్షణం నుంచీ రాజ్యలక్ష్మికి భర్తపట్ల అభిమానం, అనురాగం మరీ వృద్ధి పొందజొచ్చాయి.

ధర్మారావు తన అయిష్టతను, తిరస్కారాన్ని ఎన్నివిధాలు భార్య ఎదుట మాటల్లోగాని, చేతల్లోగాని చూపుతున్నా, ఎంత కఠినంగా ఆమెపట్ల ప్రవర్తిస్తున్నా, రాజ్యలక్ష్మికి మాత్రం ఏ విధంగాను నొప్పి కలిగించటం లేదు. పైగా ఆమె తన ఓర్పును, ఆదరణను భర్తపట్ల అభిమానంతో ప్రదర్శించ మొదలుపెట్టింది.

ఈ విధంగానే రోజులు దొర్లుతున్నాయి.

ఎన్నో రాత్రులు పడకగదిలోకి పోవటానికి మనస్సు వొప్పక, జోరున ధారాపాతంగా వర్షం కురిసి జల్లుకొడుతున్నా, వరండాలోనే రాత్రంతా వాలుకుర్చీలో బడి దొర్లాడుతూనే, ధర్మారావు కాలం గడిపేవాడు. ఆ రోజుల్లో అతని హృదయంలో ఎంతో కాలాన్నుంచి పాతుకుపోయి కరుడు గట్టుకొని వున్న భావాల్ని, ఆశయాల్ని, ఆదర్శాల్ని మార్చుకొనే శక్తి లేక, ఎంత మానసికయాతన అనుభవించేవాడో ఎవ్వరికే తెలియదు.

లోకంలో కొన్నాళ్లపాటు కనుమరుగుగా గడిచిపోయిన ధర్మారావు జీవితం తిరిగి విమర్శకు లోనుకాజొచ్చింది. "దౌర్భాగ్యుడు. ఇష్టం లేనివాడు మొదట్లోనే చేసుకోకుండా ఊరుకోక పోయినాడా? ఆ పిల్లను అన్యాయంగా నానా అవస్థలూ పెడుతున్నాడట! తెచ్చి వేసుకు తింటానికి, వాడుకోవటానికి వాళ్ల డబ్బు పనికి వచ్చిందిగాని, పిల్ల పనికి రాలేదట!" అనికొందరూ; "అసలు వాడి సంగతి ఎవరికి తెలియదు? ఏరిపండి దమ్మిడీ పని చెయ్యలేనివాడికి, కాని సంపాదించలేని వాడికి, ఆ వెధవకు పిల్ల నిచ్చినవాళ్లకు బుద్ధిలేదు." అని కొందరూ, రకరకాలుగా అనటం సాగించారు.

ఈ మాటలవల్ల ధర్మారావు హృదయంకన్నా, రాజ్యలక్ష్మి హృదయం ఎక్కువగా గాయపడేది.

రాజ్యలక్ష్మి తన హృదయంలోని, సౌందర్య దేవాలయాన్ని, దానిలోని ప్రేమసింహాసనాన్ని

(22 వ పేజీ చూడుడు)

కులాసా కబుర్లు :

రూపాయల పొంగు

శ్రీ జి. యస్. సూరి

వ్యాధులు, గత్తర్లు, తెగుళ్ళు జంతుజాలానికి మాత్రమే సంభవిస్తాయని మనలాంటి సామాన్యప్రజలు అనుకొంటారు. ఈమధ్య పత్రికలను తిరగవేస్తే డబ్బుకుకూడా ఈలాంటి బాధలు సంప్రాప్తమవుతాయని తెలుస్తున్నది. ప్రస్తుతం ఎక్కువ ప్రచారంలోఉన్న వ్యాధి ఇన్‌ఫ్లేషను. దీనిని ఆయుర్వేద శాస్త్రజ్ఞులు ద్రవ్యోల్బణం అంటారు. చిటకా వైద్యులు అధికచలామణి అంటారు. ముసలిముతకలు రూపాయల పొంగు అంటారు.

ఒక్కొక్క వ్యాధికి ఒక్కొక్క జంతువంటే ఆపేక్ష. అంటిపెట్టుకుని మసలుతుంది. ప్లేగుకు ఎలుకకు ఎంతో సఖ్యం. మలేరియాకు దోమకు ఎంతో చెలిమి. పిచ్చికి కుక్కకు ఎంతో స్నేహం. సరదానుబట్టే ఆయా జంతువులు ఈ జాడ్యాలను మానవులమీదికి సరఫరా చేస్తూఉంటాయి. ఇది సర్వసాధారణ విషయం. కాని ఇప్పుడు అమలులోఉన్న రూపాయల పొంగు ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తుంది. ఇది మానవులనుంచి డబ్బుకు సంక్రమిస్తుంది. మనలాంటివాళ్ల చేతులలో ఉన్నంతవరకు రూపాయికి ఎటువంటి ప్రమాదమూ సంభవించదు. మన దగ్గరనుండి తప్పించుకుని మిల్లు యజమానుల దగ్గరికో, రాజాలదగ్గరికో, లంచగొండి ఉద్యోగులదగ్గరికో, చీకటిబజారువాస్తవ్యులదగ్గరకో చేరిందాఅంటే ఈపొంగు వెంటనే ఆవహిస్తుంది. ఆ పెద్దమనుష్యుల చేతులమీదను, ఇనుపపెట్టెలమీదను ఈ క్రిమిపొంచుండి, పాపం అమాయకపు రూపాయిని కాటువేస్తుంది. కాటుపడగానే రూపాయి ఉబ్బటం సాగిస్తుంది. నీరు జూపిన మనిషిమాదిరి తయారవుతుంది. ఉన్నచోటనుంచీ కదలేశక్తి తగ్గిపోయి కూలబడిపోతుంది.

ఈ కొత్త వ్యాధి ఇంత తీవ్రంగా చలామణిలో ఉన్నదని మనలో చాలమందికి తెలియనే తెలియదు. కాని ఒక్కవిషయంమాత్రం సామాన్యవ్యక్తికి అంతుపట్టేదికాదు. ఇన్నాళ్లూ నాలుగు రూపాయలంటూ నెలాఖరుకు చేతిలోకి వస్తే పదిరోజులపాటు స్థావరంగా నిలిచి ఉండేవి. కొంతకాలంనుంచి వచ్చిన రోజున జారుకుపోయి ఇంటికి చేరేప్పటికి మాయం కావటం మొదలుపెట్టినవి. జేబునుగాని, పర్సునుగాని చిల్లి ఉందేమోనని ప్రతివాడూ మాచుకునేవాడు. కాని అలాంటిది ఏమీ లేకుండానే అంతర్ధానం అయేవి; పైగా ప్రతిరూపాయకూ పూటా ఉన్నట్లు పూర్వం వచ్చే సరుకుకు నాలుగోవంతు రావటంకూడా కష్టమయింది. ఈ విధంగా విలువ తగ్గిపోవటానికి కారణం తెలిసేదికాదు. గిట్టవిరిగిన గుఱ్ఱానికి మల్లే, ఎండిపోయిన బత్తాపండువలె, పుచ్చుచూపిన కందులవలె, రూపాయికి ఘరానా తగ్గటానికి కారణం బోధపడేదికాదు. పొంగుఅనే కొత్తవ్యాధి ఈ మార్పుకు కారణమని పత్రికలవాళ్లు వ్రాస్తే కామాలనుకొని సమాధానపడ్డాడు.

ఈ రూపాయల పొంగు ఇంతగా వీరవిహారం చేస్తున్నా ఎవరూ దాని గొడవ పట్టించుకున్నవాళ్లు లేరు. తన పరిస్థితిని గమనించమని ఎన్ని అర్జీలు పెట్టుకున్నా రూపాయను పరామర్శించినవాళ్లులేరు. మీ పని ఇట్లా ఉన్నదా అని పేద ఉద్యోగస్థులను, పనివాళ్లను రెచ్చగొట్టాలని నిశ్చయించింది. జీతంగా వారి చేతులలోకి వచ్చిన మరుక్షణానే ఎగిరిపోవటం సాగించింది. చిల్లరకొట్లవాళ్లు, సిగరెట్టు అంగడివాళ్లు వత్తిడిచేయటం ప్రారంభించారు. పొయిమీదికి పొయికిందికి సర్వం నిండుకున్నవని ఇల్లాలు సతాయించటం మొదలుపెట్టింది. దానితో ఆందోళన ఆరంభమయింది. జీతాలు హెచ్చించమని నోటీసులు జారీ అయినవి. సమ్మెలుకూడా బయలుదేరినాయి.

ఇన్నేళ్లపాటు జైళ్లలో జీవయాత్రసాగించి, ఏదో కొంచెం హాయి దొరికిందిగదా అని పాలుమాలి, సరదాలు తీర్చుకుంటున్న ప్రభుత్వ వ్యాపారులు పెదముఖంతో వ్యవహరించటానికి కష్టమయింది. రూపాయిపడే బాధను గమనించక తప్పిందికాదు. అసలు వ్యాధి ఏమిటో తెలుసుకోటానికి సంఘాలను నియమించారు. తాపీగా పరిశోధనలు చేసి కొంతకాలం అయినతరువాత ఈ పొంగువ్యాధిలక్షణాలను తెలుసుకోగలిగారు. ఇక వ్యాధి నిర్మూలనవిషయం వచ్చేసరికి పెద్ద చిక్కులు బయలుదేరినవి.

ఈ వ్యాధికి మూలకారణమయిన క్రిములు ఎవరిని ఆశ్రయించి ఉంటాయో, ఏ విధంగా రూపాయికి సంక్రమిస్తాయో, లోగడ మనవి చేసి ఉన్నాం. ఈ క్రిములను నాశనం చేయుటం క్లిష్టమైన సమస్యగా పరిణమించింది. ఇవి ఆశ్రయించిన వ్యక్తులకు అపాయం జరగకుండా వీటిని రూపుమాపటం దుర్లభమని శాస్త్రజ్ఞులు నిర్ణయించారు. ఒకవేళ వీరికి అపాయం జరిగితే ఎల్లాగురా బాబు, వీరితో మనం కూడా కూలిపోమా అని నిశ్చేష్టపోయినారు కొందరు నాయకులు. ఈ జాడ్యాన్ని తొలగించకపోతే జనబాహుళ్యం మనలను కుంటీయదా అన్నారు మరికొందరు అగ్రనాయకులు. ఏమి చేయటానికీ తోచక ప్రాణం విసిగి ఎవరికి తోచిన సలహాలు వారిని ఇవ్వమన్నారు ప్రభుత్వంవారు.

ఇక 'ఏవర్గంలోవారు' ఆవర్గంలో వారితో తలపట్లు పట్టుకున్నారు. తీవ్రమైన చర్చలు జరిపారు. రిపోర్టులచిత్తులు, గణాచిత్తులు, అఖండ చిత్తులు తయారైనవి. ఢిల్లీ అడంగులకు సరఫరాఅయినవి. ఎవరికివారు భారాన్ని యావత్తూ తమకు ప్రతికక్షులైన వారిమీద బనాయించటానికి ప్రయత్నాలు చేశారు. పెట్టుబడిదారులు పనివాళ్లకు కూలి తగ్గించమన్నారు. కార్మికులు యజమానుల లాభాల డివిడెండ్లను తెగకొయ్యమన్నారు. విద్యార్థులు జుర్మానాలను తగ్గించమన్నారు. సినిమాప్రేక్షకులు టిక్కెట్లు ధర తగ్గించాలన్నారు. [illegible] తగ్గించమన్నారు. భోజనప్రియులు ఆహారవస్తువులను రాక చేయమన్నారు. రోగులు మందుల ఖరీదులను తగ్గించమన్నారు. దావాఖోర్లు వకీళ్ల ఫీజులు సగం చేయాలన్నారు. పత్రికాధిపతులు జర్నలిస్టుల వేతనాలను చిత్రికపట్టాలన్నారు. ఎట్లా ఎవరికి తోచిన సలహాలను వాళ్లు అందచేశారు. కిటస్నేటను తన్నెత్తి, కరిగి, మూసపోసి ఒక ప్రణాళికగా ప్రభుత్వంవారు జారీచేశారు. కాని పొంగునుంచి రూపాయికి విముక్తి కనబడలేదు.

ప్రభుత్వశాఖలలో అనవసరపు ఖర్చులు తగ్గించి మాస్తామన్నారు ఢిల్లీఖామందులు. సేనాగార్లను, సోపుగార్లను, చప్రాసీలను, జంత్రీతులను చిన్నజీతాల ఉద్యోగాలనుంచి తొలగించమతున్నట్లు వింటున్నాము. వాళ్లకు బదులు ఉపమంత్రులను, సహాయమంత్రులను, నిస్సహాయమంత్రులను నియమించారు వేలజీతాల మీద. ఆధారం లేని పెద్దపెద్ద స్కీములను కొంతకాలం నాటు ఊరవేసి ఉంచబోతున్నామన్నారు. ముసలంలో లక్షలు ఖర్చుచేసే బాధ్యతాయుతాలను దేశాంతరాలకు రవాణా చేశారు. అన్యాయార్జితలాభాలను పరిశీలించి రాబడిపన్నుల ఎగవేతలను విచారించబోతున్నామని ప్రకటించారు. ఇంతలో, కంచెలే చేలను మేసినట్లు ఖజానామంత్రి కారణాంతరాలవల్ల రాజీనామా ఇవ్వవలసివచ్చింది. అన్ని విధాలకంట్రోళ్లను తిరిగి అమలు జరుపుతున్నామన్నారు. కాని ఈ కంట్రోళ్లు మళ్లీ అవతరించటానికి కారకులైనవాళ్లను, పర్మిట్లు ఇప్పించి బాగుపడిన దేశభక్తులను యథేచ్ఛగా తిరగమన్నారు. జమాఖర్చు సరిపోయి జాడ్యం జాడ్యంగానే ఉన్నది.

అమాయకపు రూపాయికి ఇంత యాతన తెచ్చిపెట్టినవాళ్లలో ముఖ్యులు చీకటిబజారు వాస్తవ్యులు. ఏ వ్యాధి బయలుదేరినా ముందు ఆ పేటలోనే అంకురిస్తుంది. అక్కడే ఓటర్లు ప్రచండమైన శక్తిసామర్థ్యాలు, విశేషమైన పలుకుబడి ఉన్న మహారాజులు. నిన్న మొన్నటిదాకా కారాగారాలకు సిద్ధంగా ఉండి ఈనాడు అద్దాలమేడలలో ఉయ్యాలలూగుతూ, ఏసుగంత కార్లలో పట్లుకొడుతూ, పొంగు రూపాయల గాలీసులమీద కాలం గడుపుతూ ఉంటారు ఈ పెద్దమనుష్యులు. వీళ్లజోలికి పోవటానికే మహామహా నాయకులు తల్లడిల్లిపోతారు. ఈ చేరగాళ్లకు డి. ఐ. ఆర్. లోపన్లతో, తీవ్ర శిక్షలతో తగిన సత్కారం జరిగితేనేగాని పొంగు తిరుగుముఖం పెట్టదు.

చలిజ్వరానికి క్వైనైన్ ఎటువంటిదో, తలనొప్పికి ఆస్పిరిన్ ఎటువంటిదో, రూపాయల పొంగుకు ఉత్పత్తి లాంటిది. విపరీతంగా సరుకు సరంజామాలు తయారైతేనేగాని గిరాకీ సర్దుకోదు. యంత్రపరికరాలను అమర్చి క్రమమైన పద్ధతిలో సమగ్రంగా ఉత్పత్తి జరిపించకపోతే ప్రయోజనమేమీ ఉండదు. బులిబుచ్చికపు కబుర్లతోను అర్థంలేని ప్రణాళికలతోను రూపాయలపొంగు దిగజారదు. ఒళ్ళు పెరిగినవాడికి గుగ్గిలపు ఊదర, వేపమండల ప్రహారాలు తగలనివ్వందే మామూలు మనిషి అవుతాడా మరి?



జూపిటర్ వారి 'మోహిని'లో కుమారిపాత్రధారిణి మాధురీదేవి

నేటిప్రపంచం

(5 వ పేజీ తరువాయి)

దాహాసాలు ముందు నిర్ణయించుకొనే, మిగతావి తక్కినవారికి పంపుతుందట.

బ్రిటిష్ ఆర్థికమంత్రి క్రిప్సుతో సమావేశంలో అధినివేశప్రధానులను ఈ యీ అంశాలు సుబోధక మయ్యాయట.

కామన్వెల్తు ప్రధానుల సమావేశాలు, సాధకారలాంఛన సమావేశాలుగా జరుగక, పరస్పరం స్నేహంగా ఒకొక్కళ్లతోటీ, ఉమ్మడిగానూ, కూర్చుని, సాధికార ప్రసంగాల నిర్బంధం లేకుండా, జరిగేట్టుగా చూడటంలో బ్రిటిష్ నాయకులు, తమ సాంప్రదాయ సిద్ధమైన రాజనీతిని చూపారు. మధ్య మధ్య భారతప్రధాని నెహ్రూ మొదలైనవారు పారిస్ వెళ్లి ప్రపంచరాజకీయాల పరిస్థితి స్వయంగా గ్రహించేందుకు కూడా అవకాశం కల్గింది. ఈ 25 నుంచీ మళ్లీ సమావేశమవుతున్నారు. కామన్వెల్తు రాజ్యాల సమిష్టి రక్షణ విధానాలు మొదలైనవి చర్చకు వస్తున్నాయి. ప్రపంచపరిస్థితిని తాముఎల్లా అవగాహన చేసుకొంటూందీ, బెవిన్ అధినివేశప్రధానులకు విపులంగా వివరిస్తున్నాడు.

కామన్వెల్తుకి ఒక కొత్తస్వరూపం కల్పించి కొత్త నిబంధనావళిని, ప్రణాళికను, కల్పించి, ఒక నూతన తత్త్వం, కామన్వెల్తు కిచ్చి, అందరినీ సామరస్య పరచాలని, బ్రిటిష్ నాయకులు చూస్తున్నారు. రాజభక్తిప్రమాణము, వెస్టుమినిస్టర్ స్టాట్యూట్ నిబంధనలు అన్నీ మార్చి కొత్త స్వరూపం ఇచ్చి, ఇండియా మొదలైన స్వతంత్రరాజ్యాలు కామన్వెల్తులో ఉంటూ, స్వాతంత్ర్యాని కేమీ భంగం కాకుండా విధానంలో ఉండవచ్చును అని అనిపించే కామన్వెల్తు స్వరూపానికి బ్రిటిష్ నాయకులు కృషి చేస్తున్నారు.

అణుశక్తి పరిశీలన సంఘం

నేటిప్రపంచ విషమపరిస్థితులలో ఐక్యరాజ్య సమితి ఒక్కటే లోకశాంతికి ఆశాజ్యోతి. ఈ జ్యోతి కొంచం ఆరిపోయిన మరుక్షణంలో ప్రపంచగతి అంధకారబంధురమై పరిస్థితులు మరీ అధ్వాన్న మయేమాట వాస్తవం. భారత ప్రధాని నెహ్రూ ఈవిషయాన్ని అనేక సార్లు ఉగ్గడించివున్నారు.

అమెరికాప్రభుత్వ ఉన్నతోద్యోగి, జర్మనీ సమస్యపై జార్జిమార్షల్ ముఖ్యసలహాదారు అయిన ఛార్లెస్ సాల్టజ్మన్ అనే అతడు బర్లిన్ ప్రతిష్టంభనమీద సోవియెట్ రష్యాతో యుద్ధం అనివార్యమే అయేటట్లు కనిపిస్తున్నదని అమెరికన్ ప్రజలకు హెచ్చరిక చేశాడు. అమెరికా విదేశాంగశాఖ తయారుచేసిన అధికార పూర్వక ప్రకటననే సాల్ట్జ్మన్ న్యూహాంప్‌షైర్ విశ్వవిద్యాలయంలో చదవడం సంభవించింది. "యుద్ధం రాకుండా చూడడానికి మా శక్తికొద్దీ కృషిచేస్తున్నాము. బర్లిన్ తగాదాను సహనంతోనూ, నైతిక స్థైర్యంతోనూ, మనోనిబ్బరంతోనూ జయప్రదంగా పరిష్కారం చేసుకోవాలని అమెరికా చూస్తున్నదికాని, ఇది సాధ్యపడుతుందని తోచడం లేదు. ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో శాంతియుతంగా పరిష్కారం చేయాలనేమా ప్రయత్నం. కాని, రష్యా ఇవ్వడంమానివేసి వీలైనంత పుచ్చుకోవాలనే చూస్తున్నది—కమ్యూనిస్టు సిద్ధాంతానికీ, మిగతా ప్రపంచానికీ సంఘర్షణ నుతప్పనిసరిగా తెచ్చిపెట్టాలనే రష్యా చూస్తున్నది." అని కూడా ఈ అమెరికన్ ఉన్నతోద్యోగి హెచ్చరిక చేశాడు.

ఈనాడు బ్రిటన్, అమెరికా, కెనడా, ఫ్రాన్సు, ఆస్ట్రేలియా మొదలైన దేశాలన్నీ యుద్ధసన్నాహాలు చేసుకుంటున్నవి. సోవియెట్‌రష్యా, తూర్పుయూరప్‌లోని దాని ఉపగ్రహ రాజ్యాలుకూడా ఇదే ధోరణి అనుసరిస్తున్నవి. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో బెవిన్, మార్షల్ విషిన్‌స్కీ, మాలిక్ ప్రభృతులు చేస్తున్న దీర్ఘోపన్యాసాలే ధోరణికి ప్రబలనిదర్శనాలు. అగ్రరాజ్య విభేదాలకు పరిష్కారమార్గం యుద్ధమే నన్నట్లుగా వీరు వ్యవహరిస్తున్నారు.

ఈసారి ప్రపంచానికి తిరిగి యుద్ధప్రమాదమే సంభవిస్తే ఆ ఏటంబాంబు ప్రయోగంతో సర్వ మానవ వినాశనం నాగరికతావిధ్వంసం తప్పవనే సూచనలు కనబడుతున్నవి. వివిధ రాజకీయ విభేదాలతోపాటు అగ్రరాజ్యాలు పరమాణుశక్తి కంట్రోలు సమస్యమీదకూడా ఇప్పటికరకూ ఇదమిత్థమని ఒక పరిష్కారానికి రాలేకపోవడం అత్యంతశోచనీయమైన విషయం.

పరమాణుశక్తి కంట్రోల్ విషయమై ఏర్పడిన ప్రతిష్టంభనమీద సమితి రాజకీయ సంఘం పారిస్‌లో ఒక తెగని చర్చ జరుపుతున్నది. ద్వితీయ ప్రపంచ సంగ్రామాంత్యదశలో జపానులోని హిరోషిమా నాగసకీ రెండు పట్నాలపై రెండు ఏటంబాంబులను అమెరికా ప్రయోగించేసరికి దాదాపు లక్షన్నరమంది ప్రజలు మరణించడం సంభవించిందంటే, పెద్దపెట్టున ఈ బాంబులతో యుద్ధమే జరిగితే అది ఎంత విలయకారణ మవుతుందో ఊహించవచ్చు. పరమాణుశక్తిపై, తద్వారా తయారయే మారణాస్త్రాలపైనా ఏదో ఒకవిధమైన అంతర్జాతీయ అదుపాజ్ఞలు పరిశీలన ఉండడం మానవకోటికి శ్రేయోదాయకం. ఈ విషయంలో సమితి నియోగించిన అంతర్జాతీయ పరిశీలనసంఘం ఒకటి దాదాపు రెండు సంవత్సరాలపాటు పనిచేసి ఏవిధమైన ఫలితాలనూ సాధించలేకపోయింది. చివరకు సమితికి ఒక నివేదికను సమర్పించి ఆ పరిశీలకసంఘమే రద్దయిపోయింది. ఏటంశక్తి ఉత్పత్తికి ఉపయోగపడే యురేనియం, థోరియం లోహాలను గనులనుండి త్రవ్వి తీయటం మొదలు, శక్తి ఉత్పత్తివరకు ఈ కాండను యావత్తూ అంతర్జాతీయాధ్వర్యంక్రిందనే నిర్వహించడం అవసరమని ఈ పరిశీలకసంఘం సిఫార్సు చేసింది. ఒక్క రష్యా, యుక్రేన్ ప్రతినిధులు తప్ప సంఘంలోవున్న మిగతా పద్నాలుగురు సభ్యులు ఈ సిఫార్సును ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇప్పటికే తయారుచేసి వుంచిన ఏటంబాంబు నిల్వ లన్నిటినీ ముందు ధ్వంసంచేసి, అగ్రరాజ్య వీటో అధికారానికి లోబడి పనిచేసే కంట్రోల్ విధానాన్ని పరమాణు శక్తి ఉత్పత్తిపై అమలు పరచాలని రష్యా యుక్రేనుల వాదన. ఇప్పటికి ఈ రెండుసంవత్సరాలనుంచీ రష్యావాదన ఇదే. రష్యా ఈ వాదన ఫలితంగానే ఏటంశక్తి కంట్రోలు సమస్యమీద తీవ్రప్రతిఘటన ఏర్పడి చర్చలన్నీ నిరుపయోగమైపోయినవి.

ఏటంబాబు నిర్మాణరహస్యం అసలు రహస్యమే కాదనీ, ఈ రహస్యం ఒక్క తనకు మాత్రమే తెలుసని భావిస్తూ అమెరికా వెర్రి భ్రమలో పడివున్నదనీ సోవియెట్ నాయకులు అంతర్జాతీయ సభావేదికలపైనేగాక, ప్రత్యేక ప్రకటనలలోకూడా పదేపదే అంటున్నారు. దీన్ని బట్టి రష్యా కూడా ఏటంబాంబులను సృష్టిస్తున్నదని ఎవరికైనా తోచకమానదు. ఏటంబాంబు నిర్మాణం ఒక్క అమెరికా సొత్తేగాదు; వాటిని తయారుచేయడానికి రష్యాకు హక్కువున్నది. ఐతే రష్యాకు ఎన్ని ఏటంబాంబులు వున్నవో, ఏరకంబాంబులు వున్నవో పరిమరహస్యంగా వుంచుతున్నారు. ఏటంబాంబుల నిల్వలను ముందు ధ్వంసంచేయాలని రష్యా వాదిస్తున్నది కాక ఇందువల్ల రష్యా నిగూఢంచేసిన ఏటంబాంబులు అవిభంగా వుంటిపోయి, అమెరికన్ బాంబులన్నీ ధ్వంస మయే ప్రమాదం వున్నదని కెనడా, అమెరికా, బ్రిటను దేశాల వాదన.

అణుశక్తి కంట్రోలు సమస్యమీద పరిశీలక సంఘం ఇదవరలో చేసిన సిఫార్సును సమితి ఆమోదించడం అవసరమని కెనడా ప్రతినిధి జనరల్ మెక్‌నాటన్ రాజకీయ సంఘంలో ఇటీవల ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు. బ్రిటిష్, అమెరికన్, ఆస్ట్రేలియన్ ప్రతినిధులు దీన్ని బలపరిచారు. రష్యా ప్రతినిధి ఆంద్రీ విషిన్‌స్కీ తన పాత దృక్పథాన్ని మార్చుకొని, ఇప్పుడున్న ఏటంబాంబు లన్నిటినీ ధ్వంసంచేయడం, అంతర్జాతీయ కంట్రోలును ఏర్పరచడం రెండూ ఒకేసారి జరగాలనీ, ఒప్పందాలమీద సంతకాలు ఒకేసారి చేయాలనీ, ఈ పద్ధతికి రష్యా ఇష్టపడుతుందనీ ఈ మాసారంభంలో ఒక కొత్త రాజీప్రతిపాదన చేశాడు. రష్యా చేసిన ఈ రాజీ ప్రతిపాదన సమితివర్గాలలో ఒక నూత్న ఉత్సాహాన్ని కలిగించింది.

అణుశక్తికంట్రోలు పరిశీలక సంఘంలో పశ్చిమ రాజ్యప్రతినిధులు ఇదివరకు చేసిన సిఫార్సులను, రష్యాచేసిన రాజీప్రతిపాదనను సమన్వయపరచడానికి, వివిధరాజ్యాల మధ్య ఒప్పందాన్ని సాధించడానికీ వీలున్నదనీ, ఈ పరిస్థితులలో అణుశక్తి పరిశీలక సంఘం తిరిగి తన కార్యకలాపాన్ని ప్రారంభించాలనీ భారత ప్రతినిధి సర్ బెనిగల్ నరసింగరావు గారు రాజకీయసంఘంలో ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. వివిధదేశాల దృక్పథాలను, తీర్మానాలను సమన్వయపరచి, రాజీధోరణిలో ఒక తీర్మానం తయారుచేయడానికి రాజకీయ ఉపసంఘం పదకొండుగురు ప్రతినిధులతో ఒక ఉపసంఘాన్ని నియమించింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా, చైనా, కెనడా, బ్రెజిల్, ఇండియా, స్వీడన్, యుక్రేన్, ఈక్వెడార్ దేశాలకు సభ్యత్వం ఇచ్చారు. ఈ ఉపసంఘానికి భారతప్రతినిధి సర్ బి. ఎన్. రావుగార్ని అధ్యక్షులు చేశారు.

ఈ అధ్యక్షతను జరిగిన సమావేశంలో, ఇండియా ప్రతిపాదన వీగిపోయింది. అణుశక్తి చర్చాసంఘము రష్యా ప్రతిపాదనను తోసేసింది. కనడా ప్రతిపాదనకు సుముఖత్వం ఎక్కువయింది. కాని సమస్య సమస్యగానే మిగిలింది. అణుశక్తి యాజమాన్య చర్చాసంఘం మాత్రం, నామమాత్రంగా సాగిస్తూనే ఉంది.

బర్లిన్ ప్రతిష్టంభన

బెర్లిన్ ప్రతిష్టంభనపై బ్రిటన్ అమెరికా ఫ్రాన్సులు రష్యాపై చేసిన ఫిర్యాదుకు భద్రతా మండలి ఎజెండాలో స్థానం ఇచ్చిన ఫలితంగా మండలి చర్చలో రష్యా ప్రతినిధి పాల్గొనక సహాయనిరాకరణం ప్రారంభించాడు. ఐతే మండలిచర్చలకు హాజరవుతూనే వున్నారు.

బర్లిన్ విషయంలో ఎవళ్లపక్షపు వాదం వాళ్లు పూర్తిగా భద్రతాసంఘం ముందు చెప్పుకోవాలని భద్రతాసంఘం ప్రతిపాదించింది. పశ్చిమ రాజ్యాలు మూడూ ఒప్పుకొన్నాయి. ఇది భద్రతాసంఘంలో చర్చనీయాంశము కానే కాదనీ, విదేశమంత్రుల సమావేశంలో తేలవలసిందేననీ, రష్యా ఈ చర్చకు, భద్రతాసంఘ విచారణాధికారానికి సంపూర్ణంగా విముఖత చూపి, తన నిరాకరణ చూపింది. ప్రతిష్టంభన సమస్య అల్లాగే మిగిలిపోయింది.

పరిణామం

(19 వ పేజీ తరువాయి)

తన భర్త ఏనాటికైనా గుర్తిస్తాడని, అతనిలో ఆ శక్తి ఉందని, ప్రపంచంలో అందరికీ ఆ ప్రేమ ప్రవాహంలో ఈ సులాడే భాగ ముండగా తనకు మాత్రం ఎందుకు లేకుండా పోతుందని—ఇట్టి కోరికలతో, నమ్మకాలతో, ఊహలతో, ఆశలతో, తనభర్తపాదములలో ప్రణతయై స్వార్పణ చేసుకొంటూ, భర్త సానుభూతిని సంపాదించుకోగలననే ధైర్యంతో "రేపు" అని ఆ మధుర ఘడియలకు ఎదురు చూస్తూ కాలం గడుపుతుంది.

మానవుడిలో వుండే ఓర్పుకు కూడా ఒక హద్దు ఉంటుంది. అది దాటితే కట్ట తెగిన ప్రవాహంలాగ వెల్లువలై మనోభావాలు పరుగులెత్తుతాయి. దాంతో ఎన్నో లేనిపోని ఆలోచనలు మనస్సుని క్రుంగదీయ మొదలుపెట్టుతాయి. ఒకొక్కప్పుడు అవి జీవితవినాశనానికిగూడ కారణాలుగా పరిణమిస్తాయి.

సుఖమనేది ఆకాశం మీద మిణుకు, మిణుకుమంటూ వుండే నక్షత్రాల్లాంటిది. నక్షత్రాలు మాత్రం అంతటా ఉంటాయా? మధ్య మధ్య నలుపులు లేవా? అలాగే భార్యాభర్తలు ఎన్నో తప్పులు చేస్తారు. చేశామని కూడ గుర్తించినాక అనుకొంటారు. కానీ ప్రేమ అనేది, సుఖమనేది, నక్షత్రాల్లాగ మిణుకు, మిణుకుమ్మటూనే ఉంటుంది. కానీ ఇది గ్రహించి బ్రతకగలగటం ఎంతో కష్టం.

రాజ్యలక్ష్మి శరీరంలో జబ్బు ప్రవేశించింది. మంచం పట్టి పది హేను రోజులైనా ధర్మారావు, భార్యని చూడటానికి అత్తవారింటికి వెళ్ళలేదు. రాజ్యలక్ష్మి, గుడ్డతో ఈగలు తోలుతూ, ప్రక్కలో కూర్చొని వున్న తల్లిముఖంలోకి చూస్తూ "అమ్మా! ఆ కిటికీ తెరువు. ఈ దీపం దూరంగా పెట్టు" అంది.

కిటికీగుండా చూస్తే కాలమహాసముద్రంలో ఒక పాయలాగ తమస్సముద్రం గోచరిస్తుంది. ఎన్ని రాత్రిళ్లు వొచ్చినవో! ఎన్ని గడచిపోయినవో! ఎన్ని రానున్నాయో! నక్షత్రాలు మాత్రం దూరాన మిణుకు, మిణుకుమంటున్నాయి. ఆ నక్షత్రాలు రాజ్యలక్ష్మి లాంటి వేదనహృదయాలను, ఎన్నికోట్ల యిల్లాంటి అభాగ్య జీవుల చావులో, నీరసంగానే చూచి ఉంటాయి. కానీ రాజ్యలక్ష్మి దృష్టికి యీ విషయాలు గోచరించటంలేదు. ఆమె ఆ తారామండలంమధ్య తన భర్త ధర్మారావు ముద్దుముఖాన్ని, సౌందర్యాన్ని నిర్మిస్తూ, పదే, పదే చూచి మురిసిపోతూఉంది...కొంత సేపటికి కంటికొనల్లో కన్నీటి బిందువులు ఏర్పడేవి—ఇదే ప్రపంచంలో ఆమె ఈదులాడుతూ ఉంది. ఈ ఊహాప్రపంచంలో ఎన్నాళ్లు పాపం ఆమె కాలం గడపగలదు?

ఆ రాత్రి "అమ్మా! వారికి ఇవ్వాళైనా కబురు అందిందో, లేదో?" అంది రాజ్యలక్ష్మి ఆశగా సమాధానంకోసరం తల్లి ముఖంలోకి చూస్తూను.

"అతడు ఇంతకు ముందే వచ్చి చూసి వెళ్లాడు. నీకు కూరుకు పట్టిందని లేపలేదు." అని తల్లి రాఘవమ్మ కుమార్తె కుదుటపడుతుందని ఆశతో అబద్ధం చెప్పింది.

"అయ్యో! నిజంగా వచ్చారం? వారు నన్ను చూడాలనే! ఎంత దురదృష్టవంతురాల్ని! చూడలేక పోయానే!" అని రాజ్యలక్ష్మి దుఃఖించింది.

"నువ్వు నిబ్బరంగా, మనోవ్యథను వొదులుకో, తల్లీ! క్రమంగా అతని మనస్సు నీ వైపుకు తిరుగుతూందిలే!" అంది తల్లి.

"నిజంగా, ఆయన నన్ను అర్థంచేసుకుని, ఆదరిస్తారా? అమ్మా, మళ్లీ రేపు ఉదయం వస్తానని చెప్పారా?"

"అతను వస్తానన్నాడు. నేనే రావొద్దు అన్నాను."అంది తల్లి నిజాన్ని కప్పిపుచ్చుతూను.

"అబ్బా! ఎందుకు రావద్దన్నావే, అమ్మా?"

"అతడు అసలే దుర్బలుడు. నీ స్థితి జూచి మరీ బేజారై పోతాడని డాక్టరు రానివ్వొద్దన్నాడు" అంది రాఘవమ్మ కూతురుముఖంలోకి నమ్మకంగా చూస్తూ.

"ఆ డాక్టర్లకేం తెలుసు? ప్రపంచంలో ఎవరి మనోవేదన వాళ్లకు తెలుసుగాని...రేపు ఉదయం ఒక్కసారి పిలిపించమ్మా! కళ్లార వార్ని చూడాలని ఉంది."

"సరే! అలాగే పిలిపిస్తాలే." అని హామీ యిచ్చింది తల్లి రాఘవమ్మ.

రాజ్యలక్ష్మి కలలు గంటూ ఉంది. 'భర్త వస్తాడు.' ఈ ఆలోచనతో గుండెలు తటతట కొట్టుకోవడం ప్రారంభించాయి. ఇంతవరకూ, ఎన్నడూ నోరార ఆప్యాయతతో మాట్లాడుకొని ఎరుగరు. ఇద్దరూ మేళగింపబడని తీగలు. ఆమె తన ప్రేమసంగీతాన్ని, భర్తకు వినిపించాలని ఎన్నోసార్లు ప్రయత్నం చేసి, రసాభాస చేసుకొని బాధపడి ఉంది. ఆయా సమయాల్లో కాసేపు కన్నీళ్లు విడిచేది. అంతేగాని ఎన్నాళ్లు కాలం గడపటం సాధ్యమౌతుందా?

"రేపు తన్ను చూడటానికి భర్త వస్తాడు. ఏం చెప్పాలి? —..— ఈ అవసానదశలో కూడ అనుకూ, అనుకూ మాటలో...హృదయం విప్పి మాట్లాడాలి? ఎలా మాట్లాడటం?" అని తెల్లవార్లూ రాజ్యలక్ష్మి ఆలోచిస్తూనే ఉంది.

మరునాడు ధర్మారావు తల్లిదండ్రుల పోరు, లోకం మాటలు వినలేక బలవంతంమీద భార్యని చూడటానికి అత్తవారింటికి వెళ్లాడు. అల్లుడి రాక అత్తకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. తన బిడ్డ తప్పకుండా బ్రతుకుతుందని ఆమెకు ఆశ కలిగింది.

"ఎల్లా ఉంది వొంట్లో?..." అన్నాడు అత్తగారిముఖంలోకి ముభావంగా చూస్తూ ధర్మారావు.

"మీరు దగ్గర వుంటే తగ్గుతుంది. వైద్యుడు కూడ అదే చెప్పాడు."

"బండికి వెళ్దా మనుకొంటున్నానే?..."

"ఈ పూటే వచ్చి, ఈ పూటే వెళ్లటమా? పిల్ల మీచూపుకోసం అలమటించి పోతోంది. పిలిపించమని ఒకటే గోల."

"సరే, ఇంకా టైము ందిలెండి. ఒక్కసారి చూచి మాట్లాడే వెళ్తాను..."

"కానీ, మీరు ఇప్పుడే మళ్ళీ వెళ్ళిపోతున్నట్లుమాత్రం పిల్లకు తెలియనీకండి."

"సరే."

"ఈపూటైనా నామాట విని కాస్సేపు పిల్లదగ్గర కూర్చొని మాట్లాడి వెళ్లండి."

"ఏం చెయ్యను? ఎక్కువకాలం వెళ్లబుచ్చటానికి రైలు మనకోసం ఆగదుగా?"

"ఈ ఉద్రేకంలో వెళ్ళి దాన్ని బాధించకండి. అది ఇహ ఎక్కువకాలం బ్రతికే ఆశ ఎలాగూ లేదు. ఈ దినాన్ని తలచుకొని భావి జీవితంలో మీరు దుఃఖించాల్సి ఉంటుంది" అంది దీనంగా అల్లుడి ముఖంలోకి చూస్తూ రాజ్యలక్ష్మితల్లి రాఘవమ్మ. అత్తగారు అన్న ఆఖరువాక్యం ధర్మారావుహృదయాన్ని సూటిగా వెళ్లి పొడిచింది. దాంతో అతని హృదయానికి కప్పివున్న ఏదో తెర కొంత చినిగింది. రాజ్యలక్ష్మి మూలుగుతూ వున్న గదిలోకి ధర్మారావు తలుపు త్రోసుకొని వెళ్లాడు. భర్తను చూచి తెలియని ఉద్రేకంతో రాజ్యలక్ష్మి మంచంమీదనుంచీ లేవాలని లేవబోయింది. ధర్మారావు ఉండబట్టలేక భార్యను రెండు చేతులతో పట్టుకొని వారించి, పడుకోబెట్టాడు. రాజ్యలక్ష్మి తన శరీరానికి భర్త హృదయపూర్వకపు స్పర్శ తగలగానే ఎంతో ఆనందం, తెలియని సౌఖ్యానుభూతినీ పొందింది.

కొంతసేపటికి లేని ఓపిక తెచ్చుకొని రాజ్యలక్ష్మి భర్తముఖంలోకి చూస్తూ "క్షమించండి. మీరు నావల్ల ఏఒక్కరోజూ సుఖాన్ని పొందలేదు. భగవంతుడు యిచ్చిన యీ కురూప దేహాన్ని నే మార్చలేకపోయాను. ఏం చేసేది? అందుకే ఈ దేహాన్ని ఎంత త్వరగా వాలిస్తే అంత మంచిదనుకొంటున్నాను. అవసానకాలంలో నాదొక చిన్న కోరిక వుంది. పాలిస్తారా?" అని దీనంగా భర్తముఖంలోకి చూస్తూ రాజ్యలక్ష్మి అడిగింది.

ధర్మారావు హృదయం కరిగి "ఏమిటా రాజ్యం?" అన్నాడు ఆదరణగా... భర్త హృదయపూర్వకపు పిలుపు రాజ్యలక్ష్మిని తన్మయురాలుగా చేసింది. కాసేపు మాట్లాడలేక ఆనందంలో ఊరుకొన్నది. ఆమెముఖంలో వెల్లి విరిసిన ఆనందరేఖలు ధర్మారావు హృదయాన్ని కప్పివున్న తెరను పూర్తిగా తొలిగించాయి. ఆమెలో భౌతిక పశుత్వ సౌందర్యం కండలు, కండలుగా తిరిగి లేకపోయినా, ఎంతో హృదయవికాసం, ఆత్మసౌందర్యం ఉందని ధర్మారావు గ్రహించగలిగాడు.

"ఆ...ఏమీ లేదు. నా అనంతరంకూడ మీ గిలా జీవితంలో వెలుగు, సుఖం అంటూ లేకుండా బ్రతకటం నాకు ఎంతో బాధ. మీరు, నే పోయినాక, మీకు నచ్చిన మరో పిల్లని చేసుకొని కొన్నిరోజులన్నా జీవితం హాయిగా వెళ్లబుచ్చాలి. ఇదే నే కోరేది! అన్ని అవకాశాలు, శక్తిగల మీలాంటి వ్యక్తి ఇన్నాళ్లే గాకుండా, ఇహముందుకూడ యిలాగే బ్రతకటం నా అంతరాత్మకు యిష్టం లేని పని." అంటూ రాజ్యలక్ష్మి చేతిలో చెయ్యి వెయ్యమన్నట్లుగా భర్తముఖంలోకి చూచింది.

ధర్మారావుకు తానేదో జ్ఞానోపదేశం పొందుతున్నట్లుగా ఉంది. భార్యకోరిక ధర్మారావుకు ఆమె హృదయంలో భర్తపై గాఢంగా పేరుకొని వున్న అనురాగాన్ని విప్పి చూపింది. ధర్మారావు భార్య ముఖంలోకి పదే పదే చూడసాగాడు. ఆమెలో గల అందవికారం ఇప్పుడతని కంటికి వెతుకుదామన్నా, కల్పించుకొందామన్నా అందకుండా బోయింది. ఒకసారిగా కుర్చీలో కూర్చొని వున్నవాడు కాస్తా లేచి వెళ్లి, భార్యపక్కలో కూర్చొని, ఆమెను తన చేతుల్లోకి తీసుకొని నుదటిపై ముద్దు పెట్టాడు. కూతురుకు మందు ఇవ్వటానికై గది తలుపు త్రోసిన రాఘవమ్మ యీ దృశ్యం చూచి ఆశ్చర్యపడ్డది.

క్రమంగా నెలరోజుల్లో రాజ్యలక్ష్మికి కులాసా చిక్కింది. భార్య పూర్తిగా ఆరోగ్యవంతురాలయ్యిందాక ధర్మారావు ఇంటికి వెళ్లలేదు.

రాజ్యలక్ష్మి ధర్మారావులు కలిసి మెలిసి ఆనందంతో కాపురం చెయ్యటంలో గల పరిణామాన్ని అర్థం చేసుకోలేక లోకం తెల్లబోవుతూ ఉంది.

అశోకుడు

(10 వ పేజీ తరువాయి)

అ: ఓహహో! మేం శాశ్వతులం గా మార్యమతస్థుల మన్నాంగా? కాకపోయినా మా పాకశాల మా ఒక్కరి రుచి కనుకూలించడానికే యేర్పడ్డదా? దాన్లో దేవేన్ద్ర వుండేవారు—కొన్ని వందలమంది. వాళ్లలో నెవరి కేది రుచించేనో? మా కదంతి పట్టింపు లా!

నే: చిత్తం: దేవేన్ద్రంటే కలింగ రాజకుమార్తె......

అ: ఆ. ఆమె వుండేవారు; వారు బౌద్ధులు.

నే: తామ కారుగా?

అ: (చిరునవ్వుతో) వారు మావద్ద నుండడానికీ, మేం బౌద్ధులం గాకపోవడానికీ యేమి లోఁకా సంబంధం?

నే: తమ రశోకాండ్ర నే పేరు విన్నారండీ!

అ: (ఆశ్చర్యంతో) ఏమిటి, అశోకాండ్రా? అ దేవదారం, రామా, రప్పా!

నే: అదేమి స్వామీ, అల్లా గంటారు! ఆయన ప్రపంచవీరుల్లో నొకరు! తమతాతగారి కాలంలో వచ్చాడని, ఏవేవో చేశారని అనుకుంటూనే మా కాలంవాండ్లు!

అ: ఆయ వెవరో, ఆయన పేరుకూడా మేం వినలా. మాతర్వా తెవడైనా వచ్చాడేమో?

నే: (ఆశ్చర్యపడి చూస్తుంటూ.)

అ: ఎందుకట్లా చూస్తావ్? మీకాలం వాండ్లకు మన చరిత్ర బాగా తెలుసునని వారి నమ్మకం, నినమ్మకం గాబోలు. మా తర్వాత వచ్చేవాడెవడైనా అది కనుక్కో. వాండ్లేమైనా చెప్పగలరేమో!

నే: చిత్తం: తమ సామ్రాజ్యంలో పరిపాలనాక్రమ మెప్పటిదండీ?

అ: అదేమిటోయ్, మీకాలం వాండ్ల ప్రశ్నలు కొన్ని మా కర్థం గావు. పరిపాలనాక్రమ మెప్పటిదంటే, మా కెట్లా తోస్తుందంటే—తమ కట్టెప్పటిది, తమ భోజనవిధాన మెప్పటిదీ అన్నట్లుంటుంది. దాని మొద లెవరు చెప్పగలరు? అనుశ్రుతంగా వస్తూన్న పరిపాలనాక్రమ మది. దాన్ని కాలానుగుణ్యంగా బుద్ధిమంతులు మారుస్తూ వుంటారు. మా వంశం వారి సామ్రాజ్య మేర్పడగానే కొన్ని మార్పు లేర్పడ్డాయి; అదికూడా అట్టే లేదు. ఎందువల్లనంటే మహాపద్మనందుడింతకు మించిన రాజ్యాన్ని పాలించాడుగా, రాక్షసమంత్రి సలహాతో. దాన్నంతా సంపుటంజేసి వారి అనుభవాన్ని బట్టి, అప్పటి యవసరాన్ని బట్టి చాణక్యులవారు కొన్ని చిన్న మార్పులు జేసి, వారి అర్థశాస్త్రాన్ని నిర్మించారు.

నే: చిత్తం. ఆ క్రమాన్ని కొంచెం క్లుప్తంగా సెలవిప్పించి నన్ను కృతార్థుణ్ణి చేయండి.

అ: ఏముందోయ్? సామ్రాజ్యపరిపాలన్నే తగ్గట్టు మార్చి మండలానికి, దాన్నట్లాగే మార్చి రాష్ట్రానికి, దాన్ని తగుమాత్రం మార్చి నగరానికీ, గ్రామానికి యేర్పరిచాం.

నే. అన్ని పంచాయితీ లేమిటండీ?

అ: అందులో నేముందోయ్? నలుగురికి సంబంధించింది పెద్దలు నలుగురు సంప్రదించి చేస్తే బాగుంటుంది ఒక్క వ్యక్తి నిర్ణయించడం కంటేనని మన పూర్వుల అభిప్రాయం. దాన్ననుసరించి అన్ని పంచాయితీలు కనుపిస్తాయ్. వాటి నిర్ణయాల్ను సామ్రాట్టు, మండలపతులు, రాష్ట్రపతులు, గ్రామాధికార్లు నెరవేర్చేవారు. ఆ నిర్ణయాలన్నిటికీ ధర్మశాస్త్ర మాధారం. దాన్ని మార్చాల్సిన అవసరం తటస్థిస్తే చక్రవర్తి ధర్మశాస్త్ర వేత్తల సభలో విచారించి మార్చేవారు.

నే: సైన్యానిక్కూడా నిన్ని అధికార్లుంటే పనెట్లా జరిగేది?

అ: సైన్యానికి సంతనవిషయంలో పంచాయితీల పాటుండేవికాని కార్యనిర్వాహక విషయం చక్రవర్తిగారి ఆజ్ఞ ననుసరించుండేది: అది సేనాపతులద్వారా జరిగేది.

నే: చిత్తం. సైన్యమంటే జ్ఞాపక మొస్తూంది. తమ రాజనీతివల్ల ప్రజల యుద్ధపాటవం తప్పి దేశం బలహీన మైందంటా రేమిటండీ?

అ: ఏమోనోయ్. మే ముండగా మాకెక్కడా ఆ సూలిక కనుపించలా. అది తర్వాతి వారికి తెలియాల్సిన విషయం. మా మటుకు మాటూ విధవపాటవ మెట్లా బోతేనే మని, సామరస్యంతో తేలని తగాదా వుంటుందా? అసలు సత్ప్రవర్తనులకు తగాదా లెందుకొస్తాయీ అని అనుపించేది.

నే: చిత్తం: సామ్రాజ్యం తమ తర్వాతి తరంలోనే......

అ: ఆ. విచ్ఛిత్తైంది. ఏం జేస్తామోయ్? ఎంతవారన్నా పుత్రుల్ను గనగలరు గాని వారి గీతల్ను, బుద్ధుల్నుగూడా కనగలరా? ముగ్గుర్ని పిలిచి "నాయన్లారా, పెద్దవారి మాటపలుకుల్లో నిద్దరూ వుండి సమిష్టిత్వం చెడకుండా చూడండి"అని చెప్పాం. వాండ్ల సమర్థ కుదరక విభజించుకుని తర్వాతకూడా మీది మంచిది, మాది చెడ్డదీ అనుకుని, యెంతో కృషిసల్పి మేం మూసేసిన యుద్ధప్రబంధాన్ని విప్పి ఒకటో రెండో ప్రకరణాలు చదివి పాడైనారు. పోనీ మే మేం జేయగలం? వాండ్ల గ్రహచారవశాత్తు ఏ రాక్షసులవారంటి మంత్రో లాకపోయ. ఉన్నర చిల్లరమంత్రులు, రాజులు తట్లాడితేనే మన పటాలు బాగా సాగుతాయని వాండ్లలో సమిష్టిలేసి విరోధాగ్నిని పెంచిరి. పోనీ యేం జేస్తాం?


నే: చిత్తం: అది బహువిచారకారణం.

అ: కాకే మాతుందోయ్. మా కాలాన్నట్లా ప్రకాశించమం దెవరు? అంత వెలుక్కు దగ్గ చీక టుండొద్దూ? మా తర్వాతవారికి మళ్లే సంతానంలో తగ్గవాడికే రాజ్య మొప్పగించే ఊహ మాకు తట్టలా. సరే కానీ, యిక వెళ్తాం. బౌద్ధులకుగూడా స్వర్గంలో స్థానా లేర్పరిచే ఆలోచన్లు జరుగుచున్నాయ్. దాన్లో మా సలహా అవసరం.


నే: చిత్తం: స్వామి, శ్రమ, క్షమించండి.

అ: ఏం శ్రమోయ్? (నిష్క్రమించి)

హైదరాబాద



మేజర్ జనరల్ చౌదరి, హైదరాబాద్ నవాబు.



హైదరాబాద్‌లో శాంతి, మతసామరస్యసాధనకు సంస్థాన సైనికదళములతో భారతపటాలములు నగరవీథులలో
నిరంతరం సంచారంచేస్తూ వీథిమూలలలో సభలేర్పాటుచేసి సామరస్యప్రబోధం చేస్తున్నారు

★

వార్తా చిత్రాలు


FARMAN.

It has been brought to my notice and I have also seen in the foreign press that statements have been made to the effect that I am acting under duress and that I am not allowed free movement, in short, that I am not a free agent in any matter.


(2) This is absolutely incorrect. On the contrary, my relations with the Indian Union and the Military Administration are extremely cordial and no pressure of any kind is being brought on me; in fact, I am paid all the respect and the courtesy due to the high position I hold as Head of the state.

5th October 1948.

విదేశపత్రికలలో జరుగుచున్న అసత్యప్రచారాన్ని ఖండిస్తూ నైజాం అక్టోబరు 5వ తేదీన జారీచేసిన ఫర్మానా



విజయవాడరంగసేనాపతి బ్రిగడీర్ మాధవసింహాజీకి 10-వ తేదీన
విజయవాడలో సన్మానము



హైదరాబాదు సిటీలో కాపలాకాయుచున్న భారతసైనికులు

Regd. No M. 4479

శ్రీమద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు గారు



ఐదవ ముద్రణము

సంస్కృతమూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ
వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన
పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు


వెల రు 4-0-0 లు.

తపాలాఖర్చు రు. 0-9-0.

పోస్టుబాక్సు 212, **ఆంధ్రగ్రంథమాల** మదరాసు 1.

గాంధీ మహాత్ముని

ఆత్మకథ



రెండు సంపుటములు

[చతుర్థ ముద్రణము]

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి అనువాదము

ఖద్దరు బైండు

ప్రతిసంపుటము పోస్టేజితో సహా వెల రూ. 5-9-0


ఒకేసారి 2 సంపుటములు పోస్టేజితో రు 10-12-0

కళాప్రపూర్ణ

కీ॥ శే॥ కాశీనాధుని నాగేశ్వరరావు గారి

ఉత్కృష్టరచన

ఆంధ్ర వాఙ్మయ చరిత్ర



సరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష.
వెయ్యేండ్ల వాఙ్మయచరిత్రకు విశుద్ధదర్పణం. పాతచరిత్రల నన్నిటిని అవలోకనచేసి,
సమన్వయించి క్రోడీకరించిన సిసలయిన చరిత్ర.

శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండిఉండి, నన్నయ ధర్మమా
అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైటపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన
వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం

వెల రు 2-0-0లు, తపాలాఖర్చు ప్రత్యేకము;

ఆంధ్రగ్రంథమాల,

పోస్టు బాక్సు నం. 212, మదరాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press 7, Thambu Chetty St. G. T. Madras.